హైదరాబాద్
సోమవారం
26-2-2018
సంపుటి: 2, సంచిక: 88
పేజీలు: 12+16, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



అమరపురికి అతిలోకసుందరి

• దేవీ.. మౌనమా..!

హీరోయిన్ శ్రీదేవి కన్నుమూత

- దుబాయ్‌లో కార్డియాక్ అరెస్టు.. పెళ్లికి వెళ్లి కుప్పకూలిన నటి
- ఐదు దశాబ్దాల సినీ అనుభవం.. నాలుగేళ్ల వయసులోనే తెరంగేట్రం
- 33 ఏళ్ల వయసులో వివాహం.. ఆరేళ్ల క్రితం సెకండ్ ఇన్నింగ్స్



లైట్స్ ఆఫ్..
స్టార్ట్ కెమెరా..
నో యాక్షన్..
మొత్తం ప్యాకప్..

టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, శాండల్‌వుడ్.. అన్ని వుడ్‌లలోనూ ఇదే పరిస్థితి. తెల్లవారి గాఢనిద్రలో ఉండగా ఒకేసారి ఉన్నట్టుండి సెల్‌ఫోన్‌లో నోటిఫికేషన్లు. ఇప్పుడేంటా అని చూస్తే.. 'ప్రముఖ నటి శ్రీదేవి కన్నుమూత'. ఆ.. ఎవరో జూనియర్ ఆర్టిస్టు శ్రీదేవి లేదా బాగా పాత రోజుల్లో ఇంకెవరో శ్రీదేవి ఉండి ఉంటారులే, మన శ్రీదేవి కాదనుకుని కాసేపు వదిలేశా. మళ్లీ మనసు

మిగతా 6లో..



అణుబాంబుల్లా రైతు సమితులు

సమస్యల పరిష్కారంలో ఆ స్థాయిలో పనిచేయాలి

- అన్నదాతల సమస్యలను పరిష్కరించాలి
- పంటలకు మద్దతు ధర రాబట్టాలి
- ఆ బరువు బాధ్యత రైతు సమితులదే
- సమితి రాష్ట్ర అధ్యక్షుడి చేతిలో 7 వేల కోట్లు
- మండలానికి 10 నాట్లు వేసే యంత్రాలు
- 50 శాతం సబ్సిడీతో అందజేస్తాం..
- 75 శాతం సబ్సిడీతో టార్పాలిన్లు..
- రైతు సమన్వయ సమితి సదస్సుల్లో కేసీఆర్
- సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (మనం ప్రతినిధి):

వ్యవసాయం అంటే వాణిజ్యం కాదని.. అది జీవన విధానమని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం విషయంలో రైతు సమన్వయ సమితులు అణుబాంబులా మారాలని పిలుపునిచ్చారు. రైతుల్ని గ్రామాల్లో చైతన్యవంతుల్ని చేయాలని పిలుపునిచ్చారు. రైతు సమితులు అన్నదాతలకు

మిగతా 6లో..



ఉరకలేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బస్సు యాత్రకు సర్వం సిద్ధం

నేడు 10 గంటలకు యాత్ర ప్రారంభం

విజయవంతం చేయండి: ఉత్తమ్

2లో..

రాజ్యసభ సీటు ఎవరికి!

టీఆర్ఎస్‌లో ఆశావహుల జోష్

ఉద్యమకారులకే కేసీఆర్ పెద్దపీట

ఇప్పటికే జోగినపల్లి పేరు ఖరారు

ఒకటి యాదవులకు?

మరో సీటుపై నెలకొన్న ఉత్కంఠ

3లో..

ఇదీలోకం!



కోట్ల రూపాయలను కొల్లగొట్టిన మనుషుల్ని వదిలేసి, కోట్ల హృదయాలను గెలుచుకున్న అతిలోక సుందరి మా శ్రీదేవిని మా నుంచి ఎందుకు తీసుకెళ్లారు స్వామీ..!?

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రిపూట చలిగాలుల తీవ్రత కొనసాగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 35 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 34 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథిః ఏకాదశి సా.5.29 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర ఉ.8.00, పునర్వసు తె.5.58; వర్జ్యం: సా.6.59 - 8.27; దుర్ముహూర్తం: మ.12.06 - 12.52, మ.3.12 - 3.59; రాహుకాలం: ఉ.8.07 - 9.35; అమృతఘడియలు: రా.10.49 - 12.17; శుభసమయం : ఉ.6.00 - 7.00

సూర్యోదయం: 6.40

సూర్యాస్తమయం: 6.18

• అమ్మకాలకు కాదు.. పంపకాలకు..




వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన కిసాన్‌మేళాలో లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

2లో..

సైబర్ నేరాలకు చెక్

ఎథికల్ హ్యాకింగ్‌తో సాధ్యమే.. చిన్నపాటి చర్యలతో సిస్టంలకు రక్షణ





- ఫేస్‌బుక్.. వెబ్‌సైట్‌లకూ హ్యాకింగ్ ముప్పు
- ఎథికల్ హ్యాకింగ్ సదస్సులో నిపుణులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25:

కంప్యూటర్లు వచ్చిన తర్వాత ప్రపంచమే మారిపోయింది. ఇక స్మార్ట్‌ఫోన్లు, ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్, ఫేస్‌బుక్.. ఇవన్నీ అందుబాటులోకి వచ్చాక మరిన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే కంప్యూటర్ వాడే ప్రతి ఒక్కరికీ.. ఆ మాటకొస్తే స్మార్ట్ ఫోన్ వాడే వారికి కూడా లోలోపల పొంచి ఉండే పెద్ద భయం.. హ్యాకింగ్! తమ సిస్టంను ఎవరైనా హ్యాక్ చేస్తే ఎలా అనే ఆందోళన ప్రతి ఒక్కరికీ ఉంది. కంప్యూటర్‌లో ఉండే విలువైన సమాచారం అవతలివాళ్ల చేతుల్లోకి వెళ్లిపోవడమే కాక.. అసలు మన సమాచారం మనకు దక్కుతుందా లేదా అనేది కూడా చెప్పలేం. ఇటీవలి

మిగతా 9లో..

విశాఖలోనూ డ్రగ్స్ భూతం

ఇంజనీరింగ్ విద్యార్థుల వద్ద ఎల్ఎస్‌డీ.. గోవా, బెంగళూరులలో కొనుగోలు



- గంజాయి ఇచ్చి ఎల్ఎస్‌డీ మారకం
- పర్యాటకుల్లా వెళ్లి గంజాయి కొనుగోలు
- మోటారుసైకిళ్లపై తెస్తున్న విద్యార్థులు
- కిలోల్లో ఇచ్చి.. గ్రాముల్లో ఎల్ఎస్‌డీ
- విశాఖ పోలీసుల విచారణలో వెల్లడి



విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (మనం న్యూస్‌బ్యూరో):

ఉదయించే సూర్యుడి అందాలు చూడాలంటే విశాఖపట్నానికే రావాలని చెబుతారు. కానీ.. ఇప్పుడీ విశాఖలో ఎల్ఎస్‌డీ కలకలం రేపుతోంది. గత ఏడాది హైదరాబాద్‌లో పలువురు సినీ

మిగతా 6లో..



ఆధ్యాత్మికతకు భారత్ కేంద్రం

- అనాది నుంచి ఆ సంస్కృతి ఉంది
- భిన్నమతాలు, సంస్కృతులకు కేంద్రం: మోదీ

7లో..

దేశం గర్వించేలా తెలంగాణ

- అభివృద్ధిలో రాష్ట్రం ముందడుగు
- నర్సంపేట కిసాన్ మేళాలో కడియం
- రైతులకు సబ్సిడీ ట్రాక్టర్‌ల అందజేత
- రూ.8.70 కోట్ల ట్రాక్టర్ల పంపిణీ

నర్సంపేట(వరంగల్), ఫిబ్రవరి 25(మనం న్యూస్): భారతదేశం గర్వపడే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో ముందడుగువేస్తుందని డిప్యూటి సీఎం కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన కిసాన్‌మేళా కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. సివిల్ సప్లై చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 8.70 కోట్ల రూపాయల విలువైన 270 సబ్సీడీ ట్రాక్టర్‌లను రైతులకు అందించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర రిజర్వు కోటా నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రితో పలుమార్లు మాట్లాడి 270 ట్రాక్టర్‌లను మంజూరు చేశామన్నారు. అధికారం చేపట్టిన మూడున్నర ఏళ్ల కాలంలో 35.40 లక్షల రైతు కుటుంబాలకు 16వేల కోట్ల రుణమాఫీని చేశామని వివరించారు. రైతులకు రెండు పంటలకు నీరందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్లు కడియం వివరించారు. 500 కోట్ల రూపాయల వ్యయంతో దేవాదుల నుంచి రామప్ప, రంగాయ చెరువు నుంచి పాకాల సరస్సులోనికి నీటిని అందించి లక్ష ఎకరాలకు నీరందించడం ప్రణాళికాబద్ధంగా రూపకల్పన చేసి పనులను చేపట్టడం జరిగిందన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని 44వేల రైతు కుటుంబాలకు 190కోట్ల రుణాలు మాఫీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 51.12వేల రైతులకు రుణామాఫీ చేయడం తోపాటు వారి భూముల్లో రెండు పంటలు పండించడానికి నీరందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందన్నారు. రైతులకు ఈ ఏడాది నుండే ఖరీఫ్‌కు 4వేలు, యాసంగికి 4వేల రూపాయలు ప్రభుత్వమే విత్తనాలు, ఎరువులు, ఇతర క్రిమిసంహారక మందుల కొనుగోలు కోసం పెట్టుబడి రైతుల బ్యాంక్ ఖాతాలలో జమచేస్తుందన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి రైతులు వ్యవసాయం చేసుకోవడానికి సహాయం చేసే ప్రభుత్వం దేశంలో ఒక తెలంగాణ రాష్ట్రమేనన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రైతే నిర్ణయించే విధంగా రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీలలో రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పంటలకు ధరలను నిర్ణయించేది వారేనన్నారు. ఈ కిసాన్‌మేళా కార్యక్రమంలో ఎంపిక చేసిన రైతులకు కడియం శ్రీహరి, మహబూబాబాద్ ఎంపి అజ్మీరా సీతారాంనాయక్, రూరల్ జిల్లా ఇంచార్జీ కలెక్టర్ హరిత, వ్యవసాయ సంచాలకులు ఉషాదయాల్, ఆర్డీవో ఎన్.రవి, జెడ్పి ఉపాధ్యక్షుడు చెట్టుపెల్లి మురళీధర్‌తోపాటు పలువురు నాయకులు రైతులకు ట్రాక్టర్‌లను అందజేశారు. ఒక్కొక్క రైతుకు నేరుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ట్రాక్టర్‌లు, హర్వేష్టర్‌లు, రోటేవేటర్‌లు, ట్రిల్లర్‌లతోపాటు పసుపు ఉడికించే యంత్రాలకు సంబందించిన పత్రాలను, తాళాలు అందజేశారు. నర్సంపేట పట్టణంలో భారీగా ట్రాక్టర్‌లతో ర్యాలీని నిర్వహించారు.



నర్సంపేట కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న డిప్యూటి సీఎం కడియం శ్రీహరి



చార్మినార్‌లో 5 కె రన్ ప్రారంభించిన డీజీపీ మహేందర్ రెడ్డి

ప్రతీ స్టేషన్‌లో ఇంకుడు గుంతలు

- 5 కె రన్ ప్రారంభోత్సవంలో డీజీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): 'జలం-జీవం'లో భాగంగా పోలీసు శాఖకు చెందిన ప్రతి కార్యాలయంలోనూ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జలమండలి, పోలీసు శాఖ సంయుక్తంగా చార్మినార్ నుంచి బార్కాస్ వరకు చేపట్టిన 5కె రన్‌ను జలమండలి ఎండీ దానకిషోర్, చార్మినార్ ఎమ్మెల్యే పాషాఖాద్రీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. వీరితో పాటు వేల సంఖ్యలో అధికారులు, పోలీసు సిబ్బంది, యువకులు 5 కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీసుస్టేషన్, పోలీసు కార్యాలయాల్లో తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించాలని పోలీసులకు పిలుపునిచ్చారు. జలమండలి ఎండీ దానకిషోర్ మాట్లాడుతూ నేడు ఇంకుడుగుంతలు నిర్మిస్తేనే భవిష్యత్ తరాలకు నీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. నేడు మనం నిర్మించే ఇంకుడుగుంతల వల్ల భవిష్యత్ తరాలకు నీటిని దాచి ఇచ్చినట్లు అవుతుందని, వారికి ఎలాంటి ఇబ్బందులు రావని తెలిపారు. చార్మినార్ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొన్నప్పుడే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.



పాతబస్తీలో బయటపడిన సొరంగం(ఇన్‌సెట్‌లో) ఫిరంగి గుండ్లు

పాతబస్తీలో బయటపడ్డ 'సొరంగం'

హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): హైదరాబాద్ డబీర్‌పురాలో అత్యంత పురతనకాలం నాటి ఓ సొరంగం బయటపడింది. ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఆదివారం దీన్ని గుర్తించారు. ఆ సొరంగంలో నిజాం కాలం నాటి పలు వస్తువులు, ఫిరంగి, తూటాలు లభ్యమయ్యాయి. సొరంగం బయటపడిందన్న వార్త స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలుసుకున్న పోలీసులు, పురావ స్తుశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సొరంగం ఎప్పుడు తవ్వారనే కోణంతో పాటు ఇతరత్రా అంశాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సొరంగాన్ని పరిశీలిస్తున్నారు. అయితే ఈ సొరంగాన్ని చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఆ సొరంగం గురించి పునరావస్తు శాఖ అధికారులు ఇప్పటికే పరిశోధన మొదలుపెట్టారు. ఈ ఘటనపై మరింత సమాచారం అందాల్సి ఉంది.

టీఐఎస్‌ఎస్ విద్యార్థులకు విరసం మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్పుల నిలిపివేతను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్) విద్యార్థులకు విప్లవ రచయితల సంఘం(విరసం) మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను నిలిపివేయడం, ప్రవేశ సమయంలో ఫీజులు మినహాయిస్తామని చెప్పిన కళాశాల యాజమాన్యం, ఇప్పుడు వాటిని కట్టాలని విద్యార్థులకు నోటీసులిచ్చింది. దీంతో ఫిబ్రవరి 21 నుంచి ముంబై, తుల్జాపూర్, గువహటి, హైదరాబాద్‌లోని టీఐఎస్‌ఎస్ క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. వీరికి మద్దతు తెలుపుతూ విరసం ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రభుత్వం, కళాశాల యాజమాన్య నిరంకుశ విధానాలతో ఫీజులు కట్టలేని విద్యార్థులు చదువులు మధ్యలో వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రకటనలో పేర్కొంది. రీసెర్చ్ ఫెలోషిప్స్ తీసేయడం, సామాజిక శాస్త్రాల పరిశోధనలకు గ్రాంట్లు తొలగించడం మొదలుకొని, ఏటా బడ్జెట్‌లోనూ విద్యకు కేటాయించే నిధులను ప్రభుత్వాలు తగ్గిస్తూ వస్తున్నాయని ఆరోపించింది. ఈ విధంగా పేద, దళిత విద్యార్థులకు విద్యను దూరం చేసే చర్యలను, విద్య కార్పొరేటీకరణను ప్రజాస్వామికవాదులు నిరసించాలని విరసం విజ్ఞప్తి చేసింది.

నేటి నుంచి టీటీడీపీ ఆరో బ్యాచ్ శిక్షణ తరగతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): నాయకులుగా ఎదిగినవారు పార్టీ వీడుతుండడంతో కొత్త నాయకత్వాన్ని తయారు చేసే పనిలో టీటీడీపీ అధిష్టానం తలమునకలై ఉంది. ఇందులో భాగంగానే ఇటీవల పార్టీ మండల స్థాయి కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించింది. సోమవారం నుంచి ఆరో బ్యాచ్ తరగతులు ఎన్టీఆర్ భవన్‌లో ప్రారంభంకానున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ ఈ తరగతులను ప్రారంభించనున్నారు.

ఉరకలేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు..

బస్సు యాత్రకు సర్వం సిద్ధం

నేడు 10 గంటలకు యాత్ర ప్రారంభం



హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ప్రజా చైతన్య యాత్రకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. సోమవారం ఉదయం నాంపల్లి దర్గాలో పూజల అనంతరం పది గంటలకు యాత్ర ప్రారంభం కానుంది. 11 గంటలకు ఆరే మైసమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు, 12 గంటలకు మొయినాబాద్ వద్ద చర్చిలో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ఒంటి గంటకు యాత్ర చేవేళ్ళకు చేరుకోనుంది. అక్కడ బహిరంగ సభలో నేతలు ప్రసంగించనున్నారు. సాయంత్రం వికారాబాద్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. రాత్రి అక్కడే బస చేసి స్థానిక నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ అంశాలపై ఉత్తమ్ చర్చిస్తారు. మరుసటి రోజు మధ్యాహ్నం యాత్ర తాండూరుకు చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. అక్కడ బహిరంగ సభ అనంతరం సంగారెడ్డికి బయలుదేరుతారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, నిరంకుశత్వం, కుటుంబ పాలన, అప్పులు, అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘన, దళిత, గిరిజన, బి.సి మైనారిటీ ప్రజలపైన దాడులు, విద్యార్థి, యువజన వర్గాలపై నిర్లక్ష్యం, మహిళలను అవమానపర్చడం లాంటి అనేక అంశాలపై ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకొస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారులపై ప్రస్తుత పాలకులు చేస్తున్న దౌర్జన్యం, తెలంగాణ వ్యతిరేక శక్తులకు ఇస్తున్న ప్రాధాన్యత, రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న కష్ట, నష్టాలు, మద్దతు ధరలు లేకపోవడం, రైతుల ఆత్మహత్యలు, వీటితోపాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, మినీ మేనిఫెస్టో, తదితర అనేక అంశాలపై ఒక స్పష్టమైన వైఖరిని ఈ యాత్రలో ప్రకటిస్తామని నాయకులు చెబుతున్నారు.

యాత్రను విజయవంతం చేయండి: ఉత్తమ్



ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాల్సిందిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరా భవన్‌లో జరిగిన ఎన్ఎస్‌యూఐ ఆత్మీయ సమ్మేళనంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన సమాచారం మేరకు డిసెంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశముందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. బూత్ కమిటీలు కచ్చితంగా వేయాలని, పార్టీ ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేయాలని ఎన్ఎస్‌యూఐ నేతలకు దిశానిర్దేశం చేశారు. అమెరికా కంటే భారత్‌లో స్మార్ట్ ఫోన్లు ఎక్కువగా వినియోగిస్తున్నారని, సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. మోదీ, కేసీఆర్ ఆకర్షణీయ హామీలతోనే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని ఉత్తమ్ అన్నారు. అవి మభ్యపెట్టే హామీలను తెలడంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే వాతావరణం ఏర్పడిందన్నారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా శ్రమిస్తే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఉత్తమ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

పాతాళానికి గంగమ్మ

24 గంటల విద్యుత్‌తో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- వేసవిలో మరింత లోతుకు..?
- ఎండిపోయే ప్రమాదంలో యాసంగి
- ఆందోళనలో రాష్ట్ర రైతాంగం..

హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 24 గంటల విద్యుత్ సరఫరాతో రైతాంగానికి రాత్రిపగలు తేడా లేకుండా బోరుమోటార్ల వద్ద పడిగాపులు కాసే బాధ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించిన.. వారం రోజులకే కథ అడ్డం తిరిగింది. మొదట సంబుర పడ్డ రైతులే.. వారం రోజులు తిరిగేసరికి భూగర్భ జలాలు పడిపోతున్నాయంటూ లబోదిబోమంటున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడంతో మోటార్లు 24 గంటలు నీటిని తోడేస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. గత ఏడాది మేలో రాష్ట్రవ్యాప్తంగా సగటున 9.85 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఈ యేడు మాత్రం జనవరిలోనే ఆ మేరకు తగ్గిపోయాయి. ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఏలా ఉంటుందోననే ఆందోళనను రైతాంగం వ్యక్తం చేస్తోంది.





రోజురోజుకు పడిపోతున్న నీటి మట్టం..

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాతో రైతన్నలకు అర్ధరాత్రి వ్యవసాయ బావుల వద్ద నిరీక్షించే పరిస్థితిని దూరం చేసింది. అయితే రోజురోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలే ప్రధాన అవరోధంగా మారింది. లోలోతుకు పడిపోయిన నీటిమట్టంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాతో రైతులు తమ పంటలకు నీళ్ల పారించేందుకు పడరాని పాట్లుపడ్డారు. అర్ధరాత్రి వేళల్లో పొలాల్లోకి వెళ్లి నీళ్ల పారించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం నిరంతర విద్యుత్ సరఫరాతో రైతులకు ఆ కష్టాల నుంచి విముక్తి లభించినట్టయ్యింది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెళ్లి బోరు ఆన్ చేసుకునేందుకు వీలుంటోందని రైతులు చెబుతున్నారు. కాన భూగర్భ జలాలే ప్రధాన అవాంతరంగా మారిందని వాపోతున్నారు. రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలమట్టంతో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడంతో బాగా లోతులో ఉన్న బోర్లు భూగర్భ జలాలను అధికంగా తోడేస్తున్నాయి. కొన్నిచోట్ల 800 నుంచి వెయ్యి అడుగుల లోతులో కూడా తవ్విన బోర్లు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. ఈ బోర్లు 24 గంటలు నడుస్తుండడంతో తక్కువ లోతులో ఉన్న బోర్లలో నీటి ప్రవాహం తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. దీనికితోడు భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉండే మే నెలలో ఎంత లోతుకు పడిపోతాయో.. 2017 మేలో సగటున రాష్ట్రవ్యాప్తంగా 9.85 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. కానీ ఈ ఏడాది మే నాటికి సగటున 21.5 మీటర్ల లోతుకు పడిపోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రైతుల మధ్య ఘర్షణ..

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పలుచోట్ల 24 గంటల విద్యుత్ సరఫరా కారణంగా రైతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. పెద్ద మొత్తంలో పంటలను సాగు చేస్తున్న రైతులు ఏర్పాటు చేసుకున్న అత్యాధునిక మోటార్ల కారణంగా తక్కువ లోతు, మాములు సామర్థ్యం కలిగిన బోర్లుబావుల్లో నీరు అందడం లేదు. ఫలితంగా వరుసగా మూడు నాలుగు రోజుల పాటు ఆ బావుల్లోకి నీరు ఊరడం లేదు. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు, స్థానిక సిబ్బందిని 24 గంటలు విద్యుత్ సరఫరా చేయోద్దని చెబుతుండగా, బడా రైతులు విద్యుత్ సరఫరాను కొనసాగించాలని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పక్క పక్కన బోర్లు ఉన్న రైతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల రైతులు విద్యుత్ సరఫరా వైర్లపై కండక్టర్ వైరు ముక్కలు విసిరేసి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నారు.

'రబీ' ఎండిపోయే ప్రమాదం

ప్రస్తుతం వేస్తున్న బోర్లన్నీ 800 నుంచి వెయ్యి అడుగుల లోతు వరకు వేస్తున్నారు. మూడు నాలుగేండ్ల క్రితం వరకు 100 నుంచి 200 అడుగుల లోతుకు మించి వేసిన బోర్లు చాలా అరుదు. దీంతో కొత్త బోర్ల దెబ్బకి పాతబోర్లు ఎండిపోతున్నాయి. అత్యాధునిక సామర్థ్యంతో బడా రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లు పాతళంలోని గంగను సైతం క్షణాల్లో తోడేస్తున్నాయి. ఫలితంగా సన్నకారు రైతుల బోర్లలో నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇదే పరిస్థితి మరో వారం రోజులు కొనసాగితే మార్చి మొదటివారంలోనే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోవడం ఖాయంగా కన్పిస్తోంది.

నీళ్లు తొందరగా అయిపోతున్నయ్..

ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరాతో భూమిలో ఉన్న నీళ్లు తొందరగా అయిపోతున్నయ్. దీనికితోడు తరచూ బోరుమోటార్లు కాలిపోతున్నయ్. 24 గంటల విద్యుత్ అవసరం లేదు. పగటిపూట తొమ్మిది గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తే సరిపోతది. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుంది.


- కంచర్ల మహేందర్‌రెడ్డి, కేతేపల్లి

బోరు మోటారు కాలిపోయింది..


రెండు రోజుల క్రితం పొలం కాడ బోరుమోటారు ఆన్ చేసి ఊరికిపోయిన. తొందరగా వస్తానని అనుకుంటే కొద్దిగా లేటయ్యింది. నేను వస్తారికే.. బోరుమోటారు కాలిపోయింది. 24 గంటల కరెంట్‌తో బోరు మోటార్లు కాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఒకసారి బోరుమోటారు పెడితే.. మనం మళ్లీ పొలం కాడికి పోయి బంద్ చేసే వరకు మోటారు నడుస్తనే ఉంటది. 24 గంటల కరెంటు ఇచ్చే కంటే పగటిపూట 10 గంటలు ఇస్తే చాలు.

- రాంబాబు, జాజిరెడ్డిగూడెం

ఫిరాయింపులకు పరాకాష్ట.. గుత్తా నియామకం: చాడ



హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): ప్రజాస్వామ్య మూలసూత్రాలకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం రైతు సమన్వయ కమిటీల ను ఏర్పాటు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. వ్యవసాయం పట్ల కనీస అవగాహనలేని, అంగన్‌వాడీ వంటి మిగతా వృత్తులలో ఉన్న టీఆర్ఎస్ నేతలను జిల్లా రైతు సమన్వయ కమిటీ సారథులుగా నియమించడం సిగ్గుచేటని చాడ విమర్శించారు. కాంగ్రెస్ తరపున ఎంపీగా గెలిచిన వ్యక్తిని రైతు సమన్వయ సవితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పార్టీ ఫిరాయింపులకు పరాకాష్టగా చాడ పేర్కొన్నారు. టీఆర్ఎస్ ముద్రతో ప్రజలపై అధికారాన్ని రుద్దడానికి బరితెగింపుకు రైతు సమన్వయ కమిటీలే నిదర్శనమని చాడ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇకనైనా కేసీఆర్ ఒంటెద్దు పోకడలు మానుకుని, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలన్నారు. రుణమాఫీ పూర్తి చేయాలని లేదంటే రైతులు తిరగబడతారని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో చాడ హెచ్చరించారు.



ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి: తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): బొన్సాయ్ మొక్కల పెంపకం వలన కలిగే ప్రయోజనాలు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహారాష్ట్రలోని పూణెలో ఈ నెల 22 నుంచి జరుగుతున్న బొన్సాయ్ అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటిలో బోన్సాయ్ మొక్కలు పెంచడం వలన తీవ్ర ఒత్తిడితో ఉన్న మనిషి సైతం ఉపశమనం పొందుతారని ఆయన తెలిపారు. ఇలాంటి సదస్సును హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. నానాటికీ పెరిగిపోతున్న కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ సదస్సులో దాదాపు 3 వేల బొన్సాయ్ మొక్కలను ప్రదర్శించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్.. వేదికపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తాసుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంపీ కేకే తదితరులు..




సీఎం కేసీఆర్‌కు నిలువెత్తు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రతినిధులు

అణుబాంబుల్లా రైతు సమితులు

(మొదటిపేజీ తరువాయి)

కాపలాదారులుగా ఉండాలని, వచ్చే సంవత్సరం నాటికి పంటల కాలనీలే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. రైతుల పెట్టుబడి పథకానికి బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయిస్తామని సీఎం వెల్లడించారు.మండల రైతు సమితుల వద్ద మండలాలు, గ్రామాలవారీగా పూర్తి సమాచారం ఉండాలని చెప్పారు. మండల రైతు సమన్వయ సమితులకు త్వరలోనే కంప్యూటర్, మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఒక గదిని కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర రాబట్టాల్సిన బాధ్యత సమితులదేనని, పంట మార్కెట్‌కు రాక ముందు కమీషన్ దారులతో మాట్లాడి కనీస మద్దతు ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఒకవేళ అలా సాధ్యం కాకపోతే.. రాష్ట్ర రైతు సమితి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని సూచించారు. ఇందుకు సంబంధించి సమితి రాష్ట్ర అధ్యక్షుడి చేతిలో రూ.7 వేల కోట్లు ఉంటాయని, రైతు సంఘం తరపున ధాన్యం కొనుగోళ్లు చేపడతారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమితులకు పర్మిషన్ ఇచ్చిందని, తద్వారా సమితులు లాభపడతాయని వివరించారు. సమితుల బాధ్యుతు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు పట్టుబట్టాలని, రాష్ట్రం మొత్తంలో ఈ సమితుల్లో 1.61 లక్షల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. గ్రామాలవారీగా సమితులు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చే సమయంలో నియంత్రిత్వ విధానంలోకి తీసుకువచ్చేలా సమితులు పనిచేయాలని తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై శిక్షణ ఇవ్వాలని, మండలానికి 10 నాట్లు వేసే యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్టు ప్రకటించారు.

రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా గుత్తా



ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోన్న రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడి పేరును సీఎం కేసీఆర్ ఆదివారం ఖరారు చేశారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సుల్లో ముందస్తు ఊహాగానాల ప్రకారమే.. నల్లగొండ పార్లమెంటు సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరును ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. సుఖేందర్‌రెడ్డి స్వయంగా 60 ఎకరాల్లో నేటికీ వ్యవసాయం చేస్తున్నారని, రైతుల బాధలు ఆయనకు పూర్తిగా తెలుసని, అందుకే ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్టు చెప్పారు. ఈ సదస్సులో మేడ్చల్, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జనగామ, వనపర్తి, గద్వాల్, వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సభ్యులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు కాలమైతేనే పంట..

రెతులకు గిట్టుబాటు ధర రాక.. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రెతులను అన్నివిధాలుగా ఆదుకునేందుకు రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేశామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో రైతుల బాధలు వర్ణనాతీతమని, విద్యుత్, జలాలు ఇచ్చే పరిస్థితి నాడు లేదని తెలిపారు. గతంలో కాలం మంచిగయినప్పుడు మాత్రమే వ్యవసాయం బాగుండేదని, నాటి ప్రభుత్వ అసమర్థల వల్ల పచ్చదనాన్ని తగ్గించడంతో కాలుష్యం పెరిగిందని అన్నారు. ఫలితంగా కరువు పరిస్థితులు సంభవిస్తున్నాయని, వర్షాలు పడకుంటే.. అసలే పడకపోవడం, పడితే అధికంగా కురిసి పంటలు నష్టపోతున్నారని వివరించారు. గతంలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని, దీన్ని సరిచేసేందుకు వంద రోజుల్లో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. 2020 నాటికి తెలంగాణలో కోటి ఎకరాలకు ప్రాజెక్టుల ద్వారానే సాగునీటిని అందిస్తామని, కల్వకుర్తి ప్రాంతానికి మొట్టమొదటిసారిగా సాగునీరు వెళుతుందని పేర్కొన్నారు. నిజాం కాలంలోనే నవాబులు చాలా చెరువులు తవ్వించారని, కాకతీయులు నిర్మించిన ఎన్నో చెరువులను ఆంధ్ర పాలకులు ధ్వంసం చేశారని వివరించారు. ధ్వంసమైన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ మిషన్ కాకతీయ పేరుతో పునరుద్ధరించామని, దీన్ని ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 141 సబ్‌రిజిస్ట్రార్లతో మండల తహశీల్దార్లకు రిజిస్ట్రేషన్ అధికారాలు ఇస్తున్నామని, పాస్‌పోర్టు ఇంటికి వచ్చిన మాదిరిగానే.. భూమి పాస్‌బుక్కులు ఇంటికి వస్తాయన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎవరూ ఆలస్యం చేసిన రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తామని తెలిపారు. రైతు సమన్వయ సమితి సభ్యులను దశలవారీగా ఇజ్రాయిల్ లోని పంటలను పరిశీలించేందుకు పంపిస్తామని పేర్కొన్నారు.

24 గంటల విద్యుత్‌ను కొనసాగిస్తాం..

ఏదీఏమైనప్పటికీ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ను కొనసాగిస్తామని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణలో విద్యుత్ పోవడం అనేది కలగా మారిం దని, ఆటో స్టార్టర్లను తొలగించాల్సిన బాధ్యత రైతు సమన్వయ సమితులపై ఉందన్నారు. మరో ఏడాది పాటు భూగర్భ జలాలను కాపాడుకుంటే సరిపోతుం దని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే రైతులు రెండు పంటలు పండిస్తారని, ఆ పంటల విలువ సుమారు రూ.1.25 కోట్లు ఉంటుందన్నారు.

నవంబర్ నుంచి 'ప్రీపెయిడ్'

పంటల సాగుకు ముందస్తు పెట్టుబడిగా అందించే ఎకరాకు రూ.4 వేలను నవంబర్(యాసంగి సీజన్) లో ప్రీపెయిడ్ కార్డుల రూపంలో నేరుగా ఖాతాలో జమచేయనున్నట్టు సీఎం కేసీఆర్ చెప్పారు. ఇందుకు సంబంధించి రైతులు ఎవరికీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఏలాంటి డబ్బులు చెల్లించొద్దని తెలిపారు. అధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులు ప్రీపెయిడ్ కార్డులను త్వరలోనే అందజేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మార్చి నెలలో మాత్రం డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెక్కులను రైతులకు అందజేస్తారని చెప్పారు.

ప్రతిపక్షాలు మొసలి కన్నీరు..

రైతుల విషయంలో ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని, రైతుల కన్నీరును మాత్రం తుడవడం లేదని సీఎం కేసీఆర్ తెలిపారు. రైతులకు లబ్ధి చేకూర్చే కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఏకంగా 200 కేసులు పెట్టారని, న్యాయమూర్తులే స్వయంగా ప్రతిపక్షాలకు చీవాట్లు పెడుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్, టీడీపీలు కనీసం ఏడు గంటలు నాణ్యమైన విద్యుత్ అందించ లేకపో యాయని విమర్శిం చారు. రైతు సమన్వయ సమితుల్లో ముమ్మాటికీ టీఆర్ఎస్ కార్యకర్తలే ఉంటారని తేల్చిచెప్పారు. ఉద్యమంలో 14 ఏండ్లపాటు తమ శ్రమను ధారపోశారని గుర్తు చేశారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైతం ముందస్తు పంట పెట్టుబడి పథకాన్ని అభినందించారని గుర్తు చేశారు.



75 శాతం సబ్సిడీతో టార్పాలిన్లు..


సదస్సులో భోజన విరామం అనంతరం సీఎం కేసీఆర్ రైతులతో ఇంటారాక్ట్ అయ్యారు. రైతుల ప్రశ్నలు, సందేహాలకు కులంకశంగా సమాధానాలిచ్చారు. పంటలను అడవి పందుల బెడద నుంచి కాపాడుకు నేందుకు వాటిని కాల్చి చంపొచ్చని.. అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సమయంలో పలువురు రైతులు టార్పాలిన్ (పట్టాలు)ను పూర్తిగా సబ్సిడీపై ఇవ్వాలని కోరగా, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల సహకారంతో 75 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్టు వివరించారు. పంటలకు గిట్టుబాటు ధర కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వీటి ద్వారా ఎక్కడికక్కడ ఉద్యాన పంటలను సైతం కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. సాధారణ పంటలతో పాటు ఉద్యాన పంటలకు పెట్టుబడి పథకం వర్తిస్తుందని వివరించారు. సదస్సులో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు,నాయిని నర్సింహారెడ్డి, మంత్రులు జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, హోంమంత్రి ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శంభీపూర్ రాజు, డి.శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, నల్లమోతు భాస్కర్‌రావు, బాబుమోహన్, శ్రీనివాస్‌గౌడ్, పైళ్ల శేఖర్‌రెడ్డి, వేముల వీరేశం, గొంగిడి సునీత, గువ్వల బాలరాజు, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీలు కె.కేశవరావు, మల్లారెడ్డి, నాయ కులు నోముల నర్సింహాయ్య, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రైతు సమితి సభ్యులకు శిక్షణ

రైతు సమన్వమ సమితి సభ్యులకు త్వరలోనే శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ సాగులో కీలకం ఉండే భూమి, నీరు, పెట్టుబడి, శాస్త్రీయ పరిజ్ఞానం, సరైన మద్దతు ధర కోసం మార్కెట్‌లో నియంత్రిత్వ విధానం పాటించడం వంటి అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. యూనివర్సిటీ రూపొందించిన ప్రణాళిక ఆధారంగా పంటలను సాగు చేసే అంశాల్లో రైతు సమితి సభ్యులకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ఇనిస్టిట్యూట్‌లో సమితి సభ్యులకు పూర్తిస్థాయిలో దశల వారీగా శిక్షణ తరగతులు ఉండనున్నాయి.

రైతు వేదికలకు సమితి సభ్యుల విరాళం..

రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా 5వేల ఎకరాలకు ఒక రైతు వేదికను నిర్మించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇందుకు ఒక్కో వేదికకు రూ.12 లక్షలు కేటాయిస్తున్నామని, స్థానికంగా ప్రభుత్వ స్థలం గానీ, దాతల నుంచి భూమిని సేకరించుకోవాల్సిన బాధ్యత రైతు సమితులదేనని చెప్పారు. ఈ ప్రకటన చేస్తున్న సమయంలోనే వనపర్తి జిల్లాకు చెందిన ఒక రైతు.. వేదిక కోసం ఎకరం స్థలం విరాళంగా ఇస్తున్నట్టు సీఎం కేసీఆర్‌కు తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన మరో రైతు ఎకరంన్నర స్థలం ఇవ్వగా, మరో రైతు వేదిక నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.12 లక్షలు ఇస్తానని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వీరితో పాటు మరికొంత మంది స్థలాలను విరాళంగా అందజేసేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా వారందరినీ సీఎం కేసీఆర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



సదస్సుకు హాజరైన 'రైతు సమన్వయ సమితి' సభ్యులు




రైతులకు ఏదైనా చేయాలని ప్రధానిని పదిసార్లు అడిగా

- 20 సార్లు లేఖలు రాశాను..: కేసీఆర్

రెతు సమస్యలపై స్పందించాలని పదిసార్లు అడిగినా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించలేదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఏదైనా చేయాలని 20 సార్లు లేఖ రాశానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడతామన్న వ్యవసాయ ఆదాయ రెట్టింపు పథకం నిర్మాణాత్మకంగా లేదని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయా నికి అనుసంధానం చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదని చెప్పారు. రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో సభ్యులందరూ ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసం ధానం చేయాలని తీర్మానం చేశారని, ఇది చూసైనా కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరవాలని సూచించారు.

వ్యవసాయం పండుగ కావాలి: పోచారం



వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అని నిరూపించేలా రైతు సమన్వయ సమితు లు పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసంఘటి తంగా ఉన్న రైతులను సంఘటిత పరిచేందుకు చేసిన ప్రయత్నమే రైతు సమన్వయ సమితులని చెప్పారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రైతు సమితులు ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎకరానికి రూ.8 వేలు, కోటిన్నర ఎకరాలకు సాగునీరు, 24 గంటల విద్యుత్.. రైతులను ధనవంతులుగా చేసేందుకు ఉపయోగపడా లన్నదే ఆశయమని తెలిపారు. గ్రామాలను వదిలి వెళ్లిపోయిన వారందరూ.. తిరిగి వచ్చి వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. విత్తనం వేసే దగ్గరి నుంచి పంట అమ్ముకునే వరకు రైతు సమన్వయ సమితులు వారధిగా నిలుస్తాయని వివరించారు.




అన్ని గ్రామాలను 'ఆలంపూర్'గా తీర్చిదిద్దాలి: కేసీఆర్



తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలను నిజామాబాద్ జిల్లాలోని ఆలంపూర్ గ్రామంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమితుల ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతూ ప్రతి గ్రామ రైతు సమన్వయ సమితి తమ గ్రామాన్ని ఆలంపూర్‌గా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఆలంపూర్ గ్రామం.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌ను తలదన్నేలా ఉంటుందని, ఒక్క గ్రామంలోనే రెండు బ్యాంకులకు చెందిన బ్రాంచ్‌లున్నాయని చెప్పారు. ఒకానొక దశలో ఒకేసారి 401 కార్లను కొనుగోలు చేసి విస్మయానికి గురిచేశారని తెలిపారు. ఇదంతా కేవలం.. వ్యవసాయం చేసి సాధ్యం చేశారని, అక్కడి రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు గ్రామంలోనే మార్కెట్‌ను నిర్మించుకున్నారని వివరించారు. వారి ధరలను వారే నిర్ణయించుకునేంత స్థాయికి ఎదిగారని.. ప్రతి సభ్యుడికి ఆలంపూర్ గ్రామాన్ని సందర్శించేలా చూస్తామని పేర్కొన్నారు.

కొత్త మండలాల్లోనూ గోదాంలు: హరీశ్‌రావు




గతంలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కేవలం నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం వాటిని 25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రూ.వెయ్యి కోట్లతో ఒకే సంవత్సరంలో 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యపు గోదాంలను నిర్మించామని, వీటితో మొత్తం రాష్ట్రంలో 22 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు కాగా, మరో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లోనూ వచ్చే 15 రోజుల్లో గోదాంలు నిర్మిస్తామని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా 35 మార్కెట్ యార్డులను నిర్మించుకున్నామని తెలిపారు.



2న బీసీ కుల సంఘాల భేటీ


- బీసీలకు బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించాలి: జాజుల



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి25(మనం ప్రతినిధి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి మార్చిలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన బీసీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తూ దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై బీసీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన నివేదికను అమలు చేయాలని ఆయన ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు జరిగిన అన్యాయం, జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల వాటా వివిధ డిమాండ్లపై రాష్ట్రంలోని 112 కులసంఘాల అన్ని బీసీ సంఘాలతో మార్చి 2న హైదరాబాద్‌లో బీసీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడంపై భవి ష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. అన్ని కులసంఘాలు, వృత్తిసంఘాలు, బీసీ సంఘాలనేతలు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

రాజ్యసభ సీటు ఎవరికి!

- టీఆర్ఎస్‌లో ఆశావహుల ఆశలు
- ఉద్యమకారులకే కేసీఆర్ పెద్దపీట
- ఇప్పటికే జోగినపల్లి పేరు ఖరారు
- మూడింటిలో ఒకటి యాదవులకు?
- మరో సీటుపై నెలకొన్న ఉత్కంఠ



హైదరాబాద్, ఫిబ్రవరి 25(మనం ప్రతినిధి): తెలంగాణలో.. ముఖ్యంగా అధికార టీఆర్ఎస్ రాజ్యసభ సీట్ల భర్తీపై రాజకీయ వేడి రాజుకుంది. రేసులో రోజుకో పేరు వినిపిస్తుండగా.. ఆశావహులు మాత్రం తమకే సీట్లు దక్కనుందని, ఈ మేరకు పార్టీ పెద్దల నుంచి హామీ లభించిందని ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు మార్చి ఐదున ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే.. ఉద్యమ సమయం నుంచే పార్టీలో పని చేస్తున్న వారికే సీటు దక్కనుందని ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ముఖ్యంగా సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ పేరు ముందువరుసలో కనిపిస్తోంది. అయితే..సంతోష్ పేరు ఇప్పటికే ఖరారైనట్లు వినికిడి. కాగా, మరో సీటును యాద వులకు ఇస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. మూడో సీటును ఎవరికి కేటాయిస్తారనేదానిపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మూడో సీటు రేసులో గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్ కె.రాజయ్య యాదవ్, గత ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తరపు నాగర్జునసాగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లు పేర్లు వినిపిస్తున్నాయి. టీఆర్ఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తుల ఉమ భర్త రాజేందర్ కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా సంచలన వ్యాఖ్యలతో టీఆర్ఎస్‌లో అలజడి రేపుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని రాజ్యసభను పంపుతారని కూడా భావిస్తున్నారు. ఎస్సీలను దగ్గర చేసుకునేందుకు మాజీ ఎంపీ మంద జగన్నాథం పేరు కూడా వినిపిస్తోంది. ఇక, టీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధపడ్డట్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో టీటీడీపీ నేత మోత్కుపల్లి నర్సింహులును టీఆర్ఎస్ తరపున రాజ్యసభకు పంపినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని విశ్లేషకులు అంటున్నారు. త్వరలోనే ఆయన కారు ఎక్కనున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. బీసీల పరంగా చూస్తే 'ఆసు' యంత్రాన్ని రూపొందించిన ఎగ్గం మల్లేశం, ముది రాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రకాశ్ రేసులో ఉన్నట్లు తెలిసింది.

మన సాహితి



◆ అట్టాడ అప్పల్నాయుడు



ఒక్క కళింగాంధ్రా అనేకాదు బహుశా తెలుగు నేలంతటా యిలాంటి ఆవిష్కరణలే జరిగివుండొచ్చు. నిర్దిష్టంగా కళింగాంధ్రకు వస్తే ఒక చాసో, ఒక రావిశాస్త్రి, కారా, పతంజలి, భూషణం, శ్రీపతి, రెడ్డిశాస్త్రి, అప్పల్నాయుడు, గౌరునాయుడు, బజరా నుంచి మల్లిపురం జగదీశ్, దాసరి రామచంద్రరావు, చందనపల్లి గోపాలరావు వంటి యెందరో కథకుల కథల్లో యీ కుదుళ్లను చూడగలం! స్థానీయతకు నిర్దిష్ట ప్రాంతం, అక్కడి జనజీవనం, జనుల వ్యవహారిక భాష, సంస్కృతీ మాత్రమేగాక వారి చారిత్రక పరిణామం, వారిని ప్రభావం చేసిన అన్ని అంశాలూ కలుపుకుంటే స్తానీయత విశాల అర్థమిస్తుంది. గురజాడ కథల్లో యివన్నీ కలగలసి కనిపిస్తాయి. వర్తమాన కళింగాంధ్రా కథల్లోంచి వెనకకు గురజాడ కథల్లోకి వెళ్లి చూస్తే యీ స్థానీయత కుదుళ్లను పోల్చుకోవచ్చు. ఇటీవల వార్తల్లో, చర్చల్లో ప్రముఖంగా కళింగాంధ్రాలో వినబడే కన్నెధారకొండ గురించి మల్లిపురం జగదీశ్ రాసిన 'బాకుడుంబారి' కథకు కుదుళ్లు రామతీర్థాలు కొండ చుట్టూ గురజాడ అల్లిన 'దేవుళ్లారా మీ పేరేమిటి?' కథలో చూడవచ్చు. గురజాడ 'దేవుళ్లారా మీ పేరేమిటి' కథలో ఒక ప్రాంతముంటుంది. ఆ ప్రాంత ప్రజల జీవితముంటుంది. వారి పలుకుబళ్లూ, వారి సంస్కృతీ, వారి సామాజిక జీవితమూ, చారిత్రక పరిణామమూ, వారిమీద పడిన అనేక అంశాల ప్రభావమూ నేపథ్యంగా మతాలపైన, దేవుళ్లపైన విమర్శగా కథ నడుస్తుంది.

కళింగాంధ్ర కథల్లో గురజాడ స్థానీయత జాడ!

''...పుల్లా! మా ఊరొచ్చేంరా. యిట్టి ఊరు భూప్రపంచంలో వుండబోదురా. కాళిదాసు అవంతిని ఉద్దేశించి చెప్పిన మాటలు దీనియందు వర్తిస్తున్నాయిరా. యేమి నది, యేమి ఊరు! ఇది శ్రీకాకుళేశ్వరుడి క్షేత్రము. యెట్టి మహాక్షేత్రమని చెప్పను?అదిగో'' అని యింకా యేదో చెప్పబోయి ముందర కనబడే దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై నిలిచి, కొంత తడవుమాటాడకుండెను... గురజాడ మతము-విమతము (పెద్దమసీదు) కథలో నారాయణభట్టు అనే పాత్ర కాశీ నుండి శిష్యుని తోడుతీసుకొని తన ఊరికి వస్తూ తన ఊరి ఘనతనూ, అక్కడి నదినీ, ఆలయాన్నీ వాటిచుట్టూ అల్లుకుపోయిన అలనాటి తీపిగుర్తులనూ పైవిధంగా శిష్యునితో చెపుతూ కనుచూపుకి ఆనిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడై మాటలు రాక నిలబడిపోతుంది. సరిగ్గా యీ కథ తొలిసారిగా చదివి నేను కూడా ఆ నారాయణభట్టులాగ నిశ్చేష్టుడనయిపోయేను. చాలాసేపేమీ తోచలేదు. లోలోపల యేమేమో జరుగుతోంది. రాజులూ, యుద్ధాలూ, మతాలూ, ఘర్షణలూ, శిథిలాల్లో మానవవేదనలూ, కూలిన నిర్మాణాలూ, లేచిన భవనాలూ మట్టిని ముట్టుకుంటే తడిగా తడితడిగా నెత్తురెవరిదో చేతికి తగిలినట్టు...గుండెల్లో యేనాటివో... మట్టిలో పొర్లాడిన నా తాతతండ్రుల ఉఛ్వాస నిశ్వాసలు కొట్టుకొని నన్ను ఉక్కిరిబిక్కిరి చేసినాయి!

వందేళ్లకు పైబడ్డ కథ యిది. ఆ ఊరు నేటి శ్రీకాకుళం. ఆ నది నాగావళినది. ఆ ఆలయం కోటేశ్వరాలయం! దూరం నుండే కంటికి కనబడిన దృశ్యం ఆలయం స్థానంలో మసీదు! ఇద్దరు బ్రాహ్మలు..మరో ముస్లిం పాత్రతో సంభాషణ! కనబడాల్సిన ఆలయ గోపురం స్థానంలో మసీదు శిఖరం యెలాగొచ్చింది? ఆలయం వద్ద వుండాల్సిన తన బంధువులే మయినారు... ప్రశ్నలు నారాయణభట్టులో యిదీ కథ! కథాంశాన్ని యెంతగా మలిచేడంటే ఆలయాలూ, మసీదులూ, మందిరాలూ కూల్చివేతలూ, మత మార్పిడులూ, మనుషులు పదిలంగా దాచుకునే తీపిగురుతుల చెరిపివేతలూ... యీ చిన్నకథ నాకు చూపింది. అంతేగాక ఈనాడు ముస్లింలుగా మిగిలిపోయినవాళ్ల కుదుళ్లు యీ దేశ సకల కులాల్లో వుండొచ్చన్న వాదనకు భూమికనిచ్చిందీ కథ! ఇంతేనా? ఒక్క శ్రీకాకుళమనే కాదు అనేక ఊళ్లు కళ్లముందరే మారి పోవడం, పంటపొలాలు భవంతులూ, అపార్టుమెంట్లూ కావడం, నదులు నీటినీ, యిసుక తిన్నెలనూ కోల్పోవడం, ఆలయశిఖరాలు అవెవరి పేర్లనో మోస్తూ నిలుచోవడం, దుంపలబడులు...కార్పొరేటు కారాగారాలు గావడం, వీధులు కార్లతో, మోటారు బళ్లతో మార్మ్రోగిపోవడం, రేతిరీ పగలూ మనుషులు కలతనిదురతో తుళ్లిపడడం... యెన్నెన్ని మార్పులు! అవన్నీ... పెద్దమసీదు కథ తలపుల్లోకి తెచ్చింది. అమ్మో అనుకున్నాను. అదేపనిగా గురజాద మిగిలిన కథలూ, కన్యాశుల్కం, కొండుభట్టీయం నాటకాలు, ముత్యాలసరాలు, పుత్తడిమ్మ పూర్ణమ్మ వగయిరా కవితలూ చదివేను. నిజానికి దేశభక్తి గీతం ముందుగా నాకు పరిచయం. విద్యార్థిదశలో పాఠశాలలో యెవరెవరో అపుడపుడూ పాడినపుడు వినేవున్నాను.కానీ, నేను పెరిగి పెద్దయ్యేక, గురజాడ సాహిత్యమంతా చదువుకున్న తర్వాతగానీ దానిలోని గొప్పదనం నాకు తెలియలేదు. పాఠశాలలో పాటగా విన్నపుడూ, ఉపాధ్యాయులు దాని గురించి చెప్పినపుడూ దాని ఘనత తెలియలేదు. బహుశా పాడినవారికీ, బోధించిన ఉపాధ్యాయులకీ ప్రేమించాల్సినంతగా దేశం కనబడ లేదేమో! కానీ యిన్నేళ్ల తర్వాత గురజాడ సాహిత్యమంతా చదివేక కొత్త వెలుగేదో కన్పించింది. ఆ వెలుగుదివ్వె వందేళ్ల కిందటి నాటిదంటే ఆశ్చర్యమేసింది. గురజాడ కన్యాశుల్కం నాటకం వలన సామాజిక దురాచారాలలో యెంతవరకూ మార్పు వచ్చిందోగానీ సాహిత్యరంగంలోని దురాచారాల్లో మాత్రం సరికొత్త మార్పు వచ్చింది. గిరీశం కథ అడ్డంతిరిగిందంటాడుగానీ గురజాడ సాహిత్యాన్ని అడ్డంగా దారి తిప్పేడు! ప్రజలభాషకు సాహిత్యగౌరవాన్ని కలిగించేడు. దేవుళ్లనీ, రాజుల్నీ, ధనికుల్నీ సాహిత్య పీఠాల్నించి తొలగించి సాదాసదా జనాలను(వేశ్యను గూడా) సాహిత్యపీఠమెక్కించేడు. సాహిత్య వస్తుశిల్పాలనేగాక లక్ష్యాలనూ మార్చేడు. ఆధునికత వేపు గురుజాడలు వేసేడు. అయితే గురజాడ సాహిత్య ప్రయోజనాన్నీ,లక్ష్యాన్నీ తెలుగునేలంతా యెన్నెన్నో విధాల విశ్లేషించి వుండొచ్చు, గానీ పెద్దమసీదు వంటి కథ ద్వారా విశ్వజనీన విషయాన్ని స్థానీయతలోంచి చూపటంతో కళింగాంధ్రా కథకు గురజాడ అందించిన స్తానీయతనూ, దాన్ని అందుకున్న కళింగకథనూ పరిశీలిద్దామనిపించింది. వర్తమాన కళింగకథ... స్థానీయతనూ, అభివృద్ధి పేరుమీద జరుగుతోన్న స్తానీయ విధ్వంసాన్నీ చిత్రించడానికి కుదుళ్లు గురజాడగారి 'దిద్దుబాటు' కథలో కొద్దిగా కనబడగా 'దేవుళ్లారా మీ పేరేమిటి? 'పెద్దమసీదు' కథల్లో పూర్తిగానూ, కంటినిండుగానూ కనబడతాయి! ఎవరయితే వీటిని దర్శించగలిగినారో వారు గురజాడ అడుగుజాడలో స్థానీయతను ప్రదర్శింపజేస్తూ అందులోంచి విశ్వజనీన సత్యాన్ని ఆవిష్కరించగలిగేరు. ఒక్క కళింగాంధ్రా అనేకాదు బహుశా తెలుగు నేలంతటా యిలాంటి ఆవిష్కరణలే జరిగివుండొచ్చు. నిర్దిష్టంగా కళింగాంధ్రకు వస్తే ఒక చాసో, ఒక రావిశాస్త్రి, కారా, పతంజలి, భూషణం, శ్రీపతి, రెడ్డిశాస్త్రి, అప్పల్నాయుడు, గౌరునాయుడు, బజరా నుంచి మల్లిపురం జగదీశ్, దాసరి రామచంద్రరావు, చందనపల్లి గోపాలరావు వంటి యెందరో కథకుల కథల్లో యీ కుదుళ్లను చూడగలం! స్థానీయతకు నిర్దిష్టప్రాంతం, అక్కడి జనజీవనం, జనుల వ్యవ హారిక భాష, సంస్కృతీ మాత్రమేగాక వారి చారిత్రక పరిణామం, వారిని ప్రభావం చేసిన అన్ని అంశాలూ కలుపుకుంటే స్తానీయత విశాలఅర్థమిస్తుంది. గురజాడ కథల్లో యివన్నీ కలగలసి కనిపిస్తాయి. వర్తమాన కళింగాంధ్రా కథల్లోంచి వెనకకు గురజాడ కథల్లోకి వెళ్లి చూస్తే యీ స్థానీ యత కుదుళ్లను పోల్చుకోవచ్చు. ఇటీవల వార్తల్లో, చర్చల్లో ప్రముఖంగా కళింగాంధ్రాలో వినబడే కన్నెధారకొండ గురించి మల్లిపురం జగదీశ్ రాసిన 'బాకుడుంబారి' కథకు కుదుళ్లు రామతీర్థాలు కొండ చుట్టూ గురజాడ అల్లిన 'దేవుళ్లారా మీ పేరేమిటి?' కథలో చూడవచ్చు. గురజాడ 'దేవుళ్లారా మీ పేరేమిటి' కథలో ఒక ప్రాంత ముంటుంది. ఆ ప్రాంత ప్రజల జీవితముంటుంది. వారి పలుకుబళ్లూ, వారి సంస్కృతీ, వారి సామాజిక జీవితమూ, చారిత్రక పరిణామమూ, వారిమీద పడిన అనేక అంశాల ప్రభావమూ నేపథ్యంగా మతాలపైన, దేవుళ్లపైన విమర్శగా కథ నడుస్తుంది.

''...మా పట్నానికి యెనిమిది మైళ్ల దూరంలో రామగిరి అని ఒక విష్ణుక్షేత్రం గలదు. దాని వర్ణన మరి వకమాటు చేస్తాను... ఆ ఊరి నల్లకొండలనంతటను శిథిలమైన బౌద్ధ కట్టడములు కలవు...'' అని ప్రాంతీయవర్ణన చేసి, దాని నుంచి ఒక సార్వజనీన విషయాన్ని చెప్తారు. అదేమిటంటే ''...యీ బౌద్ధకట్టడములను అక్కడివారు పాండవుల పంచలంటారు. ఈ దేశంలో పాండవులు వుండని గుహలూ, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు..'' అనే ఒక సార్వజనీన మూఢనమ్మకాన్ని పలికిస్తారు! అలాగే, ఆ బౌద్ధ విగ్రహమును శివుడని, దానిపక్కనున్న దేవీవిగ్రహాన్ని గౌరి అని భావించి జంగాలు పూజ చేస్తున్నారు...'' ఇలా సార్వజనీనమయిన ప్రజల విశ్వాసాలను ఒక స్థానీయత నుంచి చెప్తారు! ఇలా కథ కొంత నడిపి, ఆ ప్రాంత చరిత్రనూ, ఆ ప్రజల మతపర విశ్వాసాలనూ పాఠకునికి చూపించుకుంటూ... మతాల మధ్య వైరాన్నీ, మత విశ్వాసాల ఆధారంగా ప్రజల మధ్య విభేదాలను స్వార్థపరులు వాడుకునే వైనాన్ని కథాంశం చేస్తాడు. ఇదంతా పదేళ్ల కిందటి మాట అనంటూ కథ చెప్పడమారంభిస్తాడు. చరిత్రలో జరిగిన మత కల్లోలాలు, ఘర్షణలు వర్తమాపంలో కొనసాగడాన్ని యీ కథ ఒక ప్రాంతీయ జీవనాధారంతో పాఠకునికి చూపిస్తుంది. కథలో చెప్పిన పట్నం... విజయనగరం. రామగిరి.. నల కొండలూ అక్కడికి దగ్గరి రామతీర్థాల కొండలే! రామతీర్థాలు ప్రఖ్యాత వైష్ణవాలయం! ఆ కొండ, అక్కడి శ్రీరామాలయం, కళింగప్రజల తీర్థయాత్రలూ తరతరాల పౌరాణిక ప్రవాహం! కానీ దానికి సంబంధించిన ప్రవాహంలో యెన్నెన్నో మలుపులు శైవ, వైష్ణవ కలహాలు, అధికారుల ఆర్భాటాలు, నేతలనిర్వాకాలు... ససాక్ష్యంగా కళ్లకుగట్టి, దేవుళ్లకు సంబంధించిన చర్చనంతటినీ చేసి, మూఢభక్తిపైన విసుర్లు విసురుతూ, మతకలహాలపై నిరసనను కలిగిస్తూ... ఒక నిర్థిష్ట ప్రాంతంలో కథనంతటినీ నడుపుతాడు గుర జాడ. శైవులు, వైష్ణవులు, సాతాన్లు, వారిగురువు శరభయ్య, మన వాళ్లయ్య, క్రిష్ణమాచారి, నాంచారమ్మ, సారధి నాయు డు, పీరు సాయిబు... వగయిరా సజీవ పాత్రల్తో...నాటకీయ సంఘటనల్తో, గ్రామీణ పలుకుబళ్లతో కథంతా పాఠకుణ్ణి ముగ్దుణ్ణి చేస్తుంది. ''...యీ ఊరి నాయకులు స్తోమత కలవాళ్లు. అందులో సారథినాయుడు లక్షాధికారి. అతని బావమరిది రామినాయుడు గ్రామ మునసబు. కొంచెం ధూర్తు, నిషాబాజీన్నీ భోజనప్రియుడు. యీ తాలూకాలో కల్లా పెద్ద సారాదుకాణం యీ ఊళ్లోనే వుంది. దాన్నిబట్టి ఈ ఊరి యోగ్యత మీరు ఊహించుకోవచ్చు...'' కథకుని యీ సంభాషణతో రామగిరికి సంబంధించిన సామాజిక దృశ్యం మనకు తెలుస్తుంది. ఇలా దృశ్యాల మీదుగా పాత్రలను పరిచయంచేస్తూ, కథను నడుపుతాడు. ఇలా స్థానీయతలో ప్రజలభాష, సంస్కృతీ, సామాజిక జీవితమూ మొత్తంగా దర్శించి దాన్ని సార్వ జనీనం చేయడాన్ని గురజాడ రాసిన నాలుగు కథల్లో మూడింట్లో స్పష్టంగా చూపవచ్చు. వాట్ని అందుకున్న కళింగ కథకుల్లో వీటి కుదుళ్లు చూడవచ్చు చాసో 'కుంకుడాకు', 'బ్బబ్బా', రావిశాస్త్రి 'సారాకథలు', కారా 'యగ్యం' 'ఆర్తి', భూషణం 'పులుసు', 'అడివంటుకుంది', శ్రీపతి 'నర్తోడు', 'నెమళ్లఅడవి', పతంజలి 'మోటుమనిషి', గోపాత్రుడు; ఎన్నెస్ ప్రకాశరావు 'సోల్‌మేండర్' యిలా తొలితరం కథకుల నుంచి మలితరం మీదుగా వచ్చిన రెడ్డిశాస్త్రి 'అభివృద్ధి', అప్పల్నాయుడు 'షా', గౌర్నాయుడు 'తిరుగుడు గుమ్మి' బమ్మిడి జగదీశ్వరరావు 'మట్టితీగలు' సువర్ణముఖి 'సుక్కి' వంటి కథలేగాక తర్వాతి తరం మల్లిపురం జగదీశ్, చందనపల్లి గోపాలరావు, దాసరి రామచంద్రరావు, రామారావు నాయుడు వగయిరా శ్రీకాకుళ సాహితి కథకులూ, వారు ప్రచురించిన 'నాగావళికథలు', 'వంశధారకథలు', జంఝావతికథలు', వేగావతికథలు సంకలనాలలో యీ కుదుళ్లు బలంగా కన్పిస్తాయి.గురజాడ పెద్ద మసీదులో నాగావళి నది గురించీ, నదిఒడ్డు ఊరు శ్రీకాకుళం గురించీ చేసిన చింతననూ, దేవుళ్లారా మీ పేరే మిటి కథలో కొండలూ, అక్కడ వెలసిన ఆలయాలూ, వాటి చుట్టూ అల్లుకుపోయిన మత విశ్వాసాలూ, వాటిని సొమ్ము చేసుకునే పురోహిత వర్గమూ, పెత్తందారీ వర్గమూ, నలిగిపోయే జనసమూహమూ... ప్రాంతీయంగా జరిగిన మార్పులూ చిత్రించి యీ కథద్వారా అందించిన ఎరు కను కళింగ కథకులు తమ కథల్లో మరింత విశద పరిచేరు! ఈ స్థానీయ చింతననే కాదు గురజాడ అందించిన శిల్పాన్నీ అందుకుంది కళింగ కథ. నాటకీయ దృశ్యాలను గురజాడ కథల్లో ఒక శిల్పమయితే వాట్ని... కారా మరింత ముందుకు తీసుకెళ్లడాన్ని యగ్యం, చావు, ఆర్తి కథల్లోనా చూడగలం! ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. పాత్రల నిర్మాణం, సంభాషణలు, సంఘటనలు, స్థానీయ చిత్రణా అన్ని అంశాలనూ గురజాడ అడుగుజాడగా కళింగ కథ తీసుకున్నదని వందేళ్లకు పైబడ్డ కథల్లోంచి యెన్నెన్నో ఉదాహరణలివ్వవచ్చు.



'పెరుగు'కు లాటిన్ అమెరికా పురస్కారం

కవిత్వమంటే కన్నీటితో కరచాలనం కాదు. వాస్తవాలతో కౌగిలింత అంటున్న సుప్రసిద్ధ కవి, అనువాదకుడు, సంపాదకుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ తనని తాను ఓదార్చుకోడానికి కవిత్వ మార్గం ఎంచుకున్నానంటారు. అంతర్జాతీయ కవితా సదుస్సులో తరచు పాల్గొనే ఈ కవి దేశ దేశాల జెండా నిండా కవిత్వాన్ని నింపుకు వచ్చిన మిత్రులతో తాను విశ్వప్రేమను పరుచుకున్న కవిత్వాన్ని అని నిర్వచించుకుంటారు. అలా అసాధారణమైన కవిత్వ జైత్రయాత్ర చేస్తూ సుమారు 200 విశ్వసంకలాల్లో నమోదై అనేక విద్యాసంస్థలతో అనుబంధం కలిగిన పెరుగు రామకృష్ణకు ఈ నెల 20వ తేదీ మెక్సికో దేశంలోని ఆధునిక సాహిత్యానికి సంబంధించిన ప్రతిష్టాత్మక సంస్థ 'ది లాటిన్ అమెరికన్ అకాడమి' డాక్టర్ పెరుగు రామకృష్ణ సాహిత్య విజయాలను అభినందిస్తూ ఆ సంస్థలో అకడమిక్ అసోసియేట్‌గా భాగస్వామ్యం చేస్తూ అరుదైన గౌరవ పురస్కారం అంతర్జాలం ద్వారా అందించింది. తెలుగు సాహిత్యం తన ఆంగ్లానువాద సాహిత్యం, కవిత్వం రంగాల్లో పెరుగు కృషి అపురూపమైనదని, ఈ అవార్డుతో సత్కరించడం అకాడమి ఎంతో ఆనందంగా భావిస్తోందని దాని అధ్యక్షుడు జేవియర్ రామిరెజ్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెజిల్ కవికి ఇండియా కవి పెరుగుకు మాత్రమే ఈ పురస్కారాలు అందించినట్లు చెప్పారు. మన నెల్లూరీయునికి ఇంతటి అరుదైన గౌరవం దక్కడం పట్ల పలువురు కవులు, అభిమానులు, సహోద్యోగులు రామకృష్ణకు అభినందనలతో శుభాకాంక్షలందించారు.


- జగన్‌కుమార్

సరళి

నిషిద్ధ.. నగర... నవలాకారుడు జేమ్స్ జాయిస్!



ఒక నగరాన్ని ప్రేమిస్తే ప్రపంచాన్ని వరించటంగా వివరించిన మాటల వశంకరుడు జేమ్స్ జాయిస్. ఆయన 'యులిసిస్' నవల చైతన్య స్రవంతికి ఒక కొత్త తెర తెరిచింది. ఇంత గొప్ప నవల రచించిన రచయితని డూబ్లిన్ నగరం పరవశంతో గుండెలకు హత్తుకుంది. నవలలు ఎలా రాయాలో నేర్పించిన మహా రచయిత జేమ్స్ జాయిస్. నగర జీవితంలో నక్కి సామాన్యుల మాటలు సేకరించి అవన్నీ తన గుండెగదుల్లో అణువణువునా గోడలకు అంటించిన ప్రేమ పిపాసి జేమ్స్ జాయిస్. యులిసిస్ నవలలో ఆ పదాలన్నీ వాడుకొని హోమర్ స్థాయిని దాటిన రచయితగా ప్రపంచాన్ని శ్వాసించాడు. ఆయన కేవలం ఐర్లండ్ దేశవాసిగానో లేక ఐరిష్ భాష నిక్షిప్త పద నిఘంటువుగానో భావిస్తే అంతకన్నా మించిన అవగాహనా రాహిత్యం వుండదు. సామాన్యుల జీవితాల్లోకి ఓ 24 గంటల ప్రయాణించిన అసామాన్య పదయాత్రను యులిసిస్ నవల చిత్రీకరించింది. ఆధునిక నవలకు ఆయన ఆద్యుడే కాదు, నవలలకు అపార గౌరవస్థానం సంపాదించి పెట్టిన అపర వాల్మీకి అతడు. జీవిత చిత్రీకరణలో యులిసిస్ నవల ఈ రోజుకీ ఓ అద్భుత మహా కావ్యం. చదువుతుంటే ఓ పట్టాన అర్థంకాదు. భాషను మించిన భావాల దొంతరతో ఓ మహాభాషణం ఆ నవల. మానవ జీవితాల అసంబద్ధతను ఎంతో నయగారంతో వర్ణించిన సందర్భ శుద్ధి పరస్పర సంభాషణలతో నాటకీయంగా ఆ నవల నడుస్తుంది.



ఆధునిక మహాజీవిత భాండాగారం యులిసిస్ నవల. నాకు తెలిసి చాలామంది నవలాకారులు జేమ్స్ జాయిస్‌ని చదవకపోయినా, ఆయన ప్రభావం నుంచి బయటపడలేకపోయారు. మాటల మాంత్రికుడు స్వర్గీయ డాక్టర్ వి.చంద్రశేఖరరావును యులిసిస్ నవల చదివారా అని ప్రశ్నించాను. సగం చదివి అర్థంకాక వదిలేశానని ఆయన జవాబు విని విస్తుపోయాను. ఆయన 'ఐదుహంసల' నవలగాని, నా 'మూలుగు' నవలగాని జేమ్స్ జాయిస్ చైతన్య స్రవంతికి దగ్గరగా రచించిన కావ్యాలు. నేను మూలుగు నవల రాసేనాటికి యులిసిస్ చదవలేదు. కానీ ఆ అద్భుత నవలా ప్రభావం పరోక్షంగా ప్రభవించటం ఓ ఆశ్చర్యమే.

కాని చైతన్య స్రవంతికి తెలుగులో మొదటి నవలగా 'అంపశయ్య' పేరుగాంచింది. ఆ నవలాకారుడు అంపశయ్య నవీన్ ఆశ్చర్యంగా అయిదు హంసలు, మూలుగు నవలలు అర్థంకాని నవలలుగా వ్యాఖ్యానించటం చదివి నేను విస్తుపోయాను. తెలుగులో ప్రయోగశాల నవలలు రాకుండా అంపశయ్య నవీన్ గుదిబండగా మారాడని అనుకొని మనసులో ఆయనకి ధన్యవాదాలు చెప్పుకున్నాను. ఎదిగీ ఎదగని రచయితలతో తెలుగు నవలా సాహిత్యం తీరుతెన్నులు చూస్తే మనం పాశ్చాత్య రచనారంగం నుంచి ఎంత వెనకబడి వున్నామో తేటతెల్లమవుతుంది.

యులిసిస్ (1922) నవలలో ఆఖరి అధ్యాయంలోని శృంగార చిత్రీకరణ పట్ల అభ్యంతరాలు చోటుచేసుకున్నాయి. ఫలితంగా 1930 నుంచి 1953 దాకా చాలాదేశాల్లో ఆ నవల నిషేధానికి గురి అయ్యింది. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు ఆ నవలను 18 ఏళ్ళలోపు పిల్లలు చదవరాని నవలగా ప్రకటించాయి. కాని ఈ రోజుల్లో ఆ నవల చదివితే అంతా సజావుగానే కన్పిస్తుంది. యులిసిస్ నవలను కోర్టుల్లో న్యాయమూర్తులు కూడా ఆ నవల అర్థం కానప్పుడు అందులోని శృంగారపాళ్ళు ఏమంతగా అర్థం అవుతాయని తీర్మానం చేసి జేమ్స్ జాయిస్‌ని పొగిడి ఆయనకు నీరాజనాలు అర్పించారు. ఐరిష్ భాషకు పట్టం గట్టిన నిలువెత్తు మూర్తిగా ఆయనని ఆ దేశస్తులు ఆయనకి విగ్రహపూజ కాదు, వీరపూజ చేస్తున్నారు. నిషిద్ధ రచయితగా, నగర జీవిత సంక్లిష్టతలను చిత్రీకరించిన చైతన్య స్రవంతి నవలా రచయితగా జేమ్స్ జాయిస్ ప్రపంచ సాహిత్యంలో ఓ ఉత్సవమూర్తి. ఈ రోజుకీ ప్రపంచ సాహిత్యంలో జేమ్స్ జాయిస్‌ని తలదన్నే నవలా రచయిత ఆవిర్భవించలేదు. ఆవిర్భవించడు కూడా! ఆయన డూబ్లినర్స్ కథల పుస్తకం కూడా ఆసక్తికరంగానే వుంటుంది. యులిసిస్ నవల రాశాక జేమ్స్ జాయిస్ తనకు తాను ఒట్టిపోయినట్టుగా ఓ సంవత్సరం పాటు కలం కదపకపోవటం ఓ వింతగా ప్రపంచం విస్తుపోయింది.

◆ సాగర్ శ్రీరామకవచం
9885473934



కవిత

నక్షత్రాలు

పనులెన్ని యున్నను .!
రుగ్ణుడు సుసేవ మరువకుము.!!
కడయాత్ర వంతు విస్మరించకుము.!!!

నీవు ఉపవస్తమ్ వుండుటగన్న.!
ఆకలిగొన్న అనాధలకు బువ్వ బెడితే.!!
శుష్కోపవాస దీక్ష ఫలమ్ దక్కున్ గదా.!!!

మిత భాషణమ్ అమిత మన్ననిచ్చున్.!
మిత భోజనమ్ అమిత సత్ఫలితానిచ్చున్.!!
మిత నడవడి మిక్కిలి శ్రేయస్కరము.!!!


క్రోధమ్ అయినవారిని దూరం చేయున్.!
కోరిక నీ ఆనందాన్ని హరించున్.!!
కామమ్ నీ జీవనమున్ దహించున్.!!!

పరనారి ముఖపద్మమున్ మోహించెదవు.!
పొరిగింటి పుల్లకూరన్ లొట్టలేసెదవు.!!
ఇంటిల్లాలిని విలువివ్వక సంశీతి తగునా ఓ మనుష్య.!!!

- అఖిలాశ,
బెంగుళూరు

మనం
కుటుంబం
సోమవారం, 26 ఫిబ్రవరి 2018





సిరిమల్లెపువ్వా... అంటూ తెరపై కనపడ్డ పదహారేళ్ల పడుచు సోయగాన్ని చూసి సిరి మల్లెపువ్వు తనతో పోల్చుతున్నారని ఆనందపడితే...కిల కిల మని అందం నవ్వింది..

కథగా కల్పనగా... పాటలో అమాయకమైన అమ్మాయిని జోల పాట సంతృప్తి పడింది.

ఎల్లువొచ్చి గోదారమ్మ ... అంటే ఆ పరువాలను అందుకోవడానికి గోదావరి పోటీ పడింది

అందాలలో అహో మహోదయం.. పాటలోని దేవకన్యను చూసి ఇంతటి అందమైన దేవకన్య ఇక్కడకి రాలేదేంటి అని హిమాలయాలకు ఈర్ష్య పుట్టింది

ఓరి బ్రహ్మ దేవుడో కొంపముంచినావురో ..ఈ సిరి స్వర్గాని చెంది ఉంటదా! .. అంటే బ్రహ్మ తన సృష్టిని చూసి ఆనందంతో తన్మయత్వం చెందాడేమో..!

50 ఏళ్లు... 5 భాషలు.. 300 సినిమాలు..కోట్ల మంది అభిమానులు ఉండటం నిజంగా సిరి కదా! ..ఆ సిరి స్వర్గంలో ఉండాలనుకుని ఉంటాడు. అందుకే అందాల తార శ్రీదేవిని తన వద్దకు తీసుకెళ్లిపోయాడు. దీంతో సినీ ప్రపంచం మూగబోయింది. గ్లామర్ ప్రపంచంగా పేరున్న సినీ పరిశ్రమలో హీరోయిన్‌గా పదేళ్లు రాణించడమే గొప్ప విషయం. అలాంటిది 50 ఏళ్ల నటిగా, కథానాయికగా రాణించడం సామాన్యమైన విషయం కాదు. అది వన్ అండ్ ఓన్లీ శ్రీదేవికే సాధ్యమైంది. తనదైన అందం.. అభినయం.. ఆహార్యం, హావభావాలతో సినీ పరిశ్రమలో నెంబర్ వన్‌గా రాణించిన తార శ్రీదేవిని ఇష్టపడని వారు సినీ లోకంలో ఉండరంటే అతిశయోక్తి కాదు. సినీ పరిశ్రమలో బాలనటిగా కెరీర్‌ను స్టార్ట్ చేసి దక్షిణాది సినిమాల్లో కాదు.. ఉత్తరాది సినిమాల్లో కూడా నెంబర్ వన్ కథానాయికగా తన మార్కును క్రియేట్ చేసిన అనురాగదేవత శ్రీదేవి ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అయితే ఆమె ప్రయాణంలో ఎన్నో మజిలీలు, మరెన్నో మలుపులు....

అభిమానుల స్వప్న సుందరి...

వన్నె తరగని అతిలోక సుందరి శ్రీదేవి

INDIAN QUEEN







సెలబ్రిటీలే అభిమానులు..

విలక్షణమైన పాత్రలతో అభిమాన గణాన్ని సొంతం చేసుకున్న ఎంతో మంది సినీ ప్రముఖులు సైతం శ్రీదేవి నటనకు ఫిదా అయినవాళ్లే. రాంగోపాల్ వర్మ వంటి వివాదస్పద దర్శకుడు కూడా శ్రీదేవి అంటే పడి చచ్చిపోతాడు మరి. అలాగే నాగార్జున, వెంకటేష్, మహేష్, ఎన్టీఆర్, నాని ఇలా ఎంతో మందికి శ్రీదేవి నటన అంటే ప్రాణం.







తల్లితో అనుబంధం..

శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ ఓ లాయర్, తమిళియన్.. తల్లి రాజేశ్వరి మాత్రం తెలుగావిడే. చిన్నప్పట్నుంచి శ్రీదేవికి తల్లితో మంచి అనుబంధం ఉండేది. శ్రీదేవి పనిచేసే సినిమా లొకేషన్స్‌లో .. శ్రీదేవికి తోడుగా ఆమె తల్లి ఎప్పుడూ వెన్నంటే ఉండేవారు. తల్లి మరణం తనను ఎంతో బాధించిందని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న శ్రీదేవి.. తాను మాత్రం తన కుమార్తెలను స్వేచ్ఛగా పెంచానని చెప్పారు. తన కుమార్తెలు తనకంటే తెలివైనవారు, ధైర్యవంతులని.. అప్పట్లో తన వెంటే తన తల్లి ఉండేదని. కానీ తన కూతుళ్లకు ఆ అవసరం ఉండబోదని శ్రీదేవి అదే ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకు కారణం కాలం.. యువత ఆలోచనలలో వచ్చిన మార్పే అని ఆవిడ అన్నారు. తల్లి చనిపోతే కుమారుడి స్థానంలో ఉండి.. ఆమె చితికి శ్రీదేవి నిప్పు అంటించారట.



సినిమాలకు దూరం...

పెళ్లి తర్వాత జాన్వీ, ఖుషీ అనే అమ్మాయిలకు జన్మనిచ్చాక శ్రీదేవి సినిమాలకు దూరమైయ్యారు. పిల్లల పెంపకంలోనే సమయాన్ని వెచ్చించారు. 6 ఏళ్ల తర్వాత సహారా ఛానెల్‌లో మాలిని అయ్యర్ అనే షోతో బుల్లితెరపై దర్శనమిచ్చారు. జీనా ఇసికా నామ్ హై, టీవీ షో కా బూమ్ వంటి టీవీ షోస్‌లో జడ్జ్‌గా వ్యవహరించారు.

సెకండ్ ఇన్నింగ్స్...



2012లో విడుదలైన 'ఇంగ్లిష్ వింగ్లీష్' సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్‌ను స్టార్ చేశారు శ్రీదేవి. తన వయసుకు తగిన పాత్రలు చేయడానికి తాను సిద్ధమేనని ఈ చిత్రం ద్వారా చెప్పకనే చెప్పారు. 2015లో తమిళ చిత్రం 'పులి'లో యవనరాణి అనే పాత్రలో కన్పించారు. ఇక 2017లో 'మామ్' సినిమాలో నటించారు. ఈ సినిమాలో ఓ టీనేజ్ అమ్మాయి తల్లిగా ... సదరు అమ్మాయి శ్రేయస్సు కోసం తపన పడే తల్లి పాత్రలో శ్రీదేవి అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు.



తండ్రీ కొడుకులతో...

తెలుగు చిత్రసీమలో తండ్రితో కొడుకుతో కలిసి వేర్వేరుగా సినిమాలు చేసిన తొలి హీరోయిన్ శ్రీదేవి. 80వ దశకంలో ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చంద్రమోహన్, మురళీమోహన్ వంటి హీరోల సరసన నటించిన శ్రీదేవి ఆ తర్వాతి తరంలో చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ వంటి హీరోలతో కూడా నటించి తిరుగులేని హీరోయిన్ అనిపించుకున్నారు. 'బడిపంతులు' చిత్రంలో ఎన్.టి.రామారావు మనవరాలిగా నటించిన శ్రీదేవి ఆ తర్వాత వేటగాడు, కొండవీటి సింహం, బొబ్బిలిపులి, సర్దార్ పాపారాయుడు వంటి సిల్వర్ జూబ్లీ సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. బాలనటిగా అక్కినేని నాగేశ్వరరావుతో నటించిన శ్రీదేవి ఆ తర్వాత హీరోయిన్‌గా ప్రేమాభిషేకం, ప్రేమకానుక, శ్రీరంగనీతులు వంటి సూపర్‌హిట్ సినిమాల్లో నటించారు. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు తనయుడు అక్కినేని నాగార్జునతో ఆఖరిపోరాటం, ఖుదాగవా, గోవిందా గోవింద, చిత్రాల్లో ఆడి పాడారు. ఇలా తండ్రితో, కొడుకుతో హీరోయిన్‌గా నటించి మెప్పించారు. అయితే ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయం ఏంటంటే.. స్వర్గీయ ఎన్టీఆర్‌తో నటించిన శ్రీదేవి ఆయన తనయుడు బాలకృష్ణతో నటించలేదు. నిజానికి బాలకృష్ణ, శ్రీదేవి జంటగా ఓ సినిమా రూపొందాల్సి ఉంటే.. కొన్ని కారణాలు వల్ల వీరిద్దరూ కలిసి నటించలేకపోయారు.



పెళ్లి వివాదమే...

అందాల నటి శ్రీదేవి అంటే పడి చచ్చేవారు ఎందరో ఉన్నప్పటికీ.. నిర్మాత, అప్పటికే పెళ్లైన బోనీ కపూర్‌ను శ్రీదేవి వివాహం చేసుకోవడం అప్పట్లో పెద్ద సంచలనం అయ్యింది. అయితే మరో బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తిని శ్రీదేవి రహస్యంగా పెళ్లి చేసుకున్నారనే వార్తలు అప్పట్లో సంచలనాలను రేపాయి. అయితే మిథున్ తన మొదటి భార్య గీతాబాలికి విడాకులు ఇవ్వని కారణంగా అతనికి దూరమైయ్యారని కొన్ని వార్తలు అప్పట్లో వినపడ్డాయి.



'బాహుబలి' వివాదం...

ఇండియన్ సినిమాలో ప్రస్తుతం ప్రెస్టీజియస్ మూవీగా మాట్లాడుకుంటున్న 'బాహుబలి' సినిమాలో రాజమాత శివగామి పాత్ర కోసం దర్శక నిర్మాతలు ముందు శ్రీదేవి అయితే బావుంటుందని అనుకున్నారట. ఆమెను సంప్రదించామని.. శ్రీదేవి 8 కోట్ల రూపాయల రెమ్యునరేషన్ అడగటమే కాకుండా, బిజినెస్ క్లాస్ టికెట్స్ అడగటం సహా హిందీ రైట్స్‌లో భాగం అడిగారని..దాంతో ఆమె స్థానంలో రమ్యకృష్ణను తీసుకున్నామని రాజమౌళి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే 'నన్ను నటించమని అడిగి.. నేను ఒప్పుకోకుండా, ఆ పాత్రలను వేరే వాళ్లు చేసి.. హిట్స్ అయిన సినిమాలు చాలానే ఉన్నాయి. నేను కానీ, ఆ దర్శకులు కానీ వాటి గురించి ఎప్పుడూ మాట్లాడింది లేదు. ఎందుకంటే అలా మాట్లాడటం సరికాదని నా అభిప్రాయం. 'బాహుబలి' సినిమా విడుదలైన తర్వాత ఇప్పుడు నేను పలానా పాత్ర చేయలేదనే సంగతిని ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. నేను నిజంగా అలాంటి డిమాండ్స్ చేసే హీరోయిన్ను అయితే ఇన్నేళ్లు నేను ఇండస్ట్రీలో ఉండగలిగేదాన్నా?..నేను చేసిన దర్శక నిర్మాతలందరూ నాతో మళ్లీ మళ్లీ సినిమాలు చేశారు. రాజమౌళి వంటి గొప్ప టెక్నిషియన్ పబ్లిక్ ఫ్లాట్ ఫాంలో అలా మాట్లాడం నాకు చాలా బాధ అనిపించింది' అంటూ ఈ వివాదంపై శ్రీదేవి కూడా ఘాటుగానే స్పందించారు.



తీరని కల...

శ్రీదేవి పెద్ద తనయ జాన్వీ కపూర్ ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తుంది. జాన్వీ నటించిన సినిమా 'ధడక్' ఇంకా విడుదల కాలేదు. అయితే జాన్వీని ఎందరో దర్శక నిర్మాతలు హీరోయిన్‌గా నటించమని అడిగినా.. శ్రీదేవి మాత్రం జాన్వీని మంచి సినిమా ద్వారా ఇంట్రడ్యూస్ చేయాలనుకున్నారు. అందుకని కరణ్ జోహార్ నిర్మాతగా మరాఠిలో విజయవంతమైన 'సైరాట్' సినిమా రీమేక్‌లో కుమార్తె జాన్వీని నటింపచేయిస్తున్నారు. 'ధడక్'పేరుతో సినిమా హిందీలో రీమేక్ అవుతుంది. సినిమా చిత్రీకరణ దశలోనే ఉంది. కుమార్తె సినీ హీరోయిన్‌గా రాణించడం చూడాలనుకున్న శ్రీదేవి కోరిక తీరనేలేదు.



ముఖ్యమంత్రులతో కలిసి..

శ్రీదేవి తన సినీ ప్రయాణంలో ముగ్గురు ముఖ్యమంత్రులతో కలిసి పనిచేశారు. వారెవరో కారు.. ఒకరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అయితే.. మరొకరు తమిళనాడు ముఖ్యమంత్రులు ఎంజీ రామచంద్రన్, జయలలిత నటించారు. రామారావు, శ్రీదేవి జంట ఎన్నో చిత్రాల్లో కనువిందు చేశారు. అలాగే ఎంజీ రామచంద్రన్‌తో నమ్‌నాడు చిత్రంలో బాలనటిగా నటించారు. ఇక జయలలితతో శ్రీదేవి బాలనటిగా ఉన్నప్పుడు 'తిరుమాంగళ్యం', 'కందన్ కరుణై', 'ఆది పరాశక్తి' సినిమాల్లో నటించారు. ఎంతో మంది కలల నాయిక.. అభినయంలో తిరుగులేని కథానాయిక శ్రీదేవి స్థానాన్ని మరెవరైనా భర్తీ చేయగలరా?.. కచ్చితంగా భర్తీ చేయలేరు. ఆమె స్థానాన్ని భర్తీ చేయగల ఏకైక నటి మళ్లీ వన్ అండ్ ఓన్లీ శ్రీదేవి మాత్రమే. అందుకే ...శ్రీదేవి మాకోసం మళ్లీ పుట్టవూ...

శ్రీదేవికి ప్రముఖుల నివాళి

అతిలోక సుందరి శ్రీదేవి నింగికేగారు.. కోట్లాది అభిమానులను శోక సంద్రంలో ముంచుతూ ఆకస్మికంగా మరణించారు. ఈ వార్త విన్న తర్వాత వివిధ ప్రముఖులు స్పందిస్తూ చేసిన ట్వీట్లు..

'సినీ నటి శ్రీదేవి మరణ వార్త షాక్‌కు గురిచేసింది. కోట్లాది అభిమానుల గుండెల్లో విషాదాన్ని నింపి తను వెళ్లిపోయింది. లమ్హే, ఇంగ్లిష్ వింగ్లిష్ చిత్రాలలో మిగతా నటీనటులకు ఆదర్శంగా నటించారామె. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి'
-రామ్‌నాథ్ కోవింద్, భారత రాష్ట్రపతి

'తెలుగు, హిందీ సహా పలు దక్షిణాది చిత్రాలలో నటించి, తన అసమాన నటనతో ప్రేక్షకులను మెప్పించిన మహా నటి శ్రీదేవి'
-వెంకయ్య నాయుడు, భారత ఉపరాష్ట్రపతి

'ప్రఖ్యాత సినీ నటి శ్రీదేవి ఆకస్మికంగా మరణించడం బాధాకరం. ఈ బాధాకరమైన క్షణంలో ఆమె కుటుంబ సభ్యులు, సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతి' **-నరేంద్ర మోదీ, భారత ప్రధాని**

'అద్భుతమైన నటనతో సుదీర్ఘ కాలంపాటు కొనసాగిన శ్రీదేవి జైత్రయాత్రకు అకాల మరణంతో బ్రేక్ పడింది. ఆమె కుటుంబానికి, అభిమానులకు నా సానుభూతి' **-స్మృతి ఇరానీ**

'భారతీయ సినిమాల్లో ఆరాధ్య నటి శ్రీదేవి మరణం నన్ను షాక్‌కు గురిచేసింది. ఆ మహా నటి ఇకలేరన్న వార్త నమ్మశక్యం కావటంలేదు'
-రాహుల్ గాంధీ(కాంగ్రెస్ అధ్యక్షుడు)

'భారతీయ సినిమా రంగంలో శ్రీదేవి పాత్ర చిరస్మరణీయం. అభిమానుల గుండెల్లో ఆమె స్థానం చెరిగిపోలేనిది'
-త్రివేంద్ర సింగ్ రావత్(ఉత్తరాఖండ్ సీఎం)

'శ్రీదేవి అకాల మరణంతో శోకసంద్రంలో మునిగిన ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి'
-జగన్, వైసీపీ అధ్యక్షుడు

'శ్రీదేవి ఆకస్మిక మరణవార్త విని తీవ్రమైన షాక్‌కు లోనయ్యా.. ప్రతిభావంతురాలైన నటి, మంచి వ్యక్తి ఇకలేరంటే నమ్మశక్యంగా లేదు'
-హేమామాలిని

'శ్రీదేవి మనమధ్యలేరనే వార్తను ఎవరూ జీర్ణించుకోలేరు. తన మరణం బాధాకరం. పొద్దున్నే ఈ వార్తను చదివి షాక్‌కు లోనయ్యా'
-సచిన్ టెండూల్కర్

'అసమానమైన అభినయ ప్రతిభతో ప్రేక్షకలోకం అభిమానాన్ని ఆమె చూరగొన్నారు. శ్రీదేవి ఇక లేరు అనే మాట నమ్మలేనిది'
-పవన్ కల్యాణ్, జనసేన అధ్యక్షుడు

'పొద్దున లేస్తూనే ఈ విషాదకర వార్తను వినాల్సి వచ్చింది. ఎంత దురదృష్టకరం? నాకిది పెద్ద షాక్' **-రిషికపూర్**

'శ్రీదేవి ఆకస్మిక మరణం తీరని విచారంలో ముంచివేసింది. ఆమెకు పెద్ద అభిమానిని.. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.'
-అమిర్‌ఖాన్

'శ్రీదేవి ఇకలేరనే బాధాకరమైన వార్తతో నిద్రలేచా! అత్యంత ప్రతిభావంతురాలైన ఓ మహానటిని ప్రపంచం కోల్పోయింది'
-మాధురి దీక్షిత్

'నాకు మాటలు రావడంలేదు. తన అభిమానులందరికీ నా ప్రగాఢ సానుభూతి. ఇదో దుర్దినం. శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలి'
-ప్రియాంక

'అత్యంత భయంకరమైన వార్త ఇది.. తన మరణవార్త విని మాటల్లో వ్యక్తం చేయలేని షాక్‌కు గురయ్యాను. శ్రీదేవి ఇకలేరు'
-రితేశ్ దేశ్‌ముఖ్

'శ్రీదేవి వెళ్లిపోయారు.. ఒక శకం ముగిసింది. జీవితంలో ఇది మరో అధ్యాయం. ఒక అందమైన కథ ఇప్పుడే ముగిసింది'
-శేఖర్ కపూర్(దర్శకుడు)

'భాష ఏదైనా నటనలో తనే కిరీటంలేని మహారాణి. భారతీయ సినిమాలలో ప్రతిభను ప్రదర్శిస్తూ వచ్చిన మహానటి'
-సుభాష్ ఘాయ్(దర్శకుడు)

'మనమెంతో ఇష్టపడే, ఆరాధించే వ్యక్తి ఇకలేరన్న నిజాన్ని తట్టుకోవడం కష్టం. దీనిని జీర్ణించుకోలేకపోతున్నా' **-అనుపమ్‌ఖేర్**

'శ్రీదేవి మరణవార్త విని మాటల్లో చెప్పలేనంత షాక్‌కు గురయ్యా.. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి'
-అక్షయ్ కుమార్

'శ్రీదేవి మరణించారన్న వార్త షాక్‌కు గురిచేసింది. కళారంగానికి తన మరణం తీరనిలోటు. ఆమె కుటుంబానికి నా సానుభూతి'
-ధనుష్

'శ్రీదేవి గుండెపోటుతో మరణించారన్న వార్త విని షాక్‌కు లోనయ్యా. భారతీయ మహిళకు ఆమే ఐకాన్' **- కేఎస్ చిత్ర**

'తీవ్రమైన గుండెపోటు కారణంగా శ్రీదేవి మేడం ఈ లోకాన్ని వీడిపోయారని ఇప్పుడే తెలిసింది. దుఃఖం ఆగడంలేదు..' **-సుస్మితాసేన్**

'చిన్న వయసులోనే శ్రీదేవి మనల్ని వదిలివెళ్లిపోయారంటే నమ్మలేకున్నా.. మాటలు రావడంలేదు' **-లతా మంగేష్కర్**

'శ్రీదేవి మరణవార్త వినాల్సిరావడం దురదృష్టకరం. మా అనుబంధం చాలకాలం కొనసాగింది. ఆమె కుటుంబానికి నా సానుభూతి'
-ఆశా భోంస్లే

'శ్రీదేవి లేరన్నమాటను నమ్మలేకున్నా.. తన సినిమాలు చూసే ఈ రంగంపై ఆసక్తి పెంచుకున్నా' **-కరణ్ జోహర్**

'శ్రీదేవి మరణవార్త నన్ను షాక్‌కు గురిచేసింది. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి' **-వీరేంద్ర సెహ్వాగ్**

'శ్రీదేవి ఆకస్మిక మరణం బాధాకరం. తన కుటుంబానికి, స్నేహితులకూ నా సానుభూతి' **-అనిల్ కుంబ్లే(క్రికెటర్)**

కాంగ్రెస్‌పై నెటిజన్ల మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: శ్రీదేవి మృతిపై కాంగ్రెస్ చేసిన ట్వీట్ దుమారం రేపింది. లెజెండరీ నటి మరణాన్ని రాజకీయాల కోసం వాడుకుంటారా అంటూ నెటిజన్లు కాంగ్రెస్‌పై మండిపడుతున్నారు. శ్రీదేవి మరణంపై సంతాపం తెలుపుతూ కాంగ్రెస్ ట్వీట్ చేసింది. ఇందులో ఆమె లేని లోటు తీరనిదని పేర్కొంటూ చివర్లో తనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అంటూ పేర్కొంది. ఇది కాస్తా వివాదాస్పదంగా మారింది. దీనిపై నెటిజన్లు మండిపడ్డారు. చివరికి సంతాప ప్రకటనల్లోనూ గొప్పలు చెప్పుకోవడం మానరా అంటూ క్లాస్ పీకారు. దీంతో వెంటనే కాంగ్రెస్ ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది.




వదినకు గుండెజబ్బు లేదు

- **మేమంతా దిగ్భ్రాంతి చెందాం: సంజయ్‌కపూర్**

దుబాయ్, ఫిబ్రవరి 25: తమ వదిన హఠాన్మరణంతో కుటుంబ సభ్యులమంతా తీవ్ర దిగ్భ్రాంతి చెందామని ప్రముఖ నటుడు, శ్రీదేవి మరిది సంజయ్ కపూర్ చెప్పారు. అసలు ఆమెకు ఎప్పుడూ గుండెజబ్బు గానీ, గుండెకు సంబంధించిన సమస్యలు గానీ ఏమీ లేవని.. అలాంటిది ఉన్నట్టుండి రాత్రి 11 గంటల సమయంలో కార్డియాక్ అరెస్టు కావడం ఏంటో ఎవరికీ అర్థం కాలేదని ఆయన అన్నారు. దుబాయ్‌లో పెళ్లికి వచ్చినపుడు హోటల్ గదిలో ఉండగానే ఆమెకు కార్డియాక్ అరెస్టు సంభవించిందని చెప్పారు. వదిన మరణ విషయం తెలియగానే తెల్లవారుజామునే సంజయ్ దుబాయ్‌కి బయల్దేరి వెళ్లారు. అనిల్ కపూర్ కుమార్తె సోనమ్‌కపూర్‌కు కజిన్ అయ్యే మోహిత్ మార్వా పెళ్లికి హాజరయ్యేందుకు తన భర్త బోనీకపూర్, చిన్న కుమార్తె ఖుషీతో కలిసి ఆమె దుబాయ్ వెళ్లారు.

గుండెల్లో అశాంతిగా ఉంది

శ్రీదేవి మరణానికి ముందు బిగ్‌బీ ట్వీట్



ముంబై, ఫిబ్రవరి 25: వెండితెర ధ్రువతార శ్రీదేవి దుబాయ్‌లో ఆకస్మికంగా మరణించడం తెలిసిందే.. వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్లిన శ్రీదేవి శనివారం అర్ధరాత్రి దాటాక గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయం ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ముందే తెలిసినట్లుంది.. ఏదో జరగనుందనిపించినట్లు అమితాబ్ ఆందోళన చెందారట! శ్రీదేవి మరణానికి కొన్ని గంటల ముందే అమితాబ్ ఈ మేరకు ట్వీట్ చేశారు. మనసులో ఏదో తెలియని అలజడి నెలకొందని, అశాంతిగా ఉందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. బహుశా శ్రేయోభిలాషుల నుంచి ఆయనకు శ్రీదేవి అస్వస్థతకు గురయ్యారని తెలిసినట్లు సమాచారం. వీరిద్దరి కాంబినేషన్‌లో ఎన్నో చిత్రాలు వచ్చాయి. కొన్నేళ్ల విరామం తర్వాత 2012లో శ్రీదేవి తిరిగి నటించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమాలోనూ అమితాబ్ అతిథి ప్రాతలో కనిపించారు.

సర్జరీలే ప్రాణాలు తీశాయా?

గుర్తుకు తెస్తున్న మైఖేల్ జాక్సన్ మరణం.. హైడ్రాలిక్స్‌తోనే కార్డియాక్ అరెస్ట్?

- **'గ్లామ్ డాల్'గా కనిపించాలనే తపన**
- **తీవ్ర మానసిక ఒత్తిడి, ఆర్థిక కష్టాలతో నలిగి పోయిన శ్రీదేవి !**
- **ఫ్యాషన్ ఐకన్‌గా మెరిసేందుకు తుది శ్వాసవరకూ ఆరాటం**

హైదరాబాద్, ఫిబ్రవరి 25: నవయవ్వనంగా కనిపించేందుకు పదేపదే సర్జరీలు చేయించుకున్న శ్రీదేవి, వయసు కనిపించకుండా ఉండేందుకు, ఎలాంటి వస్త్రాల్లోనైనా ఇమిడేలా శరీరాకృతి ఉండాలన్న తపనతో చేయించుకున్న ఆపరేషన్లు వికటించి.. కార్డియాక్ అరెస్టుకు దారితీసి ఉండవచ్చని భావిస్తున్నవారు అత్యధికులు. బరువు పెరగకుండా ఉండేందుకు, తన పిల్లలతో పోటీ పడి, వెస్ట్రన్ ఔట్ ఫిట్స్‌లో తళుక్కుమనేందుకు హైడ్రాక్సిల్ డ్రగ్స్‌ను వాడినట్టు తెలుస్తోంది. హైడ్రాక్సిల్స్‌తో ఆకలి చచ్చిపోయి, తిండిపై యావ పోతుంది. మెటబాలిక్ రేట్‌ను విపరీతంగా పెంచి, హార్ట్ బీట్ పెంచే ఈ హైడ్రాలిక్స్‌తో సివియర్ స్ట్రోక్స్ వస్తాయి. సదరన్ క్యాలిఫోర్నియాలో ఇలాంటి కాస్మెటిక్ సర్జరీలు చేయించుకుని వయసును దాచుకునేలా కనిపించేందుకు పడ్డ తీవ్ర మానసిక ఒత్తిడి అన్నీ కలిపి శ్రీదేవి కొంప ముంచాయని ఇప్పుడిప్పుడే చర్చలు జరుగుతున్నాయి. లేకపోతే ఇంత పెద్ద వయసులో కూడా ఒక్క ముడత లేకుండా, ఆమె సైజ్ జీరోలో ఎలా ఉండగలదు? పైపెచ్చు పళ్లు, కళ్లు, బుగ్గలు, ముక్కు, ముఖాకృతి, పెదవులు అన్నీ కాస్మెటిక్ సర్జరీలతో ఎప్పటికప్పుడు అందంగా కనిపించేలా చేయించుకున్న ఆమె అందం, మరణం రెండూ మనకు మైఖేల్ జాక్సన్‌నే గుర్తుకు తెస్తాయి. 50 ఏళ్ల దాటాక కూడా ఫ్యాషన్ ఐకన్‌గా నిలవాలని, ''అందరికంటే తనే అందంగా కనిపించాలని, వావ్ శ్రీదేవి ఇప్పటికీ అలాగే ఉంది, శ్రీదేవిలా ఎవ్వరూ అందంగా ఉండలేరు'' ఇలాంటి స్టేట్‌మెంట్స్ కోసమే తాను పరితపించి, సర్జరీల వెంట పరిగెత్తిందా అనిపిస్తోంది.

రాయల్ లైఫ్‌కు బానిస

బోనికపూర్, శ్రీదేవి, ఖుషి, జాన్వి వీరు నలుగురూ లగ్జరీ, రాయల్ లైఫ్‌కు బానిసలని బాలీవుడ్ సెలబ్స్ ఓపెన్‌గానే మాట్లాడుతారు. ఎప్పుడూ ఖరీదైన ఫారిన్ టూర్లు, మేకప్స్, జువెలరీ, డిజైనర్‌వేర్ ఇలా ఒక్కటేమిటి అన్ని లావిష్‌గా ఉంటేనే శ్రీదేవి హ్యాపీగా ఉండగలదనే టాక్ ఎప్పటినుంచో ఉంది. డబ్బును నీళ్లలా ఖర్చుచేసే ఈ దంపతులకు ఆర్థిక కష్టాలు రావడానికి ప్రధాన కారణం వీరి లైఫ్ స్టైల్ అని బాలీవుడ్ మార్కెట్ నిపుణులు ఆఫ్ ది రికార్డ్ వివరిస్తారు. ఖరీదైన టూర్లంటే శ్రీదేవి కుటుంబానికి చాలా ఇష్టం, అందుకే ఎప్పుడూ ఏదో ఓ పర్యాటక ప్రాంతంలో సేద తీరుతూ, ఆ ఫోటోలు ఎప్పటికప్పుడు వీరంతా సోషల్ నెట్‌వర్క్‌లో అప్‌లోడ్ చేసేవారు. ఇక ఆర్థిక కష్టాలు తీవ్రం కావడంతో చాలా కాలంపాటు ఎటువంటి సినిమాలను బోనీ నిర్మించలేదని ఇండస్ట్రీ ప్రముఖులు చెబుతారు.



సెకెండ్ ఇన్నింగ్స్ ఇందుకే

కష్టాలనుంచి గట్టెక్కేందుకు డబ్బు కావాలి, అందుకే శ్రీదేవి సెకెండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. తన ఇమేజ్‌కు సూట్ అయ్యే కథలను మాత్రమే ఎంపిక చేసుకుని నటించాలని ఒకటిన్నర దశాబ్దం తర్వాత కెమెరా ముందుకు వచ్చిన శ్రీదేవి ఆమధ్య హిందీ మరిచిపోయిందని, దీంతో ఓ ట్యూటర్‌ను పెట్టుకుని, హిందీ డైలాగులు ప్రాక్టీస్ చేయాల్సి వచ్చింది. ఇక కూతురు జాన్విని ఇండస్ట్రీకి పరిచయం చేయడం మొదట్లో శ్రీదేవి దంపతులకు అస్సలు ఇష్టం లేదని, కానీ ఆర్థికంగా గట్టెక్కేందుకే జాన్విని సినిమాల్లో లాంచ్ చేసినట్టు శ్రీదేవి సన్నిహితులు చెబుతారు.

తల్లి చాటు బిడ్డ


అవును అందరు హీరోయిన్లలానే శ్రీదేవికి కూడా తల్లే లోకం. సినిమాలు, పారితోషికం ఏవైనా అంతా ఆమె తల్లి మాత్రమే చూసుకునేవారు. తల్లి చాటు బిడ్డగా ఉంటూ లోకం గురించి పెద్దగా తెలియని సూపర్ స్టార్‌లో పంజరంలో చిలకలా ఉన్న శ్రీదేవి, తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు అసలు జీవితంలోకి అడుగుపెట్టిందంటారు. అంతవరకూ అన్ని అమర్చిన తల్లి, తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టినప్పుడు, తల్లి ఆరోగ్యం మెరుగవ్వడం కోసం శ్రీదేవి పడని పాట్లు లేవు. కానీ వ్యక్తిగతంగా ఎవరి సహకారం తీసుకోవాలో కూడా తెలియనితనం. ఈలోగా ఆమెపై ఉన్న ప్రేమతో బాలీవుడ్ ప్రొడ్యూసర్ బోనీకపూర్ శ్రీదేవికి అన్నీ తానై అండగా నిలిచారు. మెరుగైన వైద్యం కోసం తన తల్లిని విదేశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించడంతోనే వీరిమధ్య మరింత సాన్నిహిత్యం పెరిగింది. ఈ సమయంలోనే బోనీలో తనపట్ల ఉన్న ప్రేమను గుర్తించినట్టు శ్రీదేవి పలు ఇంటర్వ్యూల్లో చెప్పేవారు. ఇక తల్లి మరణించాక కలిసి సహజీవనం మొదలు పెట్టాక, కడుపులో బిడ్డతోనే 'జుదాయి' చిత్రంలో అనిల్ కపూర్ సరసన హీరోయిన్‌గా నటించి, మరో బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకున్నాక, వీరిద్దరికీ వివాహం జరిగింది. ఆతరువాత 15 ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండి ఇటీవలే సెకండ్ ఇన్నింగ్స్ కూడా మొదలు పెట్టింది శ్రీదేవి. ఇలా పెళ్లికి ముందే ప్రెగ్నెంట్ కావడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది.

శ్రీదేవి ముక్కు పుడక

శ్రీదేవి అంటేనే ట్రెండ్ సెట్టర్. ఆమె ముక్కుకు కాస్మెటిక్ సర్జరీ చేయించుకుంటే మరింత అందంగా మారిందని, సామాన్యులు, సెలబ్రిటీలు అందరూ తమ ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునేందుకు క్రేజ్ చూపారు. అంతేకాదు ఇలా ముక్కుకు సర్జరీ చేయించుకుని మరింత అందంగా తయారైన తర్వాత ఆమె సెల్యులాయిడ్‌పై మకుటం లేని మహారాణిగా ఎదిగారన్నది బహిరంగ రహస్యం. అంటే సెంటిమెంటల్‌గా కూడా శ్రీదేవికి ఈ సర్జరీ కలిసి వచ్చిందన్నది లెక్క కనుక, ఆతరువాత శిల్పా షెట్టీ, ప్రీతిజింటా, దీపికా పదుకున్, ప్రియాంక చోప్రా, అనుష్క శర్మ ఇలా ఒక్కరేమిటి దాదాపు ప్రముఖ నటీమణులంతా శ్రీదేవిలా ముక్కుకు సర్జరీ చేయించుకుని ఒక వెలుగు వెలుగుతున్నారు. అప్పట్లో శ్రీదేవి పెట్టుకున్న ముక్కు పుడక మరో ట్రెండ్ సెట్టర్, అందుకే చిన్నగా ఉన్న ట్రెండీ నోస్ రింగ్‌ను ఇప్పటికీ శ్రీదేవి ముక్కుపుడకగా పిలుస్తారు. సినిమాలో ముక్కు పుడక పెట్టుకుని వెలిగిపోయిన శ్రీదేవిలా ఉండాలని ముక్కులు కుట్టించుకున్న అమ్మాయిలకు లెక్కలేదంటే అది అతిశయోక్తి కాదు.

తనను చిన్నతనం నుంచి చూశా!

- **అప్పట్లో తనను కరెక్ట్ చేసే బాధ్యత నాదే**
- **నటిగా, తల్లిగా శ్రీదేవి నిబద్ధత కనబరిచారు**
- **తన ఆకస్మిక మరణం తీరని లోటు: కమల్**



చెన్నై, ఫిబ్రవరి 25: సినీ రంగంలో అతిలోక సుందరిగా పేరొందిన శ్రీదేవి అకాల మరణం తీరని లోటని సినీ నటుడు, రాజకీయవేత్త కమల్ హాసన్ పేర్కొన్నారు. బాలనటిగా సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన శ్రీదేవి అత్యున్నత స్థానాన్ని అందుకోవడం వెనక అలుపెరగని కృషి ఉందన్నారు. తన కృషికి తగ్గ స్థానాన్ని పొందారని తెలిపారు. తను కూడా బాల నటుడిగా సినీ రంగ ప్రవేశం చేసిన కారణంగా శ్రీదేవి ఎదుగుదలను దగ్గరి నుంచి చూడగలిగానని కమల్ వివరించారు. తామిద్దరం కలిసి పనిచేసిన సమయంలో శ్రీదేవి ఇంకా చిన్నపిల్లేనని.. అప్పుడప్పుడు నటనలో, డ్యాన్స్‌లో తనను కరెక్ట్ చేసే బాధ్యతను బాలచందర్ తనపైనే పెట్టేవారని గుర్తుచేసుకున్నారు. తొలినాళ్లలో నటనాపరంగా పరిణతి లేదు.. అయితే, ప్రతీరోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ తన ప్రతిభను సానబెట్టుకున్నారని కమల్ పేర్కొన్నారు. ఆమె ఒక్కో మెట్టు ఎక్కుతున్న తీరు నన్ను దిగ్భ్రమ పరిచేదని చెప్పారు. నేనంటే తనకు, తనంటే నాకు ప్రత్యేక అభిమానం.. అయితే, తీరికలేని షెడ్యూల్ మూలంగా మా మధ్య దూరం పెరిగిందన్నారు. వృత్తిపై శ్రద్ధ, చేసే పనిపై చిత్తశుద్ధి విషయంలో మేమిద్దరమూ ఒకేలా ఉండేవాళ్లం.. అందుకే ఒకరిపై ఒకరికి అభిమానం ఉండేదని వివరించారు. ఈ ఏడాది జనవరిలో తనను చివరిసారిగా కలిసానని కమల్ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో.. ఇప్పుడు కూడా సద్మా గీతం నా చెవుల్లో వినబడుతోందని చెప్పారు. అసమాన ప్రతిభావంతురాలైన, అందమైన నటి శ్రీదేవికి ఇదే కరెక్ట్ జోల పాట అని నాకనిపిస్తోందని పేర్కొన్నారు. సినీ రంగంలోనే కాదు ఓ తల్లిగా కూడా శ్రీదేవి నిబద్ధతను చూపించారని కమల్ కొనియాడారు. జాన్వి, ఖుషిల పెంపకంలో ఆదర్శవంతమైన తల్లిగా నిలిచారన్నారు. కాగా, శ్రీదేవి ఆకస్మిక మరణంతో తీవ్ర విషాదంలో మునిగిన బోనీ కపూర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు కమల్ పేర్కొన్నారు.

విశాఖలోనూ డ్రగ్స్ భూతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖులను సైతం సిట్ విచారణకు రప్పించిన ఈ డ్రగ్.. ప్రశాంతతకు నిలయమైన సాగరనగరంలోకీ ప్రవేశించింది. విశాఖపట్నంలోని కొన్ని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల వద్ద లైసర్జిక్ యాసిడ్ డై ఇథలమైడ్ (ఎల్ఎస్‌డి) డ్రగ్ లభ్యం కావడం పోలీసులనే షాక్‌కు గురిచేసింది. విశాఖ నగర పోలీసు ప్రత్యేక బృందం ఇటీవల జరిపిన తనిఖీల్లో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలలో చదివే విద్యార్థుల బృందాల వద్ద కొద్ది మోతాదులో ఎల్ఎస్‌డి లభ్యమైంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

గోవా, బెంగళూరు నుంచి

ఈ విద్యార్థుల బృందాలు కొద్దిరోజుల క్రితం గోవా వెళ్లి వచ్చినట్లు పోలీసులు కనుగొన్నారు. గోవా, బెంగళూరుల నుంచి ఈ డ్రగ్ విశాఖకు చేరుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ విద్యార్థి బృందాలు, కొందరు చదువు మధ్యలో ఆపేసిన యువకుల ద్వారా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఓ పోలీసు అధికారి చెప్పారు. మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నందున తెరవెనుక ఎవరున్నారన్నది కూడా త్వరలో బహిర్గతమవుతుందన్న ధీమాను ఆ అధికారి వ్యక్తం చేశారు.

గంజాయి ఇచ్చి ఎల్ఎస్‌డి..

వస్తుమార్పిడి విధానంలో ఎల్ఎస్‌డిని ఈ బృందాలు విశాఖకు తరలిస్తుండటం పోలీసులనే ఆశ్చర్యపరచింది. విశాఖ మన్యంలో విస్తారంగా లభ్యమౌతున్న గంజాయిని బెంగళూరుకు తరలించి అక్కడినుంచి దానికి బదులుగా ఎల్ఎస్‌డిని తీసుకువస్తున్నారు. విశాఖ మన్యంలో అత్యంత విలువైన శీలావతి రకం గంజాయిని వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ గంజాయికి దేశ, విదేశాల్లో విపరీతమైన గిరాకీ ఉండటంతో కిలోల లెక్కల దీనిని తీసుకొంటున్న డ్రగ్ స్మగ్లర్లు మిల్లీ, మైక్రో గ్రాముల్లో ఎల్ఎస్‌డిని ఇస్తున్నారు.


పర్యాటకులుగా మోటార్ సైకిళ్లపై తరలింపు

విశాఖ మన్యంలోని పలు ప్రాంతాలకు పర్యాటకుల మాదిరిగా మోటారు సైకిళ్లపై బృందాలుగా వెళుతున్న విద్యార్థులు వాటికి అమర్చిన రహస్య అరల్లో గంజాయిని తరలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అరకు, పాడేరు, లంబసింగి, చింతపల్లి, గూడెం కొత్తవీధి , సీలేరు తదితర ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. మోటారు సైకిళ్ల కింది భాగంలోని అరల్లో రెండు కిలోల వరకూ గంజాయి పడుతుంది. ఇలా గంజాయిని విశాఖ, గాజువాక, అనకాపల్లి వంటి కేంద్రాలకు తరలిస్తున్న విద్యార్థులు అక్కడి నుంచి బస్సులు, రైళ్లలో బెంగుళూరుకు చేరవేస్తున్నారు. బైక్‌లపై విద్యార్థులు టూరిస్టుల మాదిరిగా వెళ్లి వస్తుండడంతో మన్యంలో తనిఖీలు చేసే ఎక్సైజ్, పోలీసు అధికారులకు అనుమానం రాలేదు.

ప్రముఖ కళాశాలల వద్ద నిఘా..

విశాఖపట్నంలోని ప్రముఖ కళాశాలలకు చెందిన విద్యార్థులు కూడా పోలీసుల అనుమానితుల జాబితాలో ఉండటంతో నిఘాను పెంచారు. డ్రగ్ సంస్కృతి విశాఖలో విస్తరించకుండా కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసు ప్రత్యేక బృందం రంగం సిద్ధం చేస్తుంది. త్వరలో స్పష్టమైన ఆధారాలతో బాధ్యులను అరెస్టు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

శ్రీదేవి మృతిపై గవర్నర్, సీఎం దిగ్భ్రాంతి



హైదరాబాద్, ఫిబ్రవరి 25: ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీదేవి అకాల మృతి పట్ల తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆమె మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు నరసింహన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా, సినీ నటి శ్రీదేవి అకాల మృతిపై సీఎం కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల సినిమాల్లో నటించిన శ్రీదేవి తన అందం, నటన, నృత్యాలతో ఎందరో అభిమానులను సంపాదించుకున్నారని సీఎం పేర్కొన్నారు. శ్రీదేవి మరణం భారతీయ సినీ పరిశ్రమకు, తెలుగు సినిమా అభిమానులకు వెలితిని మిగులుస్తుందన్నారు. వివిధ సినిమాల్లో ఆమె పోషించిన అద్భుతమైన పాత్రలు ఆమెను చిరస్మరణీయంగా ఉంచుతాయన్నారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

అమరపురికి అతిలోక సుందరి

(మొదటి పేజీ తరువాయి)

కీడు శంకించింది. కొంపదీసి మన అతిలోక సుందరి కాదు కదా.. మన జగదేక సుందరి కాదు కదా.. 50 ఏళ్ల సినీ అనుభవం దాటినా ఇప్పటికీ పదహారేళ్ల వయసులో ఉన్నట్లుగానే.. అప్పుడు పాడినట్లే 'సిరిమల్లెపూవా.. చిన్నారి చిలకమ్మా.. నావాడు ఎవడే.. నాతోడు ఎవడే' అని పాడుతున్నట్లుగా గుండె లోతుల్లోకి మధురమైన పాటలా వినిపించే మన శ్రీ...దే..వి... క్షేమంగానే ఉండి ఉంటారు కదా అనుకున్నా. వణికే చేతులతో.. కళ్లు నులుముకుంటూ ఒక నోటిఫికేషన్ మీద ట్యాప్ చేశా. ఒక్కసారిగా గుండెల్లో వేనవేల అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. దిగ్గున మంచం మీద నుంచి లేచి కూర్చున్నా. ఐటెంలో ఫొటో చూస్తే.. మన శ్రీదేవే! అవును.. కోటానుకోట్ల భారతీయుల హృదయాలను ఏలిన రారాణి ఇక లేదు. కూతురు హీరోయిన్‌గా ఆరంగేట్రం చేయబోతున్న సినిమా ఇంకా గుమ్మడికాయ కొట్టకముందే.. ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయింది. నిక్కర్లేసుకునే చిన్న పిల్లాడి దగ్గర నుంచి రాంగోపాల్ వర్మ వరకు.. అలనాటి కైకాల సత్యనారాయణ నుంచి నిన్నా మొన్నటి కుర్రాళ్ల వరకు ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆరాధించే ఆ నిలువెత్తు వజ్రాల కొండ.. అందరి గుండెలు బద్దలుచేస్తూ అమరావతికి ఎగిరిపోయింది. అంబరాన ఉన్న అమరపురి తనదంటూ ఎప్పుడో చెప్పిన ఆ అపురూప సౌందర్యరాశి మానవాళికి సెలవంటూ చిరునవ్వుతో సాగిపోయింది. ప్రముఖ సినీనటి శ్రీదేవి (54) శనివారం అర్ధరాత్రి సమయంలో దుబాయ్‌లో కార్డియాక్ అరెస్టుతో కన్నుమూశారు. భర్త బోనీకపూర్, చిన్న కూతురు ఖుషీతో కలిసి ఒక పెళ్లివేడుక కోసం ఆమె దుబాయ్ వెళ్లారు. పెద్దకుమార్తె జాన్వి తాను నటిస్తున్న తొలి చిత్రం 'ధడక్' షూటింగ్‌లో ఉండటంతో వెళ్లలేకపోయారు. పెళ్లికి వచ్చిన అతిథులందరినీ పలకరిస్తుండటంతో అంతా శ్రీదేవి.. శ్రీదేవి.. అని సంబరపడుతుండగానే ఒక్కసారిగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. 1963 ఆగస్టు 13వ తేదీన జన్మించిన శ్రీదేవి.. నాలుగేళ్ల వయసులోనే సినిమాల్లో బాలనటిగా నటించారు. ఆ తర్వాత 'పదహారేళ్ల వయసు' సినిమాతో హీరోయిన్‌గా పునఃప్రవేశం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాలలో ఆమె నటించారు. 1996లో బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్‌ను శ్రీదేవి పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు జాన్వీ, ఖుషీ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. 15 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నంది అవార్డులు కైవసం చేసుకున్న శ్రీదేవిని 2013లో భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. పెళ్లి తర్వాత చాలాకాలం పాటు సినిమాలకు దూరంగా ఉన్న శ్రీదేవి సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా 2012 సంవత్సరంలో వచ్చిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' , 'మామ్' లాంటి సినిమాల్లో నటించి అందరినీ మెప్పించారు. సుదీర్ఘ విరామం తర్వాత ఈ మధ్య కాలంలోనే ఆమె మళ్లీ పలు వేడుకలకు హాజరవుతూ, తన కుమార్తెలను కూడా వెంట తీసుకొస్తూ ప్రేక్షకులకు ఏదో ఒకలా కనిపిస్తున్నారు. కూతుళ్ల భవిష్యత్తుపై ఆమె ఎంతగానో తపనపడేవారని తోటి సినీ నటులు చెబుతుంటారు. పెద్ద కుమార్తె జాన్విని తనంతటి నటిని చేయాలని తపనపడే శ్రీదేవి.. ఆమె తొలి చిత్రం విడుదల కాకముందే ఈ లోకాన్ని వీడి వెళ్లిపోవడం బాధాకరం. శ్రీదేవి మృతిపట్ల పలువురు నాయకులు, సినిమా ప్రముఖులు, విమర్శకులు తదితరులు సంతాపం తెలిపారు.


ఎలా జరిగింది..

సమీప బంధువుల పెళ్లి కోసం దుబాయ్ వెళ్లిన శ్రీదేవి.. అక్కడి ఎమిరేట్స్ టవర్స్ హోటల్లో బస చేశారు. రాత్రి 11 గంటల సమయంలో ఆమె హోటల్ గదిలోని బాత్రూంలో స్పృహతప్పి పడిపోయారు. దాంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను రషీద్ ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే శ్రీదేవి కన్ను మూసినట్లు వైద్యులు తెలిపారు. అయితే.. పోస్టుమార్టం నివేదిక ఆలస్యం కావడంతో డెత్ సర్టిఫికెట్ ఇంకా అందలేదు. దాంతో మృతదేహం అప్పగింత తదితర కార్యక్రమాలు ఆలస్యం అయ్యాయి. ఈలోగా భారత కాన్సులేట్ అధికారులు దుబాయ్ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని భారతదేశానికి తరలించడానికి అవసరమైన అనుమతులు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. మృతదేహం ముంబైకి వచ్చిన తర్వాత నగరంలోని చార్‌బంగ్లాలో కాసేపు ఉంచిన తర్వాత.. అభిమానుల సందర్శనార్థం మెహబూబా స్టూడియోకు తరలిస్తారు. ఇంటివద్ద అతి కొద్ది మంది వీవీఐపీలను మాత్రమే శ్రీదేవి మృతదేహాన్ని చూసేందుకు అనుమతించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జుహూలోని శాంతాక్రజ్ శ్మశానవాటికలో శ్రీదేవి అంత్యక్రియలు జరగనున్నాయి.

తమిళనాడులో సినీ రాజకీయాలు!



అక్కడ సినీ నటులే రాజ్యాధికారాన్ని ఏలారు. తొలినుంచీ ఆ రాష్ట్ర రాజకీయాల్లో వారిదే పట్టు. తాజాగా కమల్‌హాసన్ పార్టీ ప్రకటించారు. సినీ రాజకీయాలను ఓసారి పరిశీలిస్తే..



సీఎన్ అన్నాదురై

డీఎంకే స్థాపకుడు. 1967 రాష్ట్రంలో తొలి కాంగ్రెస్సేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సినీ రంగం నుంచి వచ్చిన తొలి నేత. 'వెలైకారి' వంటి చిత్రానికి రచయిత.

జయలలిత

1991లో తొలిసారి సీఎం పదవి అధిష్ఠించిన జయలలిత.. 2006 వరకు ఆరు దఫాలుగా 14 ఏళ్లు ఆ పదవిలో కొనసాగారు





ఎంజీ రామచంద్రన్

తమిళ సినీ రంగాన్ని ఒక ఊపు ఊపిన ఎంజీర్ 1977 నుంచి చనిపోయే వరకు 1987 వరకు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు.

కరుణానిధి

అనేక చిత్రాలకు కథలు, మాటలు అందించిన కరుణానిధి డీఎంకే తరపున సీఎంగా ఎన్నికయ్యారు. 'పరాశక్తి' ఆయన కెరీర్‌లో అత్యద్భుత విజయం సాధించిన చిత్రంగా నిలిచింది





ఎస్ఎస్ రాజేంద్రన్

అలనాటి నటుడైన రాజేంద్రన్ అసెంబ్లీ, లోక్‌సభ, రాజ్యసభకు ఎంపికయ్యారు.

కొందరు ఇలా విఫలం..



శివాజీ గణేశన్

ఎంజీఆర్‌కు సమకాలీనుడైన శివాజీ గణేశన్ సినిమాల్లో అప్రతిహతంగా రాణించినా.. రాజకీయాల్లో విఫలమయ్యారు.

విజయ్‌కాంత్



2005లో డీఎండీకేను స్థాపించిన విజయ్‌కాంత్..2011లో ఏఐఏడీఎంకేతో పొత్తుపెట్టుకుని మంచి స్థానాలే సాధించారు. 2016లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ ఘోరం పరాజయం పాలైంది. విజయ్‌కాంత్ డిపాజిట్ కోల్పోయారు.

ఆ బొమ్మ.. అమ్మదేనా?



- **విగ్రహంలో కానరాని జయలలిత పోలికలు**
- **కార్యకర్తల నుంచి వెల్లువెత్తిన విమర్శలు**
- **ట్విట్టర్‌లోనూ విగ్రహం తీరుపై జోకులు**
- **మార్పులు చేయిస్తామంటున్న మంత్రులు**

చెన్నై, ఫిబ్రవరి 25: ఎంతో ఆర్భాటంగా జయలలిత నిలువెత్తు కాంస్య విగ్రహం తయారు చేయించారు. ఆమె జయంతి సందర్భంగా దాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఎంజీఆర్ విగ్రహం పక్కనే ప్రతిష్ఠించారు. కానీ ఆ విగ్రహాన్ని చూసినవారంతా.. ఆమె ఎవరన్న ప్రశ్నలే వేశారు. అసలు ముఖ కవళికలు ఎక్కడా కలవడం లేదని, ఆ విగ్రహం జయలలితదేనా అన్న అనుమానం వస్తోందని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి. ట్విట్టర్‌లో కూడా ఈ విగ్రహం గురించి విపరీతంగా జోకులు పేలడంతో.. విగ్రహంలో మార్పులు చేయాలని అన్నాడీఎంకే నేతలు నిర్ణయించారు. ఈ విషయాన్ని అన్నాడీఎంకే ఎమ్మెల్యే, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. జయలలిత విగ్రహాన్ని ఆవిష్కరించడం పట్ల కేవలం తమిళనాడులోని పార్టీ కార్యకర్తలు, అభిమానులకే కాక.. యావత్ ప్రపంచంలో ఉన్న ఆమె అభిమానులకు చాలా సంతోషం కలిగిందని, అయితే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని పోస్టులను బట్టి చూస్తే విగ్రహంలో కొన్ని మార్పులు చేయాల్సి వస్తోందని ఆయన చెప్పారు. విగ్రహాన్ని తయారుచేసిన శిల్పి ప్రసాదే దీనికి మార్పులు చేస్తారని మరో మంత్రి కదంబూర్ రాజు చెప్పారు. విగ్రహం ఆవిష్కరించారని తెలియగానే వేల సంఖ్యలో కార్యకర్తలు అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయానికి వచ్చారు. చూసినవాళ్లంతా 'అదేంటి.. అమ్మ విగ్రహం అని చెప్పి ఏదో పెట్టారు' అనే అన్నారు. దాంతో ఇక మార్పులు చేయడం తప్పదని తేల్చుకుని.. విగ్రహ రూపకర్తకే చెప్పారు. ఇక జయలలిత జయంతి సందర్భంగా ఉద్యోగాలు చేసే మహిళలకు స్కూటర్ల కొనుగోలుకు 50% సబ్సిడీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో గరిష్ఠంగా రూ. 25వలే వరకు సబ్సిడీ ఇస్తారు.

పీఎన్‌బీ కేసులో కొనసాగిన విచారణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో ఆ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మాజీ రావును సీబీఐ అధికారులు ఆదివారం రెండో రోజూ విచారించారు. ఆయనతో పాటు పలువురు పీఎన్‌బీ అధకారులను కూడా ప్రశ్నించారు. కుంభకోణం ఎలా జరిగిందనేదానిపై ఆరా తీశారు.

అసలు కుంభకోణం ఎలా మొదలైంది.. దానిని ఎవరు ఆధ్యులు అనే అంశాన్ని నిర్ధారించేందుకు అవసరమైన సమాచారం తెలుసుకునేలా సీబీఐ ప్రశ్నల పరంపర కొనసాగిందని అధికారులు చెప్పారు.


ఆధ్యాత్మికతకు భారత్ కేంద్రం

అనాది నుంచి ఆ సంస్కృతి ఉంది
భిన్నమతాలు, సంస్కృతులకు కేంద్రం: మోదీ
అరబిందో ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలు



అరబిందో విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

అరోవిల్లే, ఫిబ్రవరి 25: శతాబ్దాల నుంచే భారత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆ పారంపర్యతను ఇంకా కొనసాగిస్తోందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ భారత్‌తో సర్వ మానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తోందని, అనేక మతాలు- సంస్కృతుల ప్రజలు కలిసి మెలిసి ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోని సుప్రసిద్ధ మతాలన్నీ భారత్‌లోనే ఉద్భవించాయని చెప్పారు. ఆ మతాలన్నీ ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించాయని చెప్పారు. పుదుచ్చేరిలోని ఆరోవెల్లేలోని అంతర్జాతీయ టౌన్‌షిప్‌లోని శ్రీ అరంబిందో ఆశ్రమాన్ని(మదర్ ఆశ్రమం- మిర్రా అల్ఫాసా) ఆదివార ప్రధాని మోదీ సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ..ఈ పట్టణం అంతర్జాతీయ ఆధ్యాత్మిక పట్టణంగా అవతరించడం మానవాళి ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ''ప్రపంచంలోని గొప్పవైన అనేక మతాలు భారత్‌లో ఆవిర్భవించాయి. అరబిందో ప్రవచించిన ఆధ్యాత్మికమార్గం ఇప్పటికీ ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తోంది. గత ఐదు దశాబ్దాలుగా అరబిందో ఆశ్రమం సామాజిక సంస్కృతి, విద్య, ఆర్థిక, ఆధ్యాత్మిక ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వృద్ధులు, యువత, పేద, ధనిక అని తేడా లేకుండా అందరినీ ఈ ఆశ్రయం ఏకం చేసిందని, అరబిందో ప్రవచించిన 'డివైన్ మదర్' సరిహద్దులు చెరిపేసి ప్రతి ఒక్కరినీ ఏకం చేసిందని పేర్కొన్నారు. 1969లో ఈ పట్టణాన్ని ప్రారంభించినప్పుడు 124 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని, ఇప్పుడు ఈ పట్టణంలో 49 దేశాలకు చెందిన 2,400 మంది నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరబిందో ఆశ్రయంలోని విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చటించారు.



మత్రి మందిర్‌లో ప్రధాని నరేంద్రమోదీ

భద్రతకు ప్రాధాన్యమివ్వండి

- 'మన్‌కీ బాత్'లో నరేంద్రమోదీ

మహిళల నాయకత్వంలో అభివృద్ధి సాధించే దిశగా భారతదేశం పయనిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రతి నెలా ఆకాశవాణిలో ప్రసారయ్యే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ''మనం మహిళల నాయకత్వంలో అభివృద్ధి గురించి చర్చించుకుంటున్నాం. భారతదేశం కేవలం మహిళల అభివృద్ధి నుంచి మహిళల నాయకత్వంలో అభివృద్ధి దిశగా పయనిస్తోంది'' అన్నారు. జీవితంలోని అన్ని దశల్లోనూ మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించవలసిన బాధ్యత అందరికీ ఉందన్నారు. 'నవ భారతం' సిద్ధాంతం భారతదేశ అభివృద్ధిలో మహిళలను సమాన భాగస్వాములుగా పరిగణిస్తుందన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ..'' సంపూర్ణ స్త్రీత్వం లభిస్తేనే సంపూర్ణ స్వాతంత్ర్యం పొందినట్లుగా స్వామి వివేకానంద పేర్కొన్నారు. ఇప్పుడది మన దేశంలో నిజం కావాలి. మహిళలవల్లే పురుషులకు పేరు ప్రతిష్ఠలు, గుర్తింపు వచ్చాయి. యశోదా-నందన్, కౌశల్యా-నందన్, గాంధారి-పుత్ర ఇందుకు నిదర్శనం'' అని మోదీ పేర్కొన్నారు. నిజాన్ని గుర్తించేవరకూ విశ్రమించకూడదని యువతకు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక ఆవిష్కరణల వెనుక ఇదే మూలమని పేర్కొన్నారు. ఏమిటి, ఎందుకు, ఎలా అనే ప్రశ్నలకు సమాధానం లభిస్తేనే సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. మార్చి నాల్గున జాతీయ భద్రతా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ..''రోజువారి జనజీవనంలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వండి. సమస్యలు వస్తే స్పందించే దేశంగా మన దేశం అవతరించాలి'' అని సూచించారు. సమాజంలో మనపక్క ఏం జరుగుతుందో గుర్తించగలిగే స్థితిలో మనం లేనప్పుడూ ఎప్పుడు కూడా మన లక్ష్యాలను అందుకోలేమని అన్నారు. ''కొందరు హెచ్చరిక బోర్డులను చదువుతారు. కానీ పట్టించుకోరు. ఇది దురదృష్టకరం. ప్రకృతి విపత్తులను పక్కనపెడితే.. అనేక సమస్యలు మన అజాగ్రత్త వల్లే ఉత్పన్నమవుతున్నాయి. మనం జాగ్రత్తగా ఉంటే వాటిని నివారించవచ్చు. కానీ.. ఆ పరిస్థితి లేదు'' అని మోదీ పేర్కొన్నారు. హోళీ పండుగ మనకు సోదర భావాన్ని, ఐకమత్యాన్ని సూచిస్తుందన్నారు. కృత్రిమ మేధాశక్తిని దివ్యాంగులకు ప్రయోజనకరంగా ఉపయోగించడంపై పరిశోధన చేయాలని శాస్త్రవేత్తలను కోరారు. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధాశకి... పేదల సంక్షేమానికి దోహదపడాలన్నారు.

కాంగ్రెస్ పాలనతో పోల్చండి: మోదీ

దేశాన్ని కాంగ్రెస్ 48 ఏళ్లు పరిపాలించిందని, ఆ పాలనతో తమ 48 నెలల పాలనను పోల్చి చూడాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. పుదుచ్చేరిలో నిర్వహించిన బీజేపీ సభలో ప్రధాని మాట్లాడారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ పాలనతో తన పాలనను పోల్చి చూడాలని సభికులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. ''బీజేపీకి అభివృద్ధి పాలన. కాంగ్రెస్‌ది అధోగతి పాలన. కాంగ్రెస్ హయాంలో పుదుచ్చేరి చాలా వెనుకబడిపోయింది. మౌలిక వసతులు లేనేలేవు. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ బీజేపీ విజయం సాధించడం ఖాయం. ఇక కాంగ్రెస్‌కు చివరకు మిగిలేది ఒక్క పుదుచ్చేరి మాత్రమే'' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

జ్యోతిష్యుడు అలియాస్ కార్లదొంగ

- **ఢిల్లీలో నిషిత్ శాస్త్రి అరెస్టు**
- **అనుచరుడితో లగ్జరీ కార్ల చోరీ**
- **ఫోర్జరీ పత్రాలతో కార్ల అమ్మకం**
- **టీవీ చానళ్లలో రోజూ కార్యక్రమాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: దేశ రాజధానిలో ఆయనో ప్రముఖ జ్యోతిష్యుడు. పేరు నిషిత్ శాస్త్రి. ఆయనతో చెయ్యి చూపించుకోవాలని, జాతకం చెప్పించుకోవాలని చాలామంది క్యూలు కడుతుంటారు. కానీ.. అలాంటి పెద్దమనిషి కాస్తా తన కొద్దిబద్ధులు చూపించుకున్నాడు. ఒక టాక్సీడ్రైవర్‌ను ప్రత్యేకంగా నియమించుకుని అతడితో లగ్జరీకార్లు దొంగతనం చేయించి.. చివరకు పోలీసులకు దొరికేశాడు. బృందావనం నుంచి తెప్పించిన ఫోర్జరీ పత్రాలతో.. ఈ దొంగకార్లను అమ్మేసేవారు. అమ్మేయగా వాళ్ల వద్ద మిగిలిన ఒక బీఎండబ్ల్యు, ఒక ఆడి కారును, మరో రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరి ఫోర్ట్ వద్ద తాము దొంగతనం చేసిన ఇన్నోవా క్రిస్టా కారుతో జోయ్ విగ్ అనే ఆ డ్రైవర్ ముందుగా దొరికాడు. అతడిని పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే అప్పుడు నిషిత్ శాస్త్రి పేరు బయటకొచ్చింది. పలు టీవీ చానళ్లలో దాదాపు ప్రతిరోజూ నిషిత్ శాస్త్రి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసారం అవుతుంటాయి. విగ్‌ను మొదట టాక్సీడ్రైవర్‌గా నియమించుకుని, రాత్రిపూట ఎక్కడెక్కడ బాగా లగ్జరీ కార్లు బయట పార్క్ చేసి ఉంటారో చూడమనేవారు. తర్వాత నెమ్మదిగా డ్రైవర్లతో పరిచయం పెంచుకుని, ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం చూపిస్తామని చెప్పి, తర్వాత టెస్ట్ డ్రైవ్‌కని చెప్పి ఆ వాహనాలతో పారిపోయేవాడు. కార్లు అమ్మడం పెద్ద సమస్య అయ్యేది కాదని.. ప్రధానంగా అసలు తాళాలు తమ దగ్గరే ఉండటంతో కస్టమర్లు నమ్మేవారని విగ్ చెప్పాడు. ఇప్పటివరకు వీళ్లిద్దరూ ఇలా చాలా కార్లను యూపీ పరిసర ప్రాంతాల్లో దొంగిలించి ఫోర్జరీ పత్రాలతో అమ్మేశారని డీసీపీ బనియా తెలిపారు. కారు దొంగతనం చేసిన తర్వాత వీళ్లు అందులో ఉండే జీపీఎస్ పరికరాన్ని పనిచేయకుండా చెడగొట్టేవారని, దాంతో కారు యజమాని ఫిర్యాదుచేసినా దాన్ని కనిపెట్టడం సాధ్యమయ్యేది కాదని పోలీసులు చెప్పారు. తాను మహారాష్ట్రలోని ఓ కాలేజి నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీతో పాటు ఐఐఎం నుంచి ఎంబీయే కూడా చేసినట్లు నిషిత్ శాస్త్రి పోలీసుల విచారణలో చెప్పారు. మథురలో తనకు జ్యోతిష్య శిక్షణాలయం కూడా ఉందన్నారు. బృందావనంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడి నుంచి తన జ్యోతిష్య వ్యాపారం చేసేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఉంది. టీవీ స్టూడియోలకు వెళ్లేటపుడు కూడా ప్రతిసారీ ఒకో లగ్జరీ కారులో వెళ్లేవారు. దాంతో భక్తులతో పాటు అన్ని వర్గాల్లో పాపులారిటీ సంపాదించారు.



వాళ్ల మాజీ సీఎం జైలుకు వెళ్లారు.. చౌకీదారేమో అవినీతిపై హితోక్తులు

ప్రధాని నరేంద్రమోదీకి రాహుల్ చురకలు

- **కర్ణాటకలోని బాగల్‌కోటలో భారీ సభ**

బాగల్‌కోట్, ఫిబ్రవరి 25: ''వాళ్ల మాజీ ముఖ్యమంత్రి (బీఎస్ యడ్యూరప్ప) అవినీతి ఆరోపణల కేసులో జైలుకు వెళ్లొచ్చారు. కానీ.. అదే పార్టీకి చెందిన.. దేశ సంరక్షుడైన (చౌకీదార్) ముఖ్యనేత మాత్రం అవినీతి నిర్మూలన గురించి మాట్లాడుతారు'' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. కర్ణాటకలోని బాగల్‌కోటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాహుల్ పాల్గొని మాట్లాడారు. ''అవినీతి పట్ల ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని ప్రధాని చెబుతుంటారు. కానీ.. అది ఎన్నికల నినా దంగానే మారిపోయింది. నేను ఈ దేశానికి చౌకీదార్ (రక్షకుడి)గా ఉంటానని 2014లో మోదీ పేర్కొన్నారు. కానీ.. అదే పార్టీకి చెందిన ఓ మాజీ సీఎం, నలుగురు మంత్రులు అవినీతి కేసులో జైలుకు వెళ్లివచ్చారు. ఇప్పుడు ఆయన ఏమంటారు?'' అని ప్రశ్నించారు. ఇప్పుడు మోదీ హయాంలోనే అతి పెద్ద కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. బ్యాంకింగ్ కుంభకోణాలు ఇందుకు నిదర్శమని అన్నారు. విజయ్‌మాల్యా, లలిత్‌మోదీ, నీరవ్‌మోదీ దేశం విడిచి ఎలా వెళ్లగలిగారో ప్రధాని మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని తమ ప్రభుత్వం బసవన్న ప్రవచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుస్తోందని, సుపరిపాలనను అందిస్తోం దని చెప్పారు. ప్రధాని మోదీ తరహాలతో తాము ఎప్పుడు తప్పుడు హామీలు ఇవ్వలేదని, అభివృద్ధిని చేసి చూపించామని అన్నారు. ''కొద్ది రోజుల్లోనే ప్రధాని మోదీ కర్ణాటకలో పర్యటిస్తారు. బసవన్న సూక్తులను అనుసరిస్తామని ప్రకటిస్తారు. ఇది మీరందరూ చూస్తారు'' అని పేర్కొన్నారు.




రాహుల్ అభివాదం



కాంగ్రెస్ సభకు హాజరైన జనం..

తుర్కుమెనిస్థాన్-అఫ్ఘానిస్థాన్- పాకిస్థాన్- ఇండియా

'తాపి' గ్యాస్‌పైప్‌లైన్ ఇలా!



నాలుగు దేశాలు తుర్కుమెనిస్థాన్-అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్- ఇండియా మధ్య ఈ నెల 23 క్రితం గ్యాస్‌పైప్‌లైన్ సరఫరా పథకం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుతో తుర్కెమిస్థాన్‌లోని సెర్కెతాబాద్ గ్యాస్ నిల్వల కేంద్రం నుంచి అఫ్ఘానిస్థాన్-పాక్ మీదుగా ఇండియాకు గ్యాస్ సరఫరా చేయనున్నారు. ఈ ప్రాజెక్టు స్వరూపం ఇదే..

శ్రీదేవి... ఈ పేరు వినగానే అందం, అభినయం, సినిమాల్లో ఆమె చేసిన పాత్రలు మన కళ్ళ ముందు కదలాడతాయి. అమాయకమైన ఆమె రూపం మనల్ని ఇట్టే ఆకర్షిస్తుంది. ముద్దులొలికే మాటలు మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. 50 ఏళ్ళ నట జీవితంలో ఆమె చేయని క్యారెక్టర్ లేదు, పండించని పాత్ర లేదు. పాత్ర ఏదైనా, తనతో నటించే హీరో ఎవరైనా తనదైన శైలిలో ఆ పాత్రకు వన్నె తెచ్చే ప్రతిభ ఆమె సొంతం. నాలుగేళ్ళ ప్రాయంలోనే తెరంగేట్రం చేసిన శ్రీదేవి తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 300 సినిమాల్లో నటించి దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకొని లేడీ సూపర్‌స్టార్‌గా పేరు తెచ్చుకోవడం అంటే అది మామూలు విషయం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఏ భారతీయ నటికీ ఇది సాధ్యం కాలేదు. ఆ సినిమాలో శ్రీదేవి హీరోయిన్ అంటే చాలు ఆమెను ఆరాధించే అభిమానుల ఆనందానికి అవధులు ఉండేవి కావు. ఎందుకంటే ఆమె చేసిన పాత్రలు అలాంటివి.





భారతీయ చలన చిత్ర రంగంలో ఏకైక లేడీ సూపర్‌స్టార్

indian queen







1967లో కన్దన్ కరుణాయ్ అనే చిత్రంతో తెరంగేట్రం చేసింది శ్రీదేవి. హీరోయిన్‌గా ఎదిగిన తర్వాత ఎక్కువగా తమిళ, మలయాళ చిత్రాల్లోనే నటించారు. ఆమె చేసిన మలయాళ చిత్రాల్లో ఎక్కువ శాతం ఐ.వి.శశి దర్శకత్వంలో వచ్చినవే. ఆద్యపాదం, ఆలింగనము, కుట్టవుమ్ శిక్షయుమ్, ఆ నిమషం వంటి సినిమాలు మలయాళంలో మంచి పేరును తెచ్చి పెట్టాయి. 1976లో వచ్చిన తమిళ చిత్రం మూంద్రు ముడిచ్చు ఆమెకు ఎనలేని కీర్తిని సంపాదించి పెట్టింది. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కమల్‌హాసన్, రజనీ కాంత్ నటించారు. ఈ సినిమా తర్వాత తమిళ్‌లో ఎన్నో సూపర్‌హిట్ సినిమాల్లో నటించారు శ్రీదేవి. కమల్ హాసన్‌తో గురు, శంకర్ లాల్, సిగప్పు రోజక్కల్. తాయి ళ్లమాల్ నానిల్లై, మీండుం కోకిల, వాజ్వే మాయం, వరుమైయిన్ నిరం సిగప్పు, నీలా మలార్గల్, మూంద్రం పిరై, 16 వయత్తినిలే చిత్రాల్లో నటించారు. ధర్మయుద్ధం, ప్రియ, పొక్కిరి రాజా, టక్కర్ రాజా, అడుతా వారిసు, నాన్ అడిమై ఇల్లై మొదలగు సినిమాల్లో రజనీకాంత్‌తో కలిసి నటించారు. 1975 నుంచి 1985 వరకు అంటే పది సంవత్సరాలపాటు తమిళ్‌లో అగ్రతారగా వెలుగొందారు శ్రీదేవి. మరోవైపు తెలుగులోనూ తన జైత్రయాత్రను కొనసాగించారు. దాదాపు అందరు తెలుగు హీరోలతో ఆమె కలిసి నటించారు. ఆమె నటించిన తెలుగు చిత్రాలు ఎక్కువగా కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చినవే. కమల్‌హాసన్‌తో ఎక్కువ సినిమాలు చేసిన హీరోయిన్‌గా శ్రీదేవి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాతి స్థానం హీరో కృష్ణకు దక్కుతుంది.

1977లో భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన 16 వయత్తినిలె చిత్రం శ్రీదేవికి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఇదే చిత్రాన్ని తెలుగులో కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో పదహారేళ్ళ వయసు పేరుతో రూపొందించారు. తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధించింది. హీరోయిన్ నుంచి టాప్ హీరోయిన్ వరకు వెళ్ళడానికి ఈ సినిమా పునాది అయింది. ఇదే సినిమాని హిందీలో సోల్వా సావన్ పేరుతో భారతీరాజా రూపొందించారు. కానీ, అక్కడ ఈ సినిమా విజయాన్ని సాధించలేదు. ఆ తర్వాత జితేంద్రతో కలిసి నటించిన హిమ్మత్‌వాలా ఘన విజయం సాధించింది. ఆ చిత్రం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఎదిగేందుకు దోహదపడింది. కమల్‌హాసన్, శ్రీదేవిలతో బాలు మహేంద్ర రూపొందించిన మూంద్రుమ్ పిరై శ్రీదేవికి నటిగా గొప్ప గుర్తింపు తెచ్చింది. ఇదే చిత్రాన్ని తెలుగులో వసంతకోకిల పేరుతో అనువదించారు. తెలుగులోనూ ఆమెకు మంచి పేరు తెచ్చింది సినిమా. హిందీలో సద్మా పేరుతో ఈ చిత్రం రూపొందింది. మూడు భాషల్లోనూ కమల్‌హాసన్, శ్రీదేవిలకు మంచి పేరు తెచ్చిన సినిమా ఇది. హిందీలో 71 సినిమాల్లో నటించిన శ్రీదేవి ఒక దశలో టాప్ హీరోయిన్‌గా వెలుగొందింది. అప్పట్లో అధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా చెప్పుకునేవారు. 1980 దశకంలో నగీన, మిస్టర్ ఇండియా, చాందిని, చాల్‌బాజ్ చిత్రాలు ఆమెకు గొప్ప పేరును తీసుకొచ్చాయి. చాల్‌బాజ్ చిత్రంలోని ఆమె నటనకు మొదటి ఫిలింఫేర్ అవార్డు లభించింది. మిస్టర్ ఇండియా చిత్రం ద్వారా అందరి ప్రశంసలు అందుకున్నారు శ్రీదేవి. ఈ చిత్రంలో హవా హవాయి పాటకు ఆమె చేసిన నృత్యాన్ని ఇప్పటికీ మరచిపోలేము. ఈ చిత్రంలోనే చార్లీ చాప్లిన్‌గా ఆమె నటన అందర్నీ ఆశ్చర్యపరిచింది. శ్రీదేవి కెరీర్‌లో గుర్తుండిపోయే మరో మంచి సినిమా చాందిని. ఒక పరిపూర్ణ నటిగా ఈ సినిమా ఆమెకు మంచి కీర్తి ప్రతిష్ఠలను తెచ్చింది. ఆ తర్వాత లమ్‌హే చిత్రం ఆమెకు రెండో ఫిలింఫేర్ అవార్డును తెచ్చిపెట్టింది. అలాగే ఖుదా గవా, గుమ్‌రాహ్ చిత్రాల్లో తన నటనతో అందరి హృదయాలను దోచుకున్నారు. జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ శ్రీదేవి పేరు తెచ్చుకున్నారు. దాంతో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తను తీస్తున్న జురాసిక్ పార్క్ చిత్రంలో నటింపజేసేందుకు ఆమెను సంప్రదించారు. అయితే ఆ చిత్రంలో తన పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం లేకపోవడం, అప్పటికే తను బిజీగా ఉండడం వంటి కారణాల వల్ల ఆ సినిమా చేయలేకపోయింది. అనిల్‌కపూర్, శ్రీదేవి జంటగా భారీ బడ్జెట్‌తో బోనీకపూర్ నిర్మించిన రూప్ కి రాణి చోరోంకా రాజా ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆ తర్వాత 1997లో వీరిద్దరూ కలిసి నటించిన జుదాయ్ ఘనవిజయం సాధించింది. ఈ సినిమా సమయంలోనే బోనీకపూర్‌ని వివాహం చేసుకున్న శ్రీదేవి సినిమాలకు దూరమయ్యారు.



తెలుగులో శ్రీదేవి టాప్ టెన్ సినిమాలు

1. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పదహారేళ్ళ వయసు'
2. లక్ష్మీదీపక్ దర్శకత్వంలో వచ్చిన 'కార్తీక దీపం'
3. కె.బాలచందర్ దర్శకత్వంలో రూపొందిన 'ఆకలి రాజ్యం'
4. దాసరి నారాయణరావు రూపొందించిన 'ప్రేమాభిషేకం'
5. తాతినేని రామారావు దర్శకత్వం వహించిన 'ఇల్లాలు'
6. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'త్రిశూలం'
7. కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'వజ్రాయుధం'
8. కె.రాఘవేంద్రరావు రూపొందించిన 'ఆఖరిపోరాటం'
9. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి'
10. రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన 'క్షణక్షణం'

తెలుగులో శ్రీదేవి మరెన్నో సూపర్‌హిట్ చిత్రాల్లో నటించినప్పటికీ నటిగా ఆమెకు మంచి పేరు తెచ్చిన సినిమాలు ఇవి.







శ్రీదేవి అందుకున్న పురస్కారాలు

చలనచిత్ర రంగానికి శ్రీదేవి చేసిన కృషికిగానూ భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 1981లో తమిళ చిత్రం మీండుం కోకిలలో ఆమె నటనకు ఫిలింఫేర్ అవార్డు దక్కింది. చాల్ బాజ్ చిత్రంలోని ఆమె నటనకుగానూ ఫిలింఫేర్ పురస్కారం దక్కింది. అలాగే 1991లో లమ్‌హే చిత్రానికి ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటి పురస్కారం.. క్షణక్షణం చిత్రానికి ఉత్తమనటిగా ఫిల్మ్ ఫేర్ పురస్కారం దక్కాయి. అలాగే క్షణక్షణం చిత్రానికి ఉత్తమ నటిగా నంది అవార్డు అందుకున్నారు. హిందీ సినిమా రంగంలో చేసిన కృషికిగాను జైంట్ అవార్డు(1994), హిందీ సినిమా రంగానికి చేసిన సేవలకుగాను ఎం.ఏ.ఎం.ఐ అవార్డు(2003), 2005 వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్ వారి జీవితకాల సాఫల్య పురస్కారం(2005) అందుకున్నారు. అదే విధంగా మలయాళ చిత్రం దేవరాగంకి గాను టొరొంటో చిత్రోత్సవంలో ఉత్తమ నటి పురస్కారం(1996) అందుకున్నారు.



- **కె.రాఘవేంద్రరావు:** శ్రీదేవి మృతి నన్ను కలచివేసింది. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించినప్పట్నుంచీ శ్రీదేవితో పరిచయం ఉంది. పదహారేళ్ల వయసు నుంచి జగదేకవీరుడు అతిలోక సుందరి వరకు తనతో చాలా సినిమాలు తీశాను. శ్రీదేవి చిత్ర పరిశ్రమలో స్వయంకృషితో ఎదుగుతూ వచ్చింది.
- **కృష్ణ:** శ్రీదేవి మరణవార్త వినగానే భూకంపం వచ్చినట్టుగా అనిపించింది. చిన్న వయసులోనే ఆమె చనిపోవడం బాధాకరం. చెన్నైలో మాది, శ్రీదేవిది పక్క పక్క ఇళ్లే. నరేశ్, శ్రీదేవి చిన్ననాటి స్నేహితులు. శ్రీదేవి మా ఇంట్లో ఎదిగిన పిల్ల.
- **చిరంజీవి:** శ్రీదేవి గురించి ఇలాంటి ఒక సందర్భం వస్తుందని అనుకోలేదు. ఇది దురదృష్టం. ఇలాంటి నటి ఇంతవరకు లేరు. ఇకమీద వస్తారని కూడా నేను అనుకోవటం లేదు. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన జగదేక వీరుడు అతిలోక సుందరి చిత్రంలోని పాత్ర ఆమె కోసమే పుట్టిందా అన్నంతగా నటించింది. ఆమె మరణ వార్తని ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను. శ్రీదేవి చనిపోయిందని నేను అనుకోవట్లేదు. ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో శ్రీదేవి చిరస్థాయిగా జీవించే ఉంటారు.
- **బాలకృష్ణ:** శ్రీదేవి హఠాన్మరణం బాధాకరం. శ్రీదేవితో నాన్న చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్ని అయినా కళ్ళతోనే పలికించగల మహానటి శ్రీదేవి. ఆమె ఆత్మకి శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని వేడుకొంటున్నాను.
- **మోహన్‌బాబు:** శ్రీదేవి మరణం భారతీయ చిత్రసీమకు తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోనిబ్బరాన్ని ఆ శిరిడీ సాయినాథుడు ప్రసాదించాలని కోరుకొంటున్నాను.
- **నాగార్జున:** శ్రీదేవి మనల్ని వదిలి వెళ్ళిపోయారనే నిజాన్ని ఫేస్ చేయడానికి ఉదయం నుంచి ఎంతో ప్రయత్నిస్తున్నాను. ఇదొక చెడ్డ కల అని అనిపిస్తోంది. ఆమె తాలుకు జ్ఞాపకాలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకొస్తూనే ఉన్నాయి. మేమంతా నిన్ను ప్రేమిస్తున్నాం శ్రీదేవి.
- **వెంకటేశ్:** శ్రీదేవి ఇక లేరు అనే మాట విని ఎంతో బాధపడుతున్నాను. అలాంటి అద్భుతమైన నటిని కోల్పోయిన మన దేశానికి ఈ రోజు చాలా దురదృష్టకరమైన రోజు. పరిశ్రమలో భాగం కావాలని వచ్చే ప్రతి ఒక్కరికి ఆమె స్ఫూర్తిగా నిలిచారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.
- **పవన్ కల్యాణ్:** శ్రీదేవి ఇక లేరు అనే మాట నమ్మలేనిది. కానీ వెండితెరపై ఆమె పోషించిన భిన్నమైన పాత్రలన్నీ చిరస్మరణీయాలే. భౌతికంగా ఈ లోకాన్ని వీడినా నటిగా శ్రీదేవి ముద్ర చిత్ర సీమలో సుస్థిరం. శ్రీదేవిగారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మానసిక స్థైర్యాన్ని భగవంతుడు అందించాలని ప్రార్థిస్తున్నాను.
- **మహేశ్‌బాబు:** శ్రీదేవి మరణవార్త విని షాక్ అయ్యాను. ఆమె అద్భుతమైన నటి. ఎప్పటికీ నా అభిమాన నటి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.
- **ఎన్టీఆర్:** స్వర్గం నుంచి వచ్చారు. అన్నీ చూశారు, సాధించారు. మళ్ళీ అక్కడికే తిరిగి వెళ్లిపోయారు.
- **ప్రభాస్:** శ్రీదేవి మరణ వార్త వినగానే ఎంతో బాధపడ్డాను. శ్రీదేవి శకం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.
- **ఎస్.ఎస్.రాజమౌళి:** ఈ బాధాకర వార్త విని దిగ్భ్రాంతి చెందాను. శ్రీదేవి తొలి లేడీ సూపర్‌స్టార్. 54 ఏళ్ల వయసుకే నటిగా 50 ఏళ్లు రాణించడం అద్భుతం. మీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.
- **ఆమిర్‌ఖాన్:** శ్రీదేవి నటనకు, స్వభావానికి పెద్ద అభిమానిని. ఆమెకు ఉన్న లక్షలాది అభిమానుల్లో నేనూ ఒకడిగా నివాళులర్పిస్తున్నాను. గౌరవంతో మిమ్మల్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకునే ఉంటాం మామ్.
- **సి.అశ్వనీదత్:** శ్రీదేవి అందం, అభినయంతో అందరినీ మెప్పించారు. ఆమె మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.
- **చంద్రమోహన్:** శ్రీదేవి బాలనటిగా ఉన్నప్పటి నుంచీ నాకు తెలుసు. అందరితోనూ ఎంతో చలాకీగా ఉండేది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను.
- **మురళీమోహన్:** శ్రీదేవి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. బాలనటిగానే ఆమె ఎన్నో చిత్రాలు చేశారు. ఆమె లేని లోటు తీర్చలేనిది.
- **కమల్‌హాసన్:** టీనేజ్ నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని చూశాను. స్టార్‌డమ్‌కు ఆమె అర్హురాలే. ఆమె చనిపోయిందని తెలియగానే ఆఖరిసారి నేను శ్రీదేవిని కలిసిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారి నా కళ్ల ముందు మెదిలాయి. సద్మా చిత్రంలోని లాలిపాట ఇంకా వినపడుతూనే ఉంది. మనం శ్రీదేవిని చాలా మిస్సవుతాం.
- **రజనీకాంత్:** శ్రీదేవి చనిపోయారని తెలిసి చాలా షాకయ్యాను. ఓ మంచి స్నేహితురాలిని కోల్పోయాను. చిత్ర పరిశ్రమ గొప్ప నటిని కోల్పోయింది. శ్రీదేవి కుటుంబం ఎంత బాధపడుతోందో నేనూ అంతే బాధపడుతున్నాను.
- **నాగబాబు:** శ్రీదేవి చనిపోయారని తెలిసి షాకయ్యాను. ఆమె కుటుంబం ధైర్యంగా ఉండాలి.
- **రాశి ఖన్నా:** బాధగా ఉంది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.
- **రమ్యకృష్ణ:** శ్రీదేవి మరణవార్త విని గుండె పగిలిపోయింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలి. ఆమె కుటుంబం ధైర్యంగా ఉండాలి.
- **నితిన్:** ఇది నిజం కాకూడదని అనుకుంటున్నాను. శ్రీదేవి చనిపోవడం నిజంగా చాలా బాధాకరం.
- **కాజల్ అగర్వాల్:** నాకెంతో ఇష్టమైన నటి శ్రీదేవి చనిపోయారంటే నమ్మలేకపోతున్నాను.
- **హేమమాలిని:** శ్రీదేవి చనిపోయారని తెలిసి షాకయ్యాను. ఆమె నటనతో చాలా మందిని ప్రభావితం చేశారు.
- **రవితేజ:** చిత్ర పరిశ్రమకు ఇది తీరని లోటు. శ్రీదేవి గారు చనిపోయారంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.
- **బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్:** మా బ్యానర్‌లో మొదటి సినిమా సూపర్ స్టార్ కృష్ణగారితో తీసిన 'మకుటం లేని మహారాజు'లో శ్రీదేవి హీరోయిన్. శ్రీదేవి లేరన్న వార్తని నమ్మలేకపోతున్నాను. ఆవిడ ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటున్నాను.
- **అల్లు అర్జున్:** నిజంగా ఇది చాలా చెడువార్త. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్నాను.
- **రకుల్‌ప్రీత్ సింగ్:** దీన్ని నేను నమ్మలేను.. భారత చిత్ర పరిశ్రమలో ఆమె స్థానం, ఖ్యాతి చెరిగిపోనిది.
- **ఎ.ఆర్.రెహమాన్:** శ్రీదేవి ఆత్మకు శాంతి చేకూరాలి. ఆమె కుటుంబానికి నా సానుభూతి తెలుపుతున్నాను.
- **శ్రుతిహాసన్:** హృదయ విదాకరమైన వార్త. ఈ భయంకరమైన విషయాన్ని నమ్మలేకపోతున్నాను.
- **హన్సిక:** శ్రీదేవి కుటుంబానికి నా సానుభూతి తెలుపుతున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.
- **సాయిధరమ్ తేజ్:** అందమా అందుమా.. అందనంటి అందమా.. మీరు అందనంత చోటుకు వెళ్లిపోయారు.
- **పరుచూరి గోపాలకృష్ణ:** ఇంద్రుడికి కన్ను కుట్టింది. ఇంతటి సౌందర్యరాశి భూలోకంలో ఉండటం ఏమిటని సురులకు అసూయ పుట్టింది. అందుకే మన శ్రీదేవిని తీసుకువెళ్లిపోయారు. ఆమె ఆత్మకు శాంతి కలుగుగాక.
- **వంశీ పైడిపల్లి:** శ్రీదేవి మరణించి ఉండొచ్చు.. కానీ మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారు.
- **ఎ.ఎం.రత్నం:** శ్రీదేవి కుటుంబంతో నా అనుబంధం మరువలేనిది. ముంబయి వెళ్ళినప్పుడల్లా శ్రీదేవి ఇంటికి వెళ్లకుండా ఎప్పుడూ వెనుదిరగలేదు. అటువంటి మంచి మనిషి, అద్భుతమైన నటి నేడు మన మధ్య లేదన్న నిజాన్ని దిగమింగడం చాలా కష్టంగా ఉంది.

ప్రభుత్వ, ప్రైవేట్ భాగసామ్యంతోనే..

- రక్షణ, వైమానిక రంగాల్లో అభివృద్ధి
- ఇతరులపై ఆధారపడటం తగ్గించాలి
- 'మేక్ ఇన్ ఇండియా' పరిశ్రమలు
- సాంకేతిక పరిజ్ఞానాన్ని వృద్ధి చేయాలి
- ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం
- విశాఖ సీఐఐ సదస్సులో నిపుణుల వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (మనం న్యూస్): దేశంలో రక్షణ, వైమానిక రంగాల్లో తయారీ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యం ఉండాలని నిపుణులు పేర్కొన్నారు. రక్షణ, వైమానిక రంగాల అవసరాల కోసం ఇతర దేశాలపైనే ఆధారపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వ రూపొందించిన భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) విధానంతో ఈ రంగాల్లో అభివృద్ధి చెందడానికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రంగాల్లో అవసరమైన సబ్ సిస్టమ్స్, పరికరాలు మాత్రమే దేశంలో తయారు చేయగలుగుతున్నామని, పూర్తి స్థాయిలో ఆయుధాలను దేశంలోనే తయారయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐల ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం.. వైమానిక, రక్షణ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటు, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధికి గల అవకాశాలపై ప్లీనరీ సెషన్‌లో చర్చించారు. రక్షణ రంగ పరిశ్రమల నిర్వాహకులు, ఆయుధాలు, పరికరాల వినియోగంలో అనుభవజ్ఞులైన నిపుణులు సమగ్రంగా చర్చించారు. కె.పి.ఎం.జి. సంస్థకు చెందిన ఏరో స్పేస్ విభాగం అధిపతి అంబర్ దూబే సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ చర్చాగోష్టిలో తొలుత ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలు, అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ వివరించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పన.. జీఎస్టీ, ఓఈఎం పరిశ్రమలపై రూ.10 కోట్ల వరకు సబ్సిడీ.. ఏరో స్పేస్, రక్షణ రంగ పరిశ్రమల పార్క్ ఏర్పాటు కోసం ముందుకు వచ్చే సంస్థలకు భూమి, భవనాలు, ప్లాంటు, యంత్రాలకు అయ్యే వ్యయంలో 50 శాతం వరకు సబ్సిడీ.. రూ.500 కోట్లకు పైబడిన పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. దూబే మాట్లాడుతూ.. ఏపీలో రక్షణ, వైమానిక రంగ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. జెన్సర్ ఏరోస్పేస్ సంస్థ సీఈవో అరుణాకర్ మిశ్రా మాట్లాడుతూ.. వైమానిక, రక్షణ రంగాల్లో మనం ఇతరులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఇతరులు మనపై ఆధారపడే పరిస్థితి ఏర్పడాలన్నారు. రక్షణ రంగ ఉత్పత్తులు, ఆయుధాల తయారీలో మన స్వయంసంవృద్ధి సాధించాల్సి ఉందన్నారు. భారత వాయుసేన ఎయిర్ మార్షల్ అశ్వనీ కె.నాభ్ మాట్లా డుతూ.. రక్షణ, వైమానిక రంగంలో ఆయుధాలు, ఉత్పత్తులు దేశంలోనే తయారు చేయగలిగితే వ్యూహాత్మకంగా, ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. వెమ్ టెక్నాలజీస్ చైర్మన్ వి.వెంకటరాజు, ఎయిర్‌బస్ భారతదేశ ప్రతినిధి అనిల్ గుప్తా, భారత్ ఫోర్జ్ సంస్థ ఉపాధ్యక్షుడు అజయ్‌శర్మ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రెండో రోజు 285 ఎంవోయూలు

- 1.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- 2.86 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి



సీఐఐ రెండో రోజు సదస్సులో 285 ఎంవోయూలు కుదిరాయని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి అమర్‌నాథ్ రెడ్డి చెప్పారు. తద్వారా 1.74 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 2.86 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏరో స్పేస్, రక్షణ రంగాల్లో 9,406 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, తద్వారా 6 వేలమందికి ఉపాధి అవకాశాలు రానున్నాయని తెలిపారు. టెక్స్‌టైల్ రంగంరలో 25 ఒప్పందాలపై సంతకాలు చేశారని, తద్వారా 33 వేల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయని తెలిపారు. అలాగే ఇంధన రంగంలో 34 ఒప్పందాలపై సంతకాలు చేశారని, లక్షా 11వేల 921 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో 169 ఒప్పందాలు కుదిరాయని, దాదాపు 48 వేలమంది ఉపాధి కలగనుందని వెల్లడించారు. ఆరోగ్య రంగంలో 25, ఐటీ, ఎలక్ట్రానిక్స్‌లో 22 ఒప్పందాలు జరిగినట్టు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జైరాం రమేశ్

మోదీతో బాబు ఫిక్సింగ్

పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలది డ్రామా..


- మోదీ 'హోదా' హామీ ఏమైంది?
- కాంగ్రెస్ గెలిస్తే అమలు: జైరాం

విజయవాడ, ఫిబ్రవరి 25 (మనం న్యూస్ ప్రతినిధి): పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలది ముమ్మాటికీ డ్రామా అని, చంద్రబాబు దుబాయ్ నుంచి ఆ పార్టీ సభ్యులను ఆడించారని విమర్శించారు. ఆదివారం విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జైరాం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ.. విభజన చట్టం సరిగాలేదని విమర్శలు చేసిన చంద్రబాబు చట్టానికి సవరణ చేసేందుకు నాలుగేళ్లుగా ఎందుకు ప్రయత్నించ లేదని ప్రశ్నించారు. సవరణకు టీడీపీ ప్రయత్నిస్తే పార్లమెంటులో తాము మద్దతు తెలుపుతామన్నారు. నాలుగేళ్లుగా టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు ఏం చేశాయని నిలదీశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతిలో మోదీ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ ఏమైందని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే పదేళ్లు హోదా ఇస్తామని చెప్పిన వెంకయ్యనాయుడు ఇపుడు ఏం చెబుతారని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా వద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని కేంద్రం చెబుతున్న మాట అబద్ధమని అన్నారు. 11 రాష్ట్రాలు ప్రత్యేక హోదా అనుభవిస్తుంటే, 12వ రాష్ట్రంగా ఏపీ ఉండటానికి మోదీకి అభ్యంతరం ఏంటని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలని, రాష్ట్రం ఎందుకు కడుతోందని ప్రశ్నించారు. వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే టీడీపీ కొత్త డ్రామాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. 2019లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని, దీనిపైనే మొదటి సంతకం చేస్తామని జైరాం రమేశ్ అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు జె.గౌతమ్, ఎం.రాజేశ్వరరావు, అధికార ప్రతినిధి కె.శివాజీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణ

- అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు
- సీఐఐ ప్రతినిధులతో భేటీలో లోకేశ్
- అధికారులతో కలసి వర్కింగ్ గ్రూపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (మనం న్యూస్ బ్యూరో): అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నామని, అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి అనే నినాదంతో అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు ఆదివారం.. సీఐఐ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. సీఐఐ వార్షిక సమావేశం నిర్వహణపై చర్చించారు. మార్చి 16, 17వ తేదీల్లో విజయవాడలో నిర్వహించే ఈ సమావేశానికి రావాల్సిందిగా లోకేశ్‌ను సీఐఐ ప్రతినిధులు ఆహ్వానించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై లోకేశ్ చర్చించారు. అలాగే అధికారులు, సీఐఐ ప్రతినిధులతో ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి, పరిశ్రమలు రావడానికి ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఐటీ రంగంలో నాలుగు ప్రాంతాల్లో నాలుగు ఐటీ హబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి వారం ఒక రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుపై ఎలా సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారో.. సీఐఐ-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో పారిశ్రామిక అభివృద్ధి కోసం వారంలో ఒక రోజు కేటాయించి సమీక్ష నిర్వహించుకుందామని లోకేశ్ పేర్కొన్నారు.



విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్

అనంతలో ప్లాస్టిక్ పార్క్

- 2500 మందికి ఉపాధి అవకాశాలు
- 11 సూక్ష్మ నీటిపారుదల కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం
- ఉద్యాన పంటల సాగు రైతులకు లబ్ధి

విశాఖపట్నం, ఫిబ్రవరి 25: అనంతపురం జిల్లాలో 200 ఎకరాల విస్తీర్ణంలో ప్లాస్టిక్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 150 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసే కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2500 మందికి ఉపాధి కలగనుంది. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం 11 సూక్ష్మ నీటిపారుదల కంపెనీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో సంతకాలు చేశారు. ఈ 11 కంపెనీలలో 8 ఇతర రాష్ట్రాలకు చెందినవి కాగా, 3 ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి. ఉద్యాన పంటకు సాగుకు ప్రాధాన్యం ఇస్తూ, ఆ దిశగా రైతాంగాన్ని మళ్లించాలని దృష్టిసారిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అవగాహన ఒప్పందాలు చేసుకుంది. వీటి వలన ఉద్యాన రంగం వేగవంతంగా అభివృద్ధి చెందడంతో పాటు ఈ కంపెనీల రాకతో రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన సాగు రైతులకు లాభసాటిగా మారేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి సూర్యప్రకాష్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మా ఇంటికి వస్తావని..

శ్రీదేవి హఠాన్మరణంతో తిరుపతిలో విషాదం

- ఇక్కడే నివాసం ఉంటున్న నటి పినతల్లులు




తిరుపతి, ఫిబ్రవరి 25: అందాల నటి శ్రీదేవి హఠాన్మరణం వార్త అభిమానులను కలచివేసింది. తిరుపతిలోని ఆమె బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తిరుపతితో శ్రీదేవికి ప్రత్యేక అనుబంధముంది. ఆమె పూర్వీకులు ఇక్కడి నుంచే తమిళనాడుకు వలస వెళ్లారు. శ్రీదేవి దగ్గరి బంధువులు ఇప్పటికీ తిరుపతిలో నివసిస్తున్నారు. ఆమె మరణవార్త విని పద్మావతిపురంలో ఉన్న బంధువులు విషాదంలో మునిగిపోయారు. శ్రీదేవి తల్లి రాజేశ్వరి మరణించిన తర్వాత పినతల్లులు అనసూయమ్మ, ముని సుబ్బమ్మ ఆమె ఆలనా పాలనా చూశారు. శ్రీదేవితో తమ అనుబంధా న్ని గుర్తు చేసుకుని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె తిరు పతి వచ్చినప్పుడల్లా తమ ఇంటికి వచ్చి పలకరిం చేదని.. ఈ సారి వచ్చినప్పుడు కలుస్తానని మాటిచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోయిందంటూ విలపించారు. సినిమాలపై ప్రేమతో మరో వ్యాపకం లేకుండా శ్రీదేవి కష్టపడేదని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సైబర్ నేరాలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

కాలంలో సంచలనం సృష్టించిన 'వాన్నా క్రై' అలాంటిదే. ఈ హ్యాకింగ్ నుంచి మన సిస్టంలను కాపాడుకోవడంతో పాటు.. అవసరమైతే అవతలివాళ్ల రక్షణ వ్యవస్థను ఛేదించుకుని వాళ్ల సమాచారాన్ని కూడా తెలుసుకోవడం ఎలాగనే అంశాన్ని చెప్పేదే.. 'ఎథికల్ హ్యాకింగ్'. ఎథికల్ హ్యాకింగ్ చేసేవారిని వైట్‌హ్యాట్ అని కూడా పిలుస్తారు. తాము నేర్చుకున్న పరిజ్ఞానాన్ని సైబర్‌భద్రత కల్పించడానికే ఉపయోగించాలన్నది ఇందులో ప్రధానాంశం. దీనిపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లో ఆదివారం ఒక వర్క్‌షాప్ జరిగింది. అందులో ప్రధానంగా రివర్స్ ఇంజనీరింగ్ అంటే ఏంటి, ప్రాగ్జీలు, వీపీఎన్‌లు, వెబ్‌సైట్ల మీద దాడులు.. వాటి నుంచి రక్షణ చర్యలు.. సిస్టం హ్యాకింగ్, బ్యాక్‌డోర్స్, ఫేస్‌బుక్ ఖ్యాకింగ్.. దాన్నుంచి రక్షణ, వై-ఫై ఆధారిత దాడులు, మొబైల్ హ్యాకింగ్ లాంటి అంశాలను గురించి వివరించారు. అలాగే ఎథికల్ హ్యాకింగ్ రంగానికి సంబంధించిన శిక్షణ, అందులో ఉండే అవకాశాల గురించి కూడా తెలిపారు. ఫేస్‌బుక్ హ్యాకింగ్ గురించి చెప్పినపుడు ఎక్కువమంది ఆసక్తి చూపడం విశేషం. అలాగే వెబ్‌సైట్ల మీద జరిగే హ్యాకింగ్ దాడులు, వాటిని ఎలా అడ్డుకోవాలనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలన్నింటినీ ఎథికల్ హ్యాకింగ్‌తో అడ్డుకోవచ్చని, అసలు అవి జరగకుండా కూడా చూడొచ్చని వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు వివరించారు. చిన్న చిన్న టెక్నిక్‌లతోనే మన సైబర్ జీవితానికి మంచి రక్షణ కల్పించవచ్చన్న విషయాన్ని తెలిపారు. ఏదైనా సైట్‌లో చిన్న బగ్ కనిపించగానే వెంటనే సంబంధిత అధికారులకు, నిపుణులకు తెలియజేయాలని అన్నారు.



చంద్రబాబుకు కాంగ్రెస్ గతే

- స్వార్థ రాజకీయాలను ప్రజలు గ్రహించారు
- కోలుకోలేని దెబ్బ కొడతారు: అంబటి రాంబాబు



విజయనగరం, ఫిబ్రవరి 25 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రంలో కనీసం ఐదు శాతం ఓట్లు కూడా లేని బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఏమీ కాదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు మాత్రం కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అన్నారు. ప్రత్యేక హోదా కాదని ప్యాకేజీలు కోరిన చంద్రబాబు స్వార్థపూరిత రాజకీయాలను ప్రజలు గ్రహించారని, తగిన సమయం కోసం వేచి చూసి కోలుకోలేని దెబ్బ కొడతారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన చంద్రబాబును చిత్తుచిత్తుగా ఓడించకపోతే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు. విజయనగరంలో ఆదివారం జరిగిన వైసీపీ బూత్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో అంబటి పాల్గొన్నారు. ప్రత్యేక హోదా రాకపోతే తమ పార్టీ ఎంపీలు రాజీనామాలు చేస్తారని జగన్‌మోహన్ రెడ్డి చెప్పగానే చంద్రబాబు కాళ్ల కిందకు నీళ్లొచ్చాయని ఎద్దేవా చేశారు. అందుకే అప్పటి నుంచి చంద్రబాబు కూడా ప్రత్యేక హోదా పల్లవి అందుకున్నారని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన ఐఏఎస్ అధికారులు.. మంత్రులు, ఎమ్మెల్యేలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారంటే వ్యవస్థ ఎటువెళ్తోందనన్న ఆందోళన కలుగుతుందన్నారు. కొంతమంది అధికారుల వల్ల ఆ వ్యవస్థ మొత్తానికి చెడ్డపేరు వస్తుందని అంబటి అన్నారు. చంద్రబాబు నాయుడు బృందం అవినీతే ధ్యేయంగా పని చేయడం ప్రజల దౌర్భాగ్యమని పేర్కొన్నారు. అపార రాజకీయ అనుభవం కలిగిన బొత్స సత్యనారాయణ వంటి నేతలు జగన్‌తో కలిసి నడవడం పార్టీకి శుభ పరిణామమని అన్నారు. చంద్రబాబు దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలనుకునే సీనియర్ నాయకులు ఎవరు పార్టీలోకి వచ్చినా ఆహ్వానించడానికి జగన్ సిద్ధంగా ఉన్నారని అంబటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనం చేసుకుని వస్తూ..

ట్యాంకర్‌ను వ్యాన్ ఢీకొని ముగ్గురి మృతి.. మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు.. గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం


ప్రమాదానికి గురైన వ్యాన్

నరసరావుపేట, ఫిబ్రవరి 25 (మనం న్యూస్): డ్రైవర్ రెప్పపాటు నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలితీసుకుంది. గుంటూరు జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. అద్దంకి-నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిలో రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామ సమీపంలో ఆగివున్న ఆయిల్ ట్యాంకర్‌ను వేగంగా వస్తున్న రింగర్ వ్యాను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పొత్తూరి ఝాన్సీ (40), పొత్తూరి రోహిత్ (14), పొత్తూరి మాన్యత(5) అక్కడిక్కడే చనిపోగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పిడుగురాళ్లకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 13 మంది తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శనానికి శుక్రవారం రాత్రి బయల్దేరి వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఆ కుటుంబాన్ని వెంటా డింది. విషయం తెలియగానే నరసరావుపేట రూరల్ సీఐ ప్రభాకర్, నకరికల్లు ఎస్ఐ అనిల్ కుమార్ సిబ్బందితో హుటాహుటిన ప్రమాద స్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నరసరావుపేట, గుంటూరులలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. వ్యాను నుజ్జునుజ్జయి ట్యాంకర్ కింది భాగంలోకి దూసుకెళ్లింది. క్రేన్ సాయంతో దాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ఐటీ పార్క్‌లో మంటలు



- భవనంలో 9 కంపెనీలు
- థర్మాకోల్ సీలింగ్‌తో మంటలవ్యాప్తి
- ఫర్నిచర్.. కంప్యూటర్లు పూర్తిగా దగ్ధం

మంగళగిరి, ఫిబ్రవరి 25 (మనం న్యూస్): మంగళగిరి ఎన్ఆర్‌టీ పార్క్‌లో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. దీంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని కుర్చీలు, బల్లలు అన్నీ దగ్ధమయ్యాయి. మంటలు క్రమంగా పై అంతస్తులకు వ్యాపించాయి. భవనంలో మొత్తం 9 కంపెనీలు ఉన్నట్లుగా సమాచారం. అన్ని అంతస్తుల్లో థర్మాకోల్ షీట్లతో సీలింగ్ చేయడం వల్ల మంటలు వేగంగా విస్తరించాయి. మధ్యాహ్నం 2గంటలకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులోని మంటలను అదుపుచేశారు. రెండోఅంతస్తులోకి మంటలు వ్యాపించకుండా పూర్తిగా నియంత్రించారు. గ్రౌండ్, మొదటి అంతస్థుల్లోని ఫర్నీచర్, ఖరీదైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయరావు ఘటనకు గల కారణాలను దర్యాప్తు చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తామన్నారు.

అగ్నిమాపక సిబ్బంది రావడం ఏమాత్రం ఆలస్యమైనా భారీ నష్టం జరిగేదని డివిజనల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అయితే ఇంత పెద్ద ప్రమాదం జరిగినా.. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడం అదృష్టమన్నారు. భవనాలు, వ్యాపార సముదాయాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు.



టుబాకో బోర్డు అధికారుల సంఘం అధ్యక్షుడిగా మురళీధర్

అమరావతి, ఫిబ్రవరి 25 (మనం ప్రతినిధి): ఆల్ ఇండియా టుబాకో బోర్డు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు మురళీధర్ ఈ పదవిలో కొనసాగుతారు. ఆదివారం గుంటూరులోని పొగాకు బోర్డులో ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా జి.దామోదర్, ప్రధాన కార్యదర్శిగా చింతమనేని ఏసుదాసు, జాయింట్ సెక్రటరీగా డి.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. మాజీ మేనేజర్ బి.ఎన్ మిత్రా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



మెట్రో కోచ్‌ల తయారీ ఇక భారత్‌లోనే

ముంబై: భారత్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతు న్న మెట్రో సిటీల్లో నగర ప్రయాణం రోజు రోజుకీ కష్టత రంగా మారుతోంది. ఈ సమస్య ఇటు నగర ప్రజలకు, అ టు ప్రభుత్వాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య కు చెక్ పెట్టేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రో నగరాల్లో మెట్రో రైళ్లను అందుబాటులోకి తెస్తున్నారు.

మెట్రో రైళ్లకు అవసరమయ్యే కోచ్‌లను, ఇంజన్‌లను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద భారం అధికమవుతోంది. ఈ నేపథ్యంలో భారత్ అవసరాలకు అనుగుణంగా దేశంలోనే మెట్రో రైల్ కోచ్‌ల తయారీకి భారతీయ రైల్వే ముందుకొచ్చింది.

దేశీయంగా మెట్రో రైల్ కోచ్‌ల తయారీ కోసం భార తీయ రైల్వే, మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య పరస్పర అవ గాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా భారతీయ రైల్వే మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో మెట్రో కోచ్ తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనుంది.

దేశవ్యాప్తంగా వివిధ మెట్రో నగరాల్లో మెట్రో రైళ్ల ఏర్పాటు చేసే ప్రభుత్వాలకు ఆర్థికంగా కలిసొచ్చేందుకు మేకిన్ ఇండియా చొరవతో మెట్రో కోచ్‌ల తయారీని భారత రైల్వే వ్యవస్థ చేపట్టనుంది. దీంతో విదేశాల నుంచి మెట్రో కోచ్‌ల దిగుమతి చేసుకునే అవసరం తీరిపోనుంది. తొలి దశ క్రింది ప్రొడక్షన్ ప్లాంట్ ఏర్పాటు, కోచ్‌ల తయారీ కోసం సుమారుగా 600 కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతోంది. తరువాత దశలో ఈ పెట్టుబడి 2,000 కోట్ల రూపాయల వరకు పెరగనుంది.

ఈ ఒప్పందంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా 15,000 మంది దేశీయ యువతకు ఉపాధి లభిస్తుంది. దిగుమతి చేసుకునే కోచ్‌ల కంటే తక్కువ ధరలోనే అందుబాటులోకి తీసుకు వస్తున్నా రు. ఇక్కడ తయారయ్యే మెట్రో కోచ్‌లను విదేశాలకు కూడా ఎగుమతి చేయబోతున్నారు.



మహారాష్ట్ర ప్రభుత్వం సుమారుగా 370 ఎకరాలను రాయితీ ధరతో మెట్రో కోచ్ తయారీ ప్లాంటు ఏర్పాటు కోసం భారతీయ రైల్వేకు అందిస్తోంది. ఒప్పందంలో రైల్వే అనుసంధానంతో సహా నీరు, విద్యుత్ మీద రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులో రాయితీ కల్పిస్తోంది.

ముంబయ్ నగరంలో జరిగిన మ్యాగ్నెటిక్ మహారాష్ట్ర సదస్సులో భారతీయ రైల్వేతో ఈ మెట్రో కోచ్ తయారీ ప్లాంటు ఏర్పాటు చేసే ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులో ఇంకా ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకుంది. రాష్ట్ర ప్రయోజనాలు, పెట్టుబడులను ఆకర్షించే దిశగా జరిగిన ఈ సదస్సులో ముంబయ్-పుణే నగరాల మధ్య గంటకు 350 కిమీల వేగంతో ప్రయాణించే హైపర్‌లూప్ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వర్జిన్ హైపర్‌లూప్ వన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

గత 70 ఏళ్లలో భారతీయ రైల్వే మహారాష్ట్రలో కర్మాగారం ఏర్పాటుకు పెట్టుబడి పెట్టడం ఇదే తొలిసారి. మరికొన్ని వారాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం భారతీయ రైల్వేకు భూమి కేటాయిస్తే, అతి త్వరలోనే లాతూర్ జిల్లాలోని ఒస్మానాబాద్, నాందేడ్ సమీపంలో ప్లాంటు తయారీ పనులు ప్రారంభం కానున్నాయి.



నీరవ్ కళాఖండాల స్వాధీనం

- ఐటీ దాడుల్లో అత్యంత విలువైన పెయింటింగ్స్ లభ్యం

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకును కోట్లాది రూపాయల మేరకు మోసగించి విదేశాలకు పరారైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన ఇళ్లు, సంస్థలపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఆయన గోదాములపై అధికారులు దాడులు చేసినప్పుడు సుమారు వంద కోట్ల రూపాయల విలువైన అరుదైన, అద్భుతమైన వర్ణచిత్రాలెన్నో లభ్యమయ్యాయి. ఇందులో ఎఫ్.ఎన్. సౌజా, వి.ఎస్. గైతోండే, ఎస్.హెచ్. రజా, అమృతా షేర్ గిల్, అక్బర్ పదంశీ వంటి కళాకారులు వేసిన అపురూపమైన వర్ణచిత్రాలతో పాటు, ఇటలీ, అమెరికా నుంచి తెప్పించిన శిల్పకళా ఖండాలు, క్యూ లీ, జెంగ్ క్సియావ్‌జున్ వంటి కళాకారులు చెక్కిన శిల్పాలు కూడా లభ్యమయ్యాయి. తన బండారం బట్టబయలయ్యే అవకాశం ఉందని ముందే పసిగట్టిన నీరవ్ మోదీ సుమారు 150 పెయింటింగ్స్‌ను, శిల్పకళా ఖండాలను తన ఇంటి నుంచి, ఆఫీసుల నుంచి వాడాలాలోని తమ గిడ్డంగికి తరలించారు. వీటి విలువ ఇదమిత్థంగా ఎంత ఉంటుందనేది ఆదాయపు పన్ను శాఖ మదింపు చేస్తోంది. వీటినిబట్టి చూస్తే నీరవ్ మోదీ లో ఓ కళా పిపాసి కూడా ఉన్నట్టు అనిపిస్తోందని, ఆధునిక చిత్రకళ, ఆధునిక శిల్పకళలను ఆయన బాగా అభిమానించేవాడని అర్థమవుతోందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఇది అసలైనవా, ప్రతిరూపాలా అన్న విషయం పరిశీలిస్తున్నామని ఓ ఆదాయపు పన్ను అధికారి చెప్పారు. ఆయన విదేశాలకు పారిపోయే ముందు ఈ కళాఖండాలను తరలించినట్టు కనిపిస్తోందని, ఇటువంటి కళాఖండాలను ఇంకా ఎక్కడైనా దాచాడేమోనని కూడా పరిశీలిస్తున్నామని ఆ అధికారి తెలిపారు.

5జీ ట్రయల్ సక్సెస్!

- దూకుడు మీదున్న భారతీ ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: దేశీయ టెలికాం దిగ్గజ కంపెనీ ఎయిర్‌టెల్, అలాగే చైనాకు చెందిన నెట్‌వర్కింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ ఉపకరణాల తయారీ సంస్థ హువాయి తాజాగా భారత్‌లో తొలిసారి 5జీ నెట్‌వర్క్ ట్రయల్స్‌ను నిర్వహించాయి. ఇందులో 3 గిగాబైట్ పర్ సెకన్ (జీబీపీఎస్)కు పైగా డేటా స్పీడ్‌ను సాధించినట్లు ఇరు కంపెనీలు ప్రకటించాయి. గురుగావ్‌లోని మానేసర్ వద్ద ఉన్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఈ ట్రయల్స్ జరిగాయి. 5జీ దిశగా మా ప్రయాణానికి తాజా ట్రయల్స్ చాలా కీలకమైనవి. మన జీవన విధానాన్ని మార్చగలిగే శక్తిసామర్థ్యాలు 5జీకి ఉన్నాయి. భారత్‌లో ఈ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు మా భాగస్వాములతో కలిసి పనిచేస్తాం' అని భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్స్ డైరెక్టర్ అభయ్ సావర్గోంకర్ తెలిపారు. తాము 5జీ టెక్నాలజీ అభివృద్ధికి, దాని ఉపయోగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని హువావే వైర్‌లెస్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎమాన్యుయే కోయెలో ఆల్వెస్ పేర్కొన్నారు.



మొబైల్ నగదు లావాదేవీల్లో చైనాను మించిన భారత్

- గత ఐదేళ్లలో భారీగా పెరిగాయి..

న్యూఢిల్లీ: భారత్ టెక్నాలజీలో దూసుకెళుతోంది. కొన్ని విషయాల్లో చైనాను మించిపోతోంది. మొబైల్ వ్యాలెట్ల ద్వారా నగదు లావాదేవీల విషయంలో చైనా, డెన్మార్క్‌లను దాటి భారతదేశం వేగంగా ముందుకు దూసుకెళుతోందని 'గ్లోబల్ డేటా' గణాంకాల ద్వారా వెల్లడైంది. నగదు లావాదేవీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు,



అవినీతి తగ్గేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో డిజిటల్ ప్లాట్‌ఫాం వేదికగా ముఖ్యంగా మొబైల్ వ్యాలెట్‌ల ద్వారా నగదు లావాదేవీల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2013లో రూ.24 బిలియన్లు ఉన్న మొబైల్ వ్యాలెట్ నగదు లావాదేవీలు 2017 నాటికి రూ. 955 బిలియన్లకు చేరాయి. ఇక 2018 ప్రారంభానికి ఇవి ఒక ట్రిలియన్ రూపాయలకు చేరడం గమనార్హం. 'గ్లోబల్ డేటా' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

2017 సంవత్సరంలో గ్లోబల్ డేటా సంస్థ వినియోగదారు చెల్లింపు వివరాల పేరిట ఒక సర్వేను నిర్వహించింది. దాని ద్వారా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. నగదు, కార్డుల ద్వారా చెల్లింపులు చేసే వారు వేగంగా మొబైల్ వ్యాలెట్ల వైపు మళ్లుతున్నారని తెలిపింది. అమెరికా, యూకే వంటి అభివృద్ధి చెందిన మార్కెట్లకు పోటీగా ఈ సంఖ్య పెరుగుతోందట. ఈ విషయంలో చైనా, డెన్మార్క్‌లను భారత్ వెనక్కి నెట్టింది. భారతదేశంలో సర్వేలో పాల్గొన్న వారిలో 55.4% మంది తాము మొబైల్ వాలెట్ వాడుతున్నట్లు చెప్పారు. డిజిటల్ లావాదేవీలకు ఎప్పుడూ ప్రభుత్వ మద్దతు ఉండాలి. దేశంలో ఏళ్ల తరబడి సంప్రదాయ చెల్లింపు విధానాలకు అలవాటు పడ్డ జనాలకు 2016లో నరేంద్ర మోదీ తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం ఒక్కసారిగా ఆలోచన విధానం మారేలా చేసింది. ఇదే ప్రజలు డిజిటల్ లావాదేవీల వైపు మళ్లేలా చేసిందని నివేదిక తెలిపింది. మధ్య, భారీ లావాదేవీలకు ఎక్కువ మంది బ్యాంకింగ్ ఛానల్స్‌ను వినియోగిస్తుండగా, చిన్న చిన్న లావాదేవీలన్నీ మొబైల్ వ్యాలెట్ల వేదికగానే జరుగుతున్నాయని పేర్కొంది.

ప్రస్తుతం దేశంలో డిజిటల్ చెల్లింపుల వేదికల్లో పేటీఎమ్ అందరి ఫేవరెట్‌గా ఉంది. దేశంలో దాదాపు 9.9% డిజిటల్ లావాదేవీలు పేటీఎమ్ వాలెట్ ద్వారానే జరిగినట్లు తెలుస్తోంది. దాని తర్వాత 9.8% పేపాల్ ద్వారా, ఇంకా రెండు పెద్ద వాలెట్లయిన మొబిక్విక్, ఫ్రీచార్జ్ రెండూ కలిపి 5.5% వాటాను కలిగి ఉన్నాయి. ప్రస్తుతం గూగుల్ తేజ్ రాకతో చెల్లింపుల ప్రపంచం సమూలంగా మారనుంది. మొదట్లో కేవలం డబ్బు పంపేందుకు, రిసీవ్ చేసుకునేందుకు మాత్రమే అవకాశం కల్పించిన తేజ్ ప్రస్తుతం ఇంటి అద్దె చెల్లింపులు చేసేందుకు, క్యాబ్ బుకింగ్‌ల చెల్లింపులను చేసేందుకు, రీచార్జ్‌లకు సైతం అవకాశం కల్పించబోతోంది. ఇందుకోసం గూగుల్ ఇండియా చాలా ఖర్చు చేస్తోంది. ఇక వాట్సప్ సైతం రంగంలోకి దిగనుండటంతో దేశ చెల్లింపుల విప్లవం ఏ దిశగా మారనుందో వేచి చూడాలి.

వెలుగు చూసిన మరో మూడు భారీ మోసాలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం మీద సీబీఐ కేసు నమోదు చేసిన తర్వాత కొత్తగా మరో మూడు భారీ మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మూడు మోసాలు ఓ నగల వ్యాపారి, ఓ వ్యాపారి, ఓ బ్యాంక్ అధికారి ద్వారా జరిగాయి. మూడు బ్యాంకుల ఫిర్యాదు మేరకు ఈ కేసులు బయటపడ్డాయి. ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ అనే సంస్థ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ రూ. 389.85 కోట్ల మేరకు మోసగించినట్లు ఓ ఆర్థిక శాఖాధికారి చెప్పారు. ఆ సంస్థ ఓరియంటల్ బ్యాంకు వద్ద నుంచి రుణం తీసుకుని ఎగ్గొట్టినట్టు సమాచారం. కాగా, అమిత్ సింగ్లా అనే వ్యాపారి, మరి కొందరు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రను కోట్లాది రూపాయలు మోసం చేసినట్టు ఆ అధికారి వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు బార్మేర్ శాఖ కార్యాలయంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన చాంద్ చందావత్ తన హోదాను అడ్డం పెట్టుకుని బ్యాంకుని కోట్లాది రూపాయలు మోసం చేసినట్టు తెలిసింది. వీరందరిపై సీబీఐ శనివారం రోజున కేసులు నమోదు చేసింది.

ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషన ల్ అనే వజ్రాల ఎగుమతి సంస్థ బ్యాంకును మోసగిస్తున్నట్టు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఆరు నెలల క్రితమే సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఈ సంస్థకు చెందిన డైరెక్టర్లు సబ్యా సేథ్, రీటా సేథ్, కృష్ణకుమార్ సింగ్, రవి సింగ్‌లపై సీబీఐ కేసులు నమోదు చేసింది. వీరితో పాటు వీరి కంపెనీయే అయిన ద్వారకా దాస్ సేథ్ సెజ్ కార్పొరేషన్ అనే సంస్థ మీద కూడా కేసు పెట్టింది. 2007-2012 మధ్య ఈ కంపెనీ ఓరియంటల్ బ్యాంకులో అనేక రకాలుగా రుణ సౌకర్యాలను ఉపయోగించుకుందని, లేని సంస్థలకు నిధులు అందజేసిందని, తమ రుణ దాతలకు రుణాలు చెల్లించడానికి ఈ కంపెనీ లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌ను కూడా ఉపయోగించుకుందని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది.

రోల్స్ రాయిస్ ఫాంటమ్ 8 విడుదల





ముంబై: బ్రిటన్‌కు చెందిన లగ్జరీ కార్ల కంపెనీ రోల్స్ రాయిస్ ఎనిమిదవ తరానికి చెందిన 2018 ఫాంటమ్ 8 లగ్జరీ కారును విపణిలోకి విడుదల చేసింది. రోల్స్ రాయిస్ పాపులర్ లగ్జరీ కారు ఫాంటమ్ 8వ జనరేషన్ మోడల్ ప్రారంభ ధర రూ. 9.5 కోట్లు కాగా, పొడగించిన వీల్ బేస్ వేరియంట్ ధర రూ. 11.35 లక్షలు ఎక్స్-షోరూమ్(ఇండియా)గా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రసిద్ధి పొందిన లగ్జరీ కారు రోల్స్ రాయిస్ ఫాంటమ్ 8లో రోల్స్ రాయిస్ అభివృద్ధి చేసిన 6.75-లీటర్ కెపాసిటీ గల వి12 ఇంజన్ ఉంది. ఇది 5,000 ఆర్‌పిఎమ్ వద్ద 563 బిహెచ్‌పి పవర్, 1,700 ఆర్‌పిఎమ్ వద్ద 900 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. రోల్స్ రాయిస్ ఫాంటమ్ 8 కారులో జడ్ఎఫ్ నుండి సేకరించిన 8-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ద్వారా ఇంజన్ ప్రొడ్యూస్ చేసే పవర్, టార్క్ వెనుక చక్రాలకు అందుతుంది. ఇందులో జిపిఎస్ రిసీవర్ ఉంటుంది. ఇది కారు లొకేషన్, స్పీడ్ ఆధారంగా గేర్లను మార్చడానికి సహకరిస్తుంది.


రోల్స్ రాయిస్ ఫాంటమ్8 లగ్జరీ సెడాన్ కేవలం 5.3 సెకండ్ల వ్యవధిలోనే గంటకు 0 నుండి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ట వేగం గంటకు 250 కిలోమీటర్లుగా ఉంది. రోల్స్ రాయిస్ వారి నూతన ''ఆర్కిటెక్చర్ ఆఫ్ లగ్జరీ'' అనే ప్లాట్‌ఫామ్ నుండి సేకరించిన సరికొత్త అల్యూమినియం స్పేస్ ఫ్రేమ్ ఆధారంగా అభివృద్ధి చేసిన ఛాసిస్ మీద ఫాంటమ్ 8 కారును నిర్మించారు. రోల్స్ రాయిస్ ఇక మీదట నిర్మించే ప్రతి కారుతో సహా, రోల్స్ రాయిస్ మొట్టమొదటి ఎస్‌యూవీ ''కులినన్''ను కూడా ఇదే ఛాసిస్ మీద నిర్మించనుంది.


2018 రోల్స్ రాయిస్ ఫాంటమ్ 8 పొడవు 5,762 ఎమ్ఎమ్, వెడల్పు 2,018 ఎమ్ఎమ్, ఎత్తు 1,646 ఎమ్ఎమ్, దీని వీల్ బేస్ 3,552 ఎమ్ఎమ్‌గా ఉంది. వీల్ బేస్ పొడగించిన వేరియంట్ పొడవు 5,982 ఎమ్ఎమ్, దీని వీల్ బేస్ 3,772 ఎమ్ఎమ్‌గా ఉంది.




డిజైన్ విషయానికి వస్తే, మునుపటి వెర్షన్‌తో పోల్చుకుంటే సరికొత్త రోల్స్ రాయిస్ ఫాంటమ్ 8 కారులో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. వెనుక వైపున తగ్గించిన డిక్కీ పొడవు, ముందువైపున పెద్ద పరిమాణంలో ఉన్న బానెట్ ప్యాసింజర్లకు సౌకర్యవంతమైన సీటింగ్‌తో పాటు వెనక్కి తెరుచుకునే రియర్ డోర్లు ఉన్నాయి. ఫ్రంట్ డిజైన్ మునుపటి వెర్షన్‌తో పోల్చుకుంటే అత్యంత పదునైన డిజైన్ లక్షణాలను కలిగి ఉంది. చిన్న పరిమాణంలో ఉన్న హెడ్‌ల్యాంప్స్, రెండు హెడ్‌ల్యాంప్స్‌కు మధ్యలో రోల్స్ రాయిస్ సిగ్నేచర్ ఫ్రంట్ గ్రిల్ ఏర్పాటై ఉంటుంది. బానెట్ ముందు వైపున వచ్చే లోహపు ఆర్నమెంట్ పొడవు కూడా అర అంగుళం దాకా పెరిగింది.

రోల్స్ రాయిస్ 8 ఇంటీరియర్‌లో కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా కస్టమైజ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ప్రతి రోల్స్ రాయిస్ అభిమానిని ఆకట్టుకునేలా డ్యాష్ బోర్డ్ మీద పెద్ద పరిమాణంలో ఉన్న గ్లాస్ ప్యానల్ ఉంది. చలి కాలంలో కారులో ప్రయాణిస్తున్నప్పుడు ఇంటీరియర్‌లో వెచ్చదనాన్ని అందించే ఫ్రంట్ డోర్ ఆర్మ్‌రెస్ట్, ఫ్రంట్ సెంటర్ కన్సోల్, సి-పిల్లర్ దిగువ భాగం, వెనుక సీటులో ఉన్న ఆర్మ్ రెస్ట్, వ్యక్తిగత సీట్లు ఉన్నాయి.







మనం ఆరోగ్యం
సోమవారం, 26 ఫిబ్రవరి 2018
www.manamnews.com



ఈ ప్రకృతిలో ప్రతి కూరగాయకూ ఓ ప్రత్యేకత ఉంది. రుచిలో దేనికదే రారాజు. పోషకాల పరంగా దేనికదే ఓ నిధి. వీటికి మరేదీ సాటి లేదు. శాస్త్రపరిశోధనా రంగం ఘంటాపథంగా చెబుతోందీ విషయం! కానీ ఈ పెరటి బంగారాల విలువను మనమే సరిగా గుర్తించటం లేదు!! కూరగాయల్లో పోషకాలకు కొరత లేదుగానీ.. మన పళ్లెంలో కూరలకే తగినంత చోటుండటం లేదు. పట్నం-పల్లె పేదా-పెద్ద తేడాలేం లేకుండా.. మన దేశంలో ఎవ్వరూ కూడా రోజువారీ తినాల్సినన్ని పండ్లను, కూరగాయలను తినటం లేదని సర్వేలు ఘోషిస్తున్నాయి. ఇది లేనిపోని రోగాలకు హేతువు అవుతుందనీ హెచ్చరిస్తున్నాయి. అందుకే కూరగాయలు దండిగా తినాల్సిన అవసరాన్నీ నొక్కి చెబుతూ సమగ్ర వివరాలను మీ కోసం...

కలుషితం కానివ్వొద్దు!



తినే ఆహారం కలుషితమైతే కడుపునొప్పి, విరేచనాల వంటి సమస్యలెన్నో వేధిస్తాయి. కాబట్టి భోజనం చేయటానికి ముందు మాత్రమే కాదు.. ఆహారం వండటానికి ముందూ చేతులను బాగా శుభ్రంగా కడుక్కోవాలి. అంతేకాదు.. కూరగాయలను పచ్చి మాంసం వంటి వాటితో కలవకుండా చూసుకోవాలి కూడా. లేకపోతే మాంసానికి అంటుకొని ఉండే బ్యాక్టీరియా వంటివి కూరగాయలకూ వ్యాపించే ప్రమాదముంది. ఇక వంటకాలను వేడివేడిగా తినటమే మంచిది. వండిన పదార్థాలను వేడి వాతావరణంలో గంట కన్నా ఎక్కువసేపు బయట ఉంచితే వాటిల్లో బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశముంది. దీంతో అది కలుషితమై రకరకాల అనర్థాలకు దారితీయొచ్చు.

కూరలు మరికాస్త... తినండి

రోజులో కూరగాయలు, పండ్లు కనీసం '5 పరిమాణాలు' తినాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు! కానీ మన దేశంలో ఎంత మంది దీన్ని పాటిస్తున్నారు?ఎక్కడా లేదు. దేశంలో ఎక్కడా.. ఏ వయసు వారూ.. ఈ స్థాయిలో పండ్లు, కూరగాయలు తినటం లేదని 'భారతీయ వృక్షసంబంధ పోషకాహార నివేదిక' ఇటీవలే నిగ్గు తేల్చింది. ఎవరూ కూడా గరిష్ఠంగా మూడున్నర మోతాదులకు మించి పండ్లూ, కూరగాయలూ తినటం లేదని ఈ అధ్యయనంలో తేలింది. దీనర్థం మనం రకరకాల దీర్ఘకాలిక వ్యాధుల ముప్పులో చిక్కుకుని ఉంటున్నామనే! దీని ప్రభావం ఇప్పటికే కనబడుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, వూబకాయం, గుండె జబ్బులు, క్యాన్సర్ల వంటి వ్యాధులు మరెక్కడా లేనంతగా మన దేశంలో పెచ్చుమీరిపోతున్నాయి. దీనికి మన జీవనశైలితో పాటు ఆహారపుటలవాట్లు కూడా మారిపోతుండటమే ముఖ్యకారణం. ఒకప్పటి కంటే నేడు మన ఆహారంలో- అనర్థదాయకమైన కొవ్వు, తీపి, పిండిపదార్థాలు అధికంగా ఉండే చిరుతిండ్లు, ఫాస్ట్ ఫుడ్స్ పెరిగిపోతున్నాయి. ఆ మేరకు మన పళ్లెంలో ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు తగ్గిపోతున్నాయి.

కూరగాయలు తింటే...



ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధన మండలి సిఫార్సుల ప్రకారం ప్రతి ఒక్కరూ రోజూ కనీసం '5 పరిమాణాల (5 సర్వింగ్స్) కూరగాయలు తినాలి. ఒక్కో పరిమాణం సుమారు 80 గ్రాములు అనుకుంటే రోజు మొత్తమ్మీద 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తినటం తప్పనిసరి. ప్రతి రోజూ ఆహారంలో దుంప కూరలు, ఆకు కూరలు, కాయగూరలు- మూడూ ఉండేలా చూసుకోవాలి. అయితే ఇంతకు మించి కూరగాయలను ఎంత ఎక్కువగా తింటే అంత లబ్ధి చేకూరుతోందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. తినే ముందు పళ్లెంలో ఏయే పదార్థాలు, ఎంత మొత్తంలో ఉన్నాయో చూసుకోవటం ఉత్తమం. పళ్లెంలో సగం కూరగాయలు, పండ్లు ఉండాలన్నది సిఫార్సు. పాల పదార్థాలు వెన్నతీసినవీ, ధాన్యాలు పొట్టు తీయనివీ ఉత్తమం.


తేలికగా తీసిపారెయ్యకండి!

మనలో చాలామంది అన్నం, రోటీలకు ఇచ్చినంత ప్రాధాన్యం కూరగాయలకు ఇవ్వటం లేదు. అన్నంతో పాటు ఏదో పొడి, పచ్చడి వంటివి వేసేసుకుని పూట నడిపేస్తుంటారు. ఇది సరికాదు. ఆహారంలో బియ్యం, పప్పు, పాలు, నెయ్యి ఎంత ముఖ్యమో కూరగాయలు, పండ్లు కూడా అంతకంటే ముఖ్యం. వీటిని ఎంత ఎక్కువ తీసుకున్నా లాభమేగానీ నష్టం ఉండదు. ముఖ్యంగా ఇప్పుడున్న జీవనశైలీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని చూస్తే కాయగూరలు ఎక్కువ తీసుకోవటం అవసరం కూడా. వీటిని ఉదయం టిఫిన్ నుంచీ ప్రతి పూటా, ప్రతి ఆహారంలోనూ ఏదో రూపంలో భాగం చేసుకోవటానికి ప్రయత్నించటం మంచిది.

శుభ్రంగా కడిగాకే కోయాలి

కూరగాయలను తరిగాక కడిగితే వాటిలోని పోషకాలు పోతాయి. కాబట్టి కూరగాయలను శుభ్రంగా కడిగాకే కోయాలి. అలాగే చిన్న ముక్కలుగా కొయ్యటం, మందంగా చెక్కులు తీసెయ్యటం సరికాదు. చాలామంది ఆలూ, బీర, కాకర వంటి కాయలను ఎక్కువగా చెక్కు తీసి వాడుతున్నారు. కానీ ఆ పొట్టు కింద పొరల్లోనూ బి-విటమిన్లు, పీచు, బీటాకెరటిన్ ఎక్కువగా ఉంటాయి. వాటిని కోల్పోకూడదు. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. బీర, సొర, దోస, పొట్ల, క్యాప్సికం, చిక్కుడు వంటి కాయగూరల్లో గింజలు తీసేయటం సరికాదు.

కాయగూరల్లో గింజలు తీసేయటం సరికాదు



అంతా మంచే!

చక్కటి ఆరోగ్యానికి ఏది అవసరమో సరిగ్గా అదే కూరగాయల్లో ఉంటుంది! కూరగాయల నుంచి మనకు అనవసర క్యాలరీలు రావు. వీటిలో కొవ్వు ఉండదు. కొలెస్ట్రాల్ అసలే ఉండదు. పిండి పదార్థం చాలా కొద్ది పరిమాణంలో ఉంటుంది. కాబట్టి వీటి నుంచి అనవసరంగా అదనంగా శక్తి రాదు.. అదే సమయంలో మన శరీరానికి అత్యవసరమైన విటమిన్లు, ఖనిజాలు దండిగా లభ్యమవుతాయి. మనకు మరెక్కడా లభించని సూక్ష్మపోషకాలు, పీచు వంటివన్నీ పండ్లు, కూరగాయల నుంచి లభిస్తాయి. అందుకే వీటిని 'పోషక గనులు'గా చెప్పుకోవచ్చు. మనకు కావాల్సిన పిండి పదార్థాల వంటివన్నీ- చాలా వరకూ ధాన్యాల నుంచి లభిస్తాయి. ఇక మాంసకృత్తులు- పప్పులు, మాంసం, పాల పదార్థాల వంటి వాటి నుంచి లభిస్తాయి. కానీ మన శరీరానికి అత్యవసరమైన విటమిన్లు, ఖనిజాల వంటి సూక్ష్మపోషకాలు, పీచు వంటివన్నీ దక్కాలంటే- అందుకు కూరగాయలు, పండ్లే ముఖ్యమైన ఆధారం. అందుకే మనం వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించటానికి లేదు.



పోషకాల గనులు!

కూరగాయల్లో పీచుతో పాటు విటమిన్లు, ఖనిజాల వంటి సూక్ష్మ పోషకాలెన్నో ఉంటాయి. ఇవన్నీ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

ఇనుము: మన శరీరంలోని ప్రతి కణానికీ ప్రాణవాయువు (ఆక్సిజన్) కావాలి. ఈ ప్రాణ వాయువును మోసు కుపోయేది రక్తంలోని ఎర్ర కణాలు, వాటిలో ఉండే హిమోగ్లోబిన్. ఈ హిమోగ్లోబిన్ తయార వ్వాలంటే ఇనుము అత్యవసరం. అందుకే మన ఆహారంలో ఇనుము లోపిస్తే.. రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గి, 'రక్తహీనత' తలెత్తుతుంది. అందుకని ఆహారంలో ఇనుము దండిగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకు రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు తప్పనిసరి.

రక్తనాళాల లోపలి గోడలు

కంటి చూపు బాగుండటానికి, రక్తనాళాల లోపలి గోడలు, అయవాల పైపొరలు ఆరోగ్యంగా ఉండటానికి విటమిన్-ఎ కీలకం. ఇది లోపిస్తే రకరకాల ఇన్ఫెక్షన్లూ వేధిస్తాయి. అందుకని విటమిన్-ఎ సమృద్ధిగా ఉండే పదార్థాలు తినటం అవసరం. ఇది ముదురు ఆకుపచ్చ, పసుపు, నారింజ రంగుల్లో ఉండే కూరల్లో దండిగా ఉంటుంది. ఆకు కూరలు, క్యారెట్లు, టమోటాలు, చిలగడదుంపలు, బొప్పాయి వంటివన్నీ కెరొటినాయిడ్స్‌ను దండిగా అందిస్తాయి, ఇవే శరీరంలో విటమిన్-ఎ రూపంలోకి మారతాయి.

శక్తి చెక్కు చెదరకుండా...

ఎముకలు, దంతాల, చిగుళ్ల ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తి చెక్కు చెదరకుండా ఉండటానికి ఇది అత్యవసరం. శరీరం ఇనుమును గ్రహించుకోవటానికీ ఇది తోడ్పడుతుంది. దీని లోపం రాకుండా ఉండేందుకు టమోటాల వంటి కూరగాయలు,



తాజా ఉసిరి, పుల్లటి పండ్లు, జామ పండ్లు, అరటి పండ్ల వంటివి తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే విటమిన్ సి తేలికగా వాతావరణంలోని ఆక్సిజన్ ప్రభావానికి గురై, వ్యర్థమైపోతుంది. కాబట్టి కూరగాయలు ఎండిపోకుండా తాజాగానే తినాలి, వాటిని కోసి పక్కన పెట్టకూడదు.

కీలకమైన పోషకం

రక్త కణాల తయారీకి కీలకమైన పోషకం ఇది. ఇది లోపిస్తే రక్తంలో మోసిస్టీన్ స్థాయిలు పెరిగి, గుండె జబ్బులు ముంచుకొస్తాయి. రక్తహీనత వేధిస్తుంది. అంతేకాదు, పిల్లల్లో పుట్టుకతో నాడీలోపాలు రాకుండా ఉండేందుకు గర్భిణులకు ఫోలిక్ యాసిడ్ చాలా అవసరం. ఆకు కూరలు, చిక్కుడు రకాలు, పప్పులు, ఎండు పప్పులు, కమలాలు, కార్జం వంటివాటిలో ఇది దండిగా ఉంటుంది.

క్యాలరీలు చాలా తక్కువ



కూరగాయల నుంచి లభించే క్యాలరీలు చాలా తక్కువ. అదే వీటితో ప్రత్యేక ప్రయోజనం! కాబట్టి వీటిని ఎక్కువగా తీసుకుంటూ అధిక బరువు, వూబకాయం నియంత్రణలో ఉండేలా చూసుకోవచ్చు. అయితే దుంపల నుంచి క్యాలరీలు అధికంగానే వస్తాయి కాబట్టి వాటిని కొంత పరిమితంగా తినాలి. కూరగాయల్లోని ఫైటోకెమికల్స్.. ముఖ్యంగా పీచు, యాంటీ ఆక్సిడెంట్ల వంటివి త్వరగా ముసలితనం ముంచుకు రాకుండా కాపాడతాయి. శుక్లాలు, గుండె జబ్బులు, మధుమేహం, కీళ్లనొప్పులు.. ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా రక్షణ ఇస్తాయి.

ఆహారం జీర్ణమయ్యేలా...



దాదాపు కూరగాయలన్నింటిలోనూ దండిగా ఉండే పీచు... తిన్న ఆహారం నిదానంగా జీర్ణమయ్యేలా చూస్తుంది. పేగుల కదలికలను మెరుగుపరచి మల బద్ధకం దరిజేరనివ్వదు. మొల లు, పెద్ద పేగుల్లో బుడిపెలు, క్యాన్సర్ కణుతుల వంటివి పెరగకుండా రక్షణ ఇస్తుంది. గుండె జబ్బు, మధుమేహం, వూబకాయం రాకుండా చూసుకోవటానికీ తోడ్ప డతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయులూ తగ్గుతాయి. ఇది రక్తపోటు నియంత్రణలో ఉండటానికి, కిడ్నీలో రాళ్ల ముప్పు తగ్గటానికి, ఎముక క్షీణత తగ్గటానికి తోడ్పడుతుంది. అరటిపండు, పుచ్చ పండు, చిలగడదుంపలు, బంగాళాదుంప, చిక్కుళ్లు, టమోటా, సోయాబీన్, పాలకూర, రాజ్మా వంటి వాటిల్లో ఇది దండిగా ఉంటుంది.

రకరకాలు మేలు!

రోజూ ఏదో ఒక కూరగాయో, పండో తీసుకుంటే మనకు అవసరమైన పోషకాలన్నీ అందవు. కాబట్టి రకరకాల కూరగాయలు, పండ్లు తినాలి. క్యారెట్, టొమాటో, బీట్‌రూట్.. ఇలా రంగు రంగుల కాయగూరలను ఎంచుకుంటే వీటిలోని రంగులో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఈ రంగు పదార్థాలు శరీరానికి ఉపయోగపడతాయి.దెబ్బతిన్న కణజాలం మరమ్మతుకు, క్యాన్సర్ కణాల నియంత్రణకు ఈ రంగు పదార్థాలు బాగా ఉపయోగపడతాయి. కూరగాయలు సాధ్యమైనంత తాజాగా ఉన్నవే తీసుకోవాలి. ముఖ్యంగా మరీ లేతగా లేని.. పక్వానికి వచ్చిన కాయగూరలే తీసుకోవాలి. ఇవి రుచికరంగానూ ఉంటాయి. వీటిలో పోషకాలూ ఎక్కువగా ఉంటాయి. వీలైనప్పుడల్లా కొత్త కొత్త కూరగాయలు, పండ్ల వంటివీ ఆహారంలో భాగం చేసుకోవటం మేలు.

ఈ తప్పులు చెయ్యొద్దు!

ప్రతి కాయగూరనూ వండుకునే తినాలని లేదు. కొన్నింటిని సలాడ్ల రూపంలో.. పచ్చికూర ముక్కల్లా తీసుకుంటే మంచిది. ముఖ్యంగా దోస, కీర, టమోటా, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాప్సికం వంటివి ఇలా తీసుకోవచ్చు. క్యాబేజీ ఆకులు, గోబీ పువ్వు, పచ్చి బఠాణీ, బీన్స్ వంటివి ఒక్కసారి బాగా మరిగిన వేడి నీటిలో వేసి, రెండు నిమిషాలు ఉంచి, తీసుకుని తినొచ్చు. కాయగూరలను ఎక్కువగా ఉడకబెట్టెయ్యటం, బాగా వేపుడులా చేసెయ్యటం మంచిది కాదు. దానివల్ల పోషక నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. కాయగూరల్లో సహజంగానే నీరు ఉంటుంది, ఉడికించటానికి అది సరిపోతుంది. కూరలు వండే సమయం ఎంత తగ్గిస్తే పోషక నష్టాన్ని అంతగా తగ్గించొచ్చు. చిక్కుళ్లు, క్యారెట్లు, బీట్‌రూట్ వంటివి చాలామంది వేపుడు కూరల్లా నూనె వేసి చాలాసేపు వేయిస్తుంటారు. కానీ వాటిని ముందే ఒక్కసారి ప్రెజర్ కుక్కర్లో ఉడికించి, చాలా కొద్దినూనెలో తాలింపు పెట్టుకుంటే ఎక్కువ పోషకాలు పోకుండా ఉంటాయి.



పోషకాలు తగ్గిపోతాయి

మరికొందరు క్యాబేజీ, గోరుచిక్కుడు, చిక్కుడుకాయ వంటి వాటిని ముందు నీటిలో ఉడికించి.. ఆ నీటిని పారబోసి కూర వండుతుంటారు. దీంతోనూ పోషకాలు తగ్గిపోతాయి. పెద్ద మంటపై ఉడికించి, కరకరలాడేలా నూనెలో ఎక్కువసేపు వేయించినా పోషకాలు తగ్గుతాయి. ప్రతి కాయగూరకూ దానికంటూ ప్రత్యేకమైన రంగు, రుచి, సువాసన ఉంటాయి. వాటికంటూ ఒక రకమైన క్షార-ఆమ్ల స్వభావం ఉంటుంది. వీటివల్ల రుచి మాత్రమే కాదు, జీర్ణప్రక్రియ కూడా చక్కబడుతుంటుంది.

ఎక్కువగా నీళ్లలో ఉడికించి...

కూరగాయలను ఎక్కువ నీళ్లలో ఉడికించి, ఆ నీళ్లను వంచెయ్యటం కూడా సరికాదు. దానివల్ల ఫోలిక్ ఆమ్లం, కొన్ని రకాల ఖనిజాలు వృథాపోతాయి. కాబట్టి వీలైనంత వరకూ కాయగూరల్లోని నీరే సరిపోతుంది. ఒకవేళ చాలవనుకుంటే కొద్ది నీళ్లలోనే ఉండికించుకోవాలి. వంపటం మాత్రం వద్దు. దొండ, బెండ వంటి కూరలతో వేపుడు చేసుకోవాలనుకుంటే చాలా మంది నేరుగా వాటిని బాండీలో వేసి చాలాసేపు వేపుతుంటారు. దీనికంటే కూడా ముందు కొద్దిసేపు మైక్రోవేవ్‌లో ఉంచి, మెత్తబడిన తర్వాత కొద్దినూనెలో వేపుకోవచ్చు. దానివల్ల పోషక నష్టం తగ్గుతుంది.



పోషకాలు తగ్గిపోతాయి

మరికొందరు క్యాబేజీ, గోరుచిక్కుడు, చిక్కుడుకాయ వంటి వాటిని ముందు నీటిలో ఉడికించి.. ఆ నీటిని పారబోసి కూర వండుతుంటారు. దీంతోనూ పోషకాలు తగ్గిపోతాయి. పెద్ద మంటపై ఉడికించి, కరకరలాడేలా నూనెలో ఎక్కువసేపు వేయించినా పోషకాలు తగ్గుతాయి. ప్రతి కాయగూరకూ దానికంటూ ప్రత్యేకమైన రంగు, రుచి, సువాసన ఉంటాయి. వాటికంటూ ఒక రకమైన క్షార-ఆమ్ల స్వభావం ఉంటుంది. వీటివల్ల రుచి మాత్రమే కాదు, జీర్ణప్రక్రియ కూడా చక్కబడు తుంటుంది కూరగాయలను ఎక్కువ సమయం వండటం, వాటిలో ఎక్కువెక్కువ మసాలాల వంటివి వెయ్యటం వల్ల వాటికి ఉండే సహజసిద్ధమైన రుచి, సువాసన పోతాయి. వాటివల్ల మనకు దక్కాల్సినంత లబ్ధి చేకూరదు.

మనం స్పోర్ట్స్
సోమవారం 26 ఫిబ్రవరి 2018
www.manamnews.com

అరుణకు అభినందనల వెల్లువ



మెల్‌బోర్న్ : ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల్లో కాంస్యపతకం గెలుచుకున్న తెలుగమ్మాయి అరుణారెడ్డిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. పలువురు క్రీడాకారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయంతో హైదరాబాద్ క్రీడారంగంలో కొత్త అధ్యాయం మొదలైందని, అరుణ మునుముందు మరిన్ని విజయాలతో దేశ కీర్తి ప్రతిష్టను పెంచటం ఖాయమని క్రీడా ప్రముఖులు అంటున్నారు. భారత జిమ్నాస్టిక్స్ సమాఖ్య, భారత ఒలింపిక్ అసోసియేషన్ అరుణారెడ్డికి అభినందనలు తెలిపాయి. త్వరలో ఆరుణను సత్కరిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ తెలిపింది.

ఫ్లోర్ ఈవెంట్‌లో ఏడో స్థానం

వాల్ట్ ఈవెంట్‌లో కాంస్యపతకం గెలుచుకుని సంచలనం సృష్టించిన అరుణ ఫ్లోర్ ఈవెంట్‌లో ఏడో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో 10.833 పాయింట్లతో అరుణ ఏడో స్థానంతో సరిపెట్టు కుంది. ఇక ఈ టోర్నీలో ఆడుతున్న భారత జిమ్నాస్ట్ ఆశిష్‌కుమార్ మెన్స్ వాల్ట్ ఈవెంట్‌లో 8వ స్థానంలో నిలిచాడు.

వచ్చే కామన్‌వెల్త్ క్రీడలపై దృష్టిపెట్టిన అరుణ ఈ నెల 28న భారత్‌కు వచ్చే అవకాశ ముంది. కామన్‌వెల్త్ క్రీడల కోసం ప్రత్యే కంగా శిక్షణ తీసుకుంటున్నందున మెల్ బోర్న్ నుంచి రష్యాకు వెళ్లి శిక్షణలో పాల్గొనేందుకు అరుణ ఏర్పాట్లు చేసుకుంది. అయితే మెల్‌బోర్న్‌లో మెడల్ రావడంతో భారత్‌కు వచ్చి ఒలింపిక్ అధికారులను కలిసే అవకాశముందని సమాచారం.



దక్షిణకొరియాలోని ప్యాంగ్ చాంగ్‌లో వింటర్ ఒలింపిక్స్ ఘనంగా ముగిశాయి. 17 రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో నార్వే 39 స్వర్ణ పతకాలతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. జర్మనీ, కెనడా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక ఈ ముగింపు వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజయ్యారు.2022 వింటర్ ఒలింపిక్స్ బీజింగ్‌లో జరుగుతాయి.



గర్వంగా ఉంది

కోహ్లీకి టెస్ట్ చాంపియన్‌షిప్ గద



కేప్‌టౌన్ : వరుసగా రెండో సారి ఐసిసి టెస్ట్ చాంపియన్ షిప్ అందుకోవటం గర్వంగా ఉందని టీమిండియా కెప్టెన్ కోహ్లీ అన్నాడు. ఈ ఘనత సాధించడానికి భారతజట్టుకు సపోర్ట్‌గా నిలిచిన అభిమానులకు కోహ్లీ థ్యాంక్స్ చెప్పాడు. 'మేం ఎక్కడ ఆడినా కష్టమైన సమయాల్లో మా తోటి ఆటగాళ్లకు అండగా నిలిచారు, అభిమానులందరికీ నా ధన్యవాదాలు'అంటూ కోహ్లీ ఐసిసి టెస్ట్ చాంపియన్ షిప్ అందుకున్నాక ఓ వీడియో సందేశం పంపాడు. ఐసిసీ టెస్ట్ టీమ్ ర్యాంకుల్లో భారత జట్టు అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. కేప్‌టౌన్‌లో శనివారం జరిగిన టి ట్వంటీ మ్యాచ్ తర్వాత ఐసిసి హాల్ ఆఫ్ ఫేమ్ టీమ్ మెంబర్లు గవాస్కర్, పొలాక్‌లు ఐసిసి టెస్ట్ చాంపియన్ షిప్ గదను కోహ్లీకి అందించారు. 6.5 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ కూడా భారత జట్టుకు లభించింది. టెస్టు ర్యాంకుల్లో వరుసగా రెండో ఏడాది భారత జట్టు టాప్ ప్లేస్‌లో నిలవడం ఆనందగా ఉందని కోహ్లీ చెప్పాడు. 'టెస్టుల్లో భారత అద్భుతంగా రాణిస్తోంది. రెండేళ్లుగా అత్యుత్తమ జట్టుగా ఎదుగుతున్నాం, వరుసగా రెండో ఏడాదీ టెస్ట్ చాంపియన్ షిప్ గద అందుకోవటం గర్వంగా ఉంది' అని కోహ్లీ చెప్పారు. ఈ అవార్డు జట్టుపై మరింత బాధ్యత పెంచుతుందని అన్నాడు.

కోహ్లీ రేర్ రికార్డ్

వెన్నెముక పట్టేయడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టి ట్వంటీ సిరీస్‌కు దూరమైనప్పటికీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. ఒ విదేశీ పర్యటనలో అత్యధిక రన్స్ చేసిన రెండో ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఈ సిరీస్‌లో టెస్ట్‌లు, వన్డేలు, టి ట్వంటీలు కలిపి మొత్తం 14 ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ 871 పరుగులు చేశాడు. ఈ జాబితాలో ఇంకు ముందు దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ 937 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. 2003 ఇంగ్లండ్ పర్యటనలో గ్రేమ్ స్మిత్ 16 ఇన్నింగ్స్‌లో 937 రన్స్ చేశాడు.

సౌతాఫ్రికాపై... గ్రాండ్ ఫినిష్

కొత్త చరిత్ర సృష్టించిన టీమిండియా

కుర్రాళ్లు అదరగొట్టారు. ఈ ఏడాది సౌతాఫ్రికా గడ్డపై జరిగిన తొలి సిరీస్‌లో కొత్త చరిత్ర సృష్టించారు. టెస్టుల్లో ఓడినా రెట్టించిన ఆత్మవిశ్వాసంతో వన్డే, టి20 సిరీస్‌లు గెలుచుకుని భారత క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించారు. సౌతాఫ్రికాపై చివరి టి20లో సాధించిన విజయంతో టూర్‌ను గ్రాండ్‌గా ఫినిష్ చేశారు. పాతికేళ్ల చరిత్రలో సౌతాఫ్రికా గడ్డపై భారత జట్టు ఒకే సారి రెండు సిరీస్‌లు గెలుచుకోవటం ఇదే ప్రథమం.



కేప్‌టౌన్: సౌతాఫ్రికాతో జరిగిన చివరి టి20 మ్యాచ్ విజయాన్ని భారత్ ఎంజాయ్ చేస్తోంది. అద్భుత విజయంతో అనేక రికార్డులు సొంతం చేసుకున్న భారత్ ఎక్కడైనా, ఎలాంటి జట్టైనా బెదిరేది లేదని ప్రత్యర్థులకు సవాల్ విసిరింది. దక్షిణాఫ్రికాలో జరిగిన టి 20 సిరీస్‌లో భారత జట్టు 2-1 విజయం సాధించిన విషయం తెలిసిందే. చివరి టీ20 మ్యాచ్‌లో కోహ్లీ గాయంతో తప్పుకోగా, అతని స్థానంలో రోహిత్ శర్మ చివరి మ్యాచ్‌కు సారథ్యం వహించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 7 పరుగులతో సఫారీలను భారత్ ఓడించింది. 'ప్రతికూల పరిస్థితుల్లో భారత ఎప్పుడూ వెనుకబడలేదు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా మేమందరం ఒకటై ప్రత్యర్థిపై కలిసి కట్టుగా ఆడి గెలిచామ'ని మ్యాచ్ ముగిశాక రోహిత్ అన్నాడు. ' ఈ సిరీస్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు టీ20 విజయాల్లో కీలక పాత్ర పోషించారు. భువనేశ్వర్ బౌలింగ్ చిరస్మరణీయం, బుమ్రా కూడా మెరుగ్గా రాణించాడు. పాండ్యా కూడా కీలక సమయాల్లో పొదుపు బౌలింగ్ చేసి తన వంతు పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో శిఖర్ ధావన్, సురేశ్ రైనా అద్భుతంగా ఆడారు. ఓవరాల్‌గా ఈ టూర్‌లో భారత జట్టు ప్రదర్శన ప్రశంసనీయమ'ని రోహిత్ అన్నాడు. త్వరలో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు సిరీస్‌లో కూడా అందరూ ఇలాగే రాణించాలని కొరుకొంటున్న అని రోహిత్ చెప్పాడు.



ఎలైట్ కెప్టెన్ జాబితాలో రోహిత్ శర్మ

భారత ఓపెనర్ రోహిత్ శర్మ అరుదైన క్లబ్‌లో చేరి పోయాడు.ఇంటర్నేషనల్ టి20ల్లో తొలి నాలుగు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయాలను అందుకున్న రోహిత్ శర్మ ఎలైట్ కెప్టెన్ల జాబితాలో స్థానం సంపాదించాడు. కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టి ట్వంటీకి రెగ్యులర్ కెప్టెన్ కోహ్లీ దూరమవడంతో రోహిత్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో రోహిత్ ఈ ఘనతను సాధించిన ఆరో కెప్టెన్ అయ్యాడు. గతంలో శ్రీలంకతో జరిగిన మూడు టి20ల సిరీస్‌కు మొదటి సారిగా రోహిత్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆ మూడు మ్యాచ్‌లను భారత క్లీన్ స్వీప్ చేసింది.

తాజాగా సఫారీలతో జరిగిన నాలుగో టి ట్వంటీలో నూ భారత జట్టును రోహిత్ గెలిపించాడు. ఈ అరుదైన లిస్ట్‌లో రోహిత్ కంటే ముందు మిస్బావుల్ హక్, సంగక్కర, ఆఫ్రిది, మలింగ, సర్ఫరాజ్‌లు ఉన్నారు. కోహ్లీ స్థానంలో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న రోహిత్ సారథ్యంలోని భారత టి20 జట్టు కేప్‌టౌన్‌లో జరిగిన ఆఖరి టి ట్వంటీ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడింది. అద్భుత ప్రదర్శనతో భారత్ విజయంలో రోహిత్ కీలక పాత్ర పోషించాడు. దీంతో భారత 2-1 తేడాతో సిరీస్ సొంతం చేసుకుంది. 2017 డిసెంబర్‌లో శ్రీలంకతో జరిగిన అంతర్జాతీయ టి20 సిరీస్‌కు భారత జట్టుకు తొలి సారిగా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన రోహిత్ విరాట్ వారసుడిగా పేరు సంపాదించాడు. ఆ సిరీస్‌ను భారత జట్టు 3-0 తేడాతో వైట్ వాష్ చేసింది. తాజాగా కోహ్లీ విశ్రాంతి సమయంలోనూ భారత జట్టు పగ్గాలు చేపట్టి తిరుగులేని రికార్డు సొంతం చేసుకున్నాడు.

బౌలర్లకు దాసోహం : డుమిని

భారత బౌలర్ల దుకుడు ముందు నిలబడలేకపోయామని దక్షిణ్రాఫ్రికా కెప్టెన్ డుమిని అన్నాడు. కేప్‌టౌన్‌లో జరిగిన చివరి టి 20 మ్యాచ్‌లో ఓటమి నిరాశ కలిగించిందని డుమిని చెప్పాడు. టీమిండియా బౌలర్లు పవర్ ప్లేలో అద్భుతంగా బౌలింగ్ చేశారని, అదే తమ ఓటమికి ప్రధాన కారణమని వివరించాడు. హిట్టింగ్ చేయకుండా తమను కట్టడి చేయడంతో పరుగులు వేగంగా సాధించలేకపోయామని అన్నాడు. తొలి ఆరు ఓవర్లలో సింగిల్స్ తీయటం కూడా కష్టమైందని, నకుల్ బాల్స్, స్లో బంతులతో తమను బాగా ఇబ్బంది పెట్టారని, దీంతో పవర్ ప్లేలో 30 రన్స్ దాకా వెనుకబడ్డామని వివరించారు. చివరి టెస్ట్‌లో గెలిచాక భారత జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగిందని, దాంతో వన్డే, టి ట్వంటీ సిరీస్‌లను భారత్ గెలుచుకోగలిందని చెప్పాడు. అయితే ఈ ఓటమి నుంచి పాఠాలను నేర్చుకుంటామని,మొత్తంగా ఇదొక అద్భుతమైన సిరీస్ అని డుమిని చెప్పుకొచ్చాడు.

3వ ర్యాంక్ పదిలం



దక్షిణాఫ్రికాతో ముగిసిన టి20 సిరీస్‌లో విజయం సాధించిన భారత జట్టుకు ర్యాంకుల్లో పైపైకి దూసుకెళుతోంది. ఆదివారం ఐసిసి విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో భారత జట్టు ఒక పాయింట్ మెరుగు పరచుకుని 122 పాయింట్లతో మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది. ఒక పాయింట్ చేజార్చు కున్న దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో ఏడో స్థానానికి పరిమితమైంది. ఈ జాబితాలో 126 పాయింట్లతో పాకిస్తాన్ టాప్ ప్లేస్‌లో ఉండగా,దశాంశాల్లో వ్యత్యాసాల కారణంగా అంతే పాయింట్లు ఉన్న ఆస్ట్రేలియా ఆ తర్వాత స్థానంలో ఉంది. న్యూజిలాండ్ (116), నాలుగు, వెస్టిండీస్ (115), ఐదు, ఇంగ్లండ్ (114), ఆరు, దక్షిణాఫ్రికా (111)ఏడు, శ్రీలంక (91) ఎనిమిది, బంగ్లాదేశ్ (72) టాప్ టెన్‌లో ఉన్నాయి. ఇక బ్యాటింగ్ విభాగంలో భారత ఆటగాళ్లు శిఖర్ ధావన్, ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌లు తాజా ర్యాంకుల్లో ఎగబాకారు. మూడు టి20 సిరీస్‌ల్లో 143 రన్స్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచిన ధావన్ 14 స్థానాలు మెరుగుపరచుకని కెరీర్‌లోనే అత్యుత్తమంగా 28 వస్థానంలో నిలిచాడు ఏడు వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ 20 స్థానాలు మెరుగుపరచుకుని 12వ స్థానంలో నిలిచాడు.

ఐపీఎల్ మ్యాచ్ రీ షెడ్యూల్ కుదరదు

ఐసీసీకి బీసీసీఐ షాక్

న్యూఢిల్లీ : కోల్‌కతాలో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) కీలక సమావేశం ఉన్నందున తమ సభ్యులు చూసేందుకు వీలుగా ఐపీఎల్ మ్యాచ్‌లు రీ షెడ్యూల్ చేయాలన్న వినతిని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) తిరస్కరించింది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో ఏప్రిల్ 22 నుంచి 26 మధ్య కోల్‌కతాలో ఐసిసీ అత్యున్నత వార్షిక సమావేశం జరుగుతుంది. అదే సమయంలో ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్ నిర్వహించాలని ఐసిసీ కోరింది. అయితే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు హోమ్ గ్రౌండ్‌లో ఏప్రిల్ 16న తొలి మ్యాచ్ ఆడుతుంది. మే మూడున తర్వాత మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్‌లో ఆడుతుంది. ఈలోగా హైదరాబాద్, ముంబాయి, ఇండోర్, బెంగళూరు, జైపూర్‌లలో జరిగే మ్యాచ్‌లో నైట్ రైడర్స్ ఆడుతుంది. ఐపీఎల్ టోర్నీ రీ షెడ్యూల్ చేయాలని ఐసిసీ నుంచి లేఖ అందిందని, ఒక వేళ మ్యాచ్‌లను రీ షెడ్యూల్ చేస్తే టోర్నమెంట్ మొత్తం మార్చాల్సి వస్తుందని బీసీసిఐ ప్రతినిధి తెలిపారు.

దటీజ్ ద్రావిడ్

అండర్ -19 ఆటగాళ్లకు నజరానాపై మారిన నిర్ణయం



అండర్ -19 ప్రపంచ కప్ గెలిచిన భారత కుర్రాళ్లకు బీసీసీఐ ప్రకటించిన నజరానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కోచ్ ద్రావిడ్ అనుకున్నది సాధించాడు. ప్రధాన కోచ్ ద్రావిడ్‌కు 50 లక్షలు, జట్టులో ఆటగాళ్లకు 30 లక్షలు, సహాయక సిబ్బందికి 20 లక్షలు ఇస్తామని బోర్డు ప్రకటించటంపై బహిరంగంగా ద్రావిడ్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో క్రికెట్ బోర్డు మనసు మార్చుకుంది. అందరికీ 25 లక్షలు చొప్పున ప్రోత్సహకాలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. చనిపోయిన టీమ్ ట్రైనర్ రాజేశ్ సావంత్ కుటుంబానికి ఆర్థిక సాయం చేయనున్నట్టు బీసీసీఐ తెలిపింది.

కోహ్లీకి రెస్ట్ - రోహిత్‌కు పగ్గాలు


శ్రీలంకలో ట్రై సిరీస్‌కు భారత జట్టు ● హైదరాబాద్ పేసర్ సిరాజ్‌కు మరో ఛాన్స్

ముంబాయి : వచ్చే నెల ఆరు నుంచి శ్రీలంకలో జరిగే ముక్కోణపు టి ట్వంటీ సిరీస్‌లో పాల్గొనే భారత జట్టుకు రోహిత్ శర్మ సారథ్యం వహించనున్నాడు. ఊహించిన విధంగానే కెప్టెన్ కోహ్లీతో పాటు మాజీ కెప్టెన్ ధోని, బౌలర్లు బుమ్రా, భువనేశ్వర్‌కుమార్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతి ఇచ్చిన సెలెక్టర్లు శ్రీలంక టూర్‌లో ఆడే 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించారు. దినేశ్ కార్తీక్‌తో పాటు ఏడాది తర్వాత జట్టులో చేరిన సురేశ్ రైనా సౌతాఫ్రికా టూర్‌లో రాణించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మిడిల్‌ఆర్డర్‌లో మనీష్ పాండే మరో సారి కీలక ఆటగాడిగా మారాడు. సిరీస్‌కు దూరమైన ఆరుగురు కీలక ఆటగాళ్ల స్థానాల్లో దీపక్ హుడా, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, మహ్మద్ సిరాజ్ జట్టులోకొచ్చారు. బౌలర్లలో జయదేవ్ పేస్ బౌలింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. శార్థూల్ ఠాకూర్, సిరాజ్‌లు జయదేవ్‌కు సహకరిస్తారు. చాహల్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ బౌలింగ్ భారం మోస్తారు. ఇద్దరు వికెట్ కీపర్లు రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్‌లను సెలెక్టర్లు ఈ టీ 20 సిరీస్‌కు ఎంపిక చేశారు. హైదరాబాద్ పేస్ బౌలర్ సిరాజ్‌కు మరో సారి సెలెక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. త్వరలో ఐపీఎల్, ఆ తర్వాత ఇంగ్లండ్ పర్యటన ఉండడంతో దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ పర్యటనలో ఆడిన సీనియర్లకు విశ్రాంతి కల్పించాలని నిర్ణయించామని, వారి స్థానంలో శ్రీలంకలో జరిగే ముక్కోణపు టి ట్వంటీ సిరీస్‌లో యువ ఆటగాళ్లకు అవకాశమిచ్చామని సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపారు.



సిరాజ్

తప్పించారా.. ఒప్పించారా!



శ్రీలంక టోర్నీ కోసం ఎంపిక చేసిన జట్టులో ధోని పేరులేకపోవడంపై పెద్ద చర్చే జరుగుతోంది. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనలో మూడు టెస్ట్‌లు, ఆరు వన్డేలు, మూడు టి20లు ఆడిన భారత సీనియర్లు అలసిపోయారని అందుకే లంకలో జరిగే ట్రై సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించామని బోర్డు చెబుతోంది. ఏప్రిల్‌లో జరిగే ఐపిఎల్, ఆ తర్వాత జరిగే ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో సీనియర్లను రెస్ట్ ఇచ్చామని చెబుతున్నప్పటికీ కేవలం టి20లు మాత్రమే ఆడుతున్న ధోని పేరు జట్టులో లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మూడు టి ట్వంటీలు ఆడిన ధోనికి విశ్రాంతి ఇచ్చి మూడు ఫార్మాట్లలోనూ ఆడిన రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లను లంకతో టూర్‌కు ఎంపిక చేయటం ఎందుకని విశ్లేషకుల ప్రశ్న. ధోని తనకు విశ్రాంతి కావాలని కోరాడని అందుకే తప్పించామని సెలెక్టర్లు చెబుతున్నారు. అయితే గత ఏడాది రవిచంద్రన్, అశ్విన్, జడేలాకు టి 20 జట్టనుంచి రెస్ట్ ఇచ్చి జట్టుకు దూరం చేశారు. ఇక తాజాగా లంకతో జరిగే టి 20 ట్రై సిరీస్‌కు ఇద్దరు వికెట్ కీపర్లను ఎంపిక చేయటం, ధోనిని తప్పించడంతో పలురకాల ఆలోచనలు మొదలయ్యాయి. ధోని మునుపటిలా ఆడలేకపోతున్నాడన్న విమర్శల నేపథ్యంలో సెలెక్టర్ల నిర్ణయం పలు సందేహాలకు దారితీస్తోంది.

టి20 ట్రై సిరీస్ షెడ్యూల్

- మార్చి 6 : భారత్ x శ్రీలంక
- మార్చి 8 : భారత్ x బంగ్లాదేశ్
- మార్చి 10: శ్రీలంక x బంగ్లాదేశ్
- మార్చి 12 : శ్రీలంక x భారత్
- మార్చి 14: భారత్ x బంగ్లాదేశ్
- మార్చి 16 : శ్రీలంక x బంగ్లాదేశ్
- మార్చి 18 : ఫైనల్

మ్యాచ్‌లన్నీ కొలంబో ప్రేమదాస స్టేడియంలో జరుగుతాయి.

భారత జట్టు : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్. రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్థూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్).



గంగూలీకి ముషారఫ్ వార్నింగ్!

కోల్‌కతా : తన ఆత్మకథ 'ఏ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్'లో టీమిండియా మాజీకెప్టెన్ సౌరవ్ గంగూలీ మరో సంచలన విషయాన్ని వెల్లడించాడు. అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు తనకు వార్నింగ్ ఇచ్చాడని దాదా తన పుస్తకంలో తెలిపాడు. 2004లో పాకిస్తాన్‌తో వన్డే సిరీస్ ఆడేందుకు వెళ్లినప్పుడు ఇది జరిగిందని గంగూలీ వివరించాడు. గంగూలీ సారథ్యంలోని భారత జట్టు లాహోర్‌లోని స్విస్ పెరల్ కాంటినెంటల్ హోటల్ ఉంది. అప్పటికే ఈ సిరీస్‌ను 3-2 తేడాతో భారత్ గెలిచింది. ఈ విజయంతో భారత్ హోటల్ బయటకు వెళ్లి సెలబ్రేట్ చేసుకోవాలని ఉత్సాహంతో ఉంది. అప్పటికే పొద్దుపోవటంతో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటారని టోపీలు పెట్టుకుని హోటల్ వెనుక నుంచి జట్టు సభ్యులంతా బయటకు వెళ్లారు.. అయితే ఆ విషయం ఎలాగో లీకై ముషారఫ్ దాకా చేరింది. దీంతో ఆయన గంగూలీకి వార్నింగ్ ఇచ్చారట. ముందు చెబితే సెక్యూరిటీని ఇచ్చి పంపుతామని అన్నారట. ఇంకో సారి ఇలాంటి సాహసాలు చేయద్దని ముషారఫ్ హెచ్చరించారని గంగూలీ తన ఆత్మకథలో వెల్లడించాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.